# భారత శక్తి®

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి - 20 | సంచిక - 184 | హైదరాబాద్ | శనివారం 10-01-2026 | పేజీలు : 12 | వెల : 1.00





11లో

ఈ ఏడాది తెలంగాణ నుంచి ఇద్దరు, ఏపీ నుంచి నలుగురు రాజ్యసభ ఎంపీల రిటైర్మెంట్

## చంద్రబాబుకు విజ్ఞప్తి చేస్తున్నా

# వివాదాలపై రేవంత్ రెడ్డి కీలక సూచన




11లో

- జల వివాదాలను మనమే పరిష్కరించుకుందామన్న రేవంత్ రెడ్డి
- రాజకీయాలకు అతీతంగా నీళ్ల సమస్యను పరిష్కరించుకుందామని వ్యాఖ్య
- కోర్టుల్లో కాకుండా మన సమస్యలు మనమే పరిష్కరించుకుందామని స్పష్టీకరణ
- ఏపీ ఒక అడుగు వేస్తే, తెలంగాణ పది అడుగులు వేస్తుందన్న రేవంత్ రెడ్డి




11లో

## ఏపీకి పెట్టుబడులు రావడానికి

# 3 ప్రధాన కారణాలివే


- పుణే పబ్లిక్ పాలసీ ఫెస్టివల్ కు హాజరైన ఏపీ మంత్రి నారా లోకేశ్
- రాష్ట్రాల అభివృద్ధికి ప్రభుత్వాల కొనసాగింపు అత్యంత కీలకమని వెల్లడి
- ఫిబ్రవరిలో ఆర్సెలర్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ పనులకు శ్రీకారం
- అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ ఏర్పాటుకు వేగంగా అడుగులు

## తిరుమలలో రికార్డు స్థాయిలో

# వైకుంఠ ద్వార దర్శనాలు

- విజయవంతంగా ముగిసిన తిరుమల వైకుంఠ ద్వార దర్శనాలు
- రికార్డు స్థాయిలో 7.83 లక్షల మంది భక్తులకు శ్రీవారి దర్శన భాగ్యం
- 10 రోజుల్లో రూ.41 కోట్ల హుండీ ఆదాయం, 44 లక్షల లడ్డూల విక్రయం
- టీటీడీ ఏర్పాట్లపై 93 శాతం భక్తులు పూర్తి సంతృప్తి
- ఏఐ కమాండ్ కంట్రోల్ రూమ్‌తో క్యూలైన్ల పర్యవేక్షణ విజయవంతం

11లో





11లో

## హిమాచల్ ప్రదేశ్ లో

# ఘోర బస్సు ప్రమాదం


- హిమాచల్ ప్రదేశ్‌లో 200 మీటర్ల లోతైన లోయలో పడిన ప్రైవేట్ బస్సు
- ప్రమాదంలో 12 మంది మృతి, 33 మందికి గాయాలు
- పొగమంచు కారణంగానే ప్రమాదం జరిగిందని ప్రాథమిక అంచనా
- ఘటనపై విచారణకు ఆదేశించిన హిమాచల్ ప్రభుత్వం

## గుజరాత్‌లో

# వరుస భూప్రకంపనలు

**గంటల వ్యవధిలో 12కు పైగా ప్రకంపనలు**

- గురువారం రాత్రి నుంచి శుక్రవారం మధ్యాహ్నం వరకు ప్రకంపనలు
- రిక్టర్ స్కేలుపై తీవ్రత 2.6 నుంచి 3.8 మధ్య నమోదు
- భూమి కంపించడంతో ఇళ్లలో నుంచి బయటకు పరుగు తీసిన ప్రజలు




11లో

## పవిత్రమైన శాసనాలు..

# చేయాల్సిన సభ..

శాసనసభ సమావేశాలు: ప్రజాస్వామ్యానికి నిలువుటద్దంలా ఉండాలా..? కుహనా రాజకీయాలకు నాటక వేదికలుగా ఉండాలా..? సో కాల్డ్ రాజకీయ నాయకులారా మీ గుండెలపై చేయివేసుకుని ఒక్కసారి ఆలోచించండి.. మీరు తిట్టుకోవడానికి ఒకరినొకరు ఎత్తిపొడుచుకోవడానికి కోట్లు ఖర్చుపెట్టి నిర్వహిస్తున్న అసెంబ్లీని వేదికకా మార్చుకుంటున్నారు కాస్తైనా ఇంగితజ్ఞానం ఉండాలి కదా..? ఎలా చెబితే మీకు అర్థం అవుతుంది..? ఏ చెప్పుతో కొడితే దారికి వస్తారు..? ఇది సామాన్యుడు అనుకుంటున్నా మాట.. అక్షరాల్లో రాయడానికి మాకు సిగ్గుగా ఉంది.. కానీ తప్పడం లేదు.. నిన్నటికి నిన్న సాక్షాత్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు రేవంత్ రెడ్డి గారు నీటి వ్యవహారాలపై మాట్లాడుతూ బీ.ఆర్.ఎస్. నేతలపై విరుచుకు పడ్డారు.. నాలుక కోసేస్తానని, ఇవి అన్ పార్లమెంటరీ లాంగ్వేజ్ అనుకుంటే రికార్డులనుండి తొలగించమని, ప్రజలకు అర్థం కావడానికే ఇలాంటి మాటలు మాట్లాడుతున్నానని చెప్పడం దేనికి సంకేతం..? మీ పెర్సనల్ కోపాలు ప్రదర్శించుకోవడానికి కాదు కదా అసెంబ్లీ ఉన్నది.. అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు సామాన్య ప్రజలు, మేధావులు, సామాజిక వేత్తలు, విశ్లేషకులు.. సమాధానం చెప్పండి సార్..



12లో



11లో

## కోనసీమ గ్యాస్ లీక్‌పై

# సీఎం చంద్రబాబు ఏరియల్ సర్వే

- సంక్రాంతి సెలవులకు సొంతూళ్లకు పయనమవుతున్న జనాలు
- జనసంద్రాన్ని తలపిస్తున్న రైల్వే స్టేషన్లు
- ఇప్పటికే 150 ప్రత్యేక రైళ్లను అనౌన్స్ చేసిన దక్షిణ మధ్య రైల్వే

# భారత్ చుట్టూ సమస్యలు

ప్రపంచ రాజకీయాల్లో మార్పు సంకేతాలు కనిపించాయి. ప్రపంచం ఒక కొత్త అధ్యాయం దిశగా కదులుతున్నట్టు అనిపించింది. కొత్త నిర్మాణాన్ని రూపొందించే ప్రయత్నాలు ముమ్మరం అయ్యాయి.పొరుగు దేశాలైన బంగ్లాదేశ్, నేపాల్‌లో ఈ ఏడాది జరిగే ఎన్నికలు ఆయా దేశాల అంతర్గత అంశాలు మాత్రమే కాదు. ఈ ఎన్నికలు దక్షిణాసియా స్థిరత్వం, భారత భద్రతా సమస్యలు, ప్రాంతీయ సమతుల్యత వంటి అంశాలతో లోతుగా ముడిపడి ఉన్నాయి.మరోవైపు, యుక్రెయిన్-రష్యా యుద్ధం ఇకపై యూరప్‌కు మాత్రమే పరిమితమైన వివాదం కాదు. ఇది ప్రపంచ ఇంధన సరఫరాలు, ఆహార భద్రత, అంతర్జాతీయ నైతిక విలువలకు తీవ్రమైన పరీక్షగా మారింది.భారత్ ఇప్పటివరకూ చర్చలు, సమన్వయం, వ్యూహాత్మక స్వయంప్రతిపత్తి విధానాన్ని అనుసరిస్తోంది.భారత్ స్పష్టంగా ఏదో ఓవైపు ఉండాల్సి వస్తుందా?భారత్ చాలాకాలంగా 'బహుళ ధ్రువ ప్రపంచ క్రమం' గురించి మాట్లాడుతోంది. అంటే అధికారం కొన్ని దేశాల చేతుల్లో మాత్రమే కేంద్రీకృతమై ఉండని ప్రపంచం. అయితే 'బహుళ ధ్రువ ప్రపంచం' అనేది ఒక ఆలోచన మాత్రమేనా, లేదా అది నిజంగా వాస్తవ రూపం దాల్చగలదా?ఈ చర్చలో భారత్ – చైనా సంబంధాలు కూడా కేంద్రబిందువయ్యాయి. ఒకవైపు, రెండు దేశాలు ఆర్థికపరంగా ఒకదానిమీద ఒకటి బాగా ఆధారపడి ఉన్నాయి. మరోవైపు సరిహద్దు ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. వ్యూహాత్మక అపనమ్మకం పెరుగుతోంది. చర్చలకు మార్గాలు తెరిచే ఉన్నప్పటికీ, అదే సమయంలో అపనమ్మకం స్పష్టంగా ఉంది.భారత విదేశాంగ విధానం కూడా ఆర్థిక రంగంలో కొత్త దశలోకి ప్రవేశించింది. అనేక దేశాలతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు ప్రారంభమవుతున్నాయి. అమెరికాతో వాణిజ్య సంబంధాల్లో సవాళ్లు కొనసాగుతున్నాయి.గత ఏడాది ప్రారంభంలో, డోనల్డ్ ట్రంప్ రెండోసారి అమెరికా అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆయన్ను కలిసిన మొదటి నలుగురు ప్రపంచ నాయకులలో భారత ప్రధాని నరేంద్ర మోదీ కూడా ఒకరు. ఈ సమావేశంలో మోదీని తన "గొప్ప స్నేహితుడు" అని ట్రంప్ అభివర్ణించారు.అయితే కొన్నినెలలుగా మోదీ, ట్రంప్ మధ్య సంబంధాలు ట్రంప్ మొదటి పదవీకాలంలో కనిపించినంతగా లేవు. ఈ మారుతున్న వాతావరణంలో ట్రంప్ ప్రభుత్వం భారత్‌పై రెండు రకాల సుంకాలను విధించింది. ఒకటి వాణిజ్య కారణాలతో, ఇంకొకటి రష్యా నుంచి చమురు కొంటున్నందుకు.భారత్‌పై అమెరికా మొత్తం 50 శాతం సుంకాలు విధించింది. ఆసియా దేశాలలో విధించిన అత్యధిక సుంకం ఇది.ఆస్ట్రేలియాతో చర్చలు మంచిస్థాయిలో ఉన్నాయి. న్యూజీలాండ్, ఒమన్‌లతో ఒప్పందాలు కుదిరాయి. యూకేతో యూరోపియన్ యూనియన్‌తో, ఆ తర్వాత అమెరికాతో వాణిజ్య ఒప్పందం కుదిరితే భారత్‌కు చాలా ఉపశమనం కలుగుతుంది..నేపాల్‌లో సార్వత్రిక ఎన్నికలు 2026 మార్చి 5న జరగనున్నాయి. బంగ్లాదేశ్‌లో 2026 ఫిబ్రవరి 12న ఎన్నికలు జరుగుతాయి. రెండూ భారత్‌కు పొరుగు దేశాలు, వ్యూహాత్మకంగా ముఖ్యమైనవిగా పరిగణిస్తారు.ఇటీవలి సంవత్సరాలలో, ఈ రెండు దేశాలతో భారత సంబంధాలు మునుపటిలా సజావుగా లేవు.మరి.. నేపాల్, బంగ్లాదేశ్‌లో ఎన్నికల తర్వాత కొత్త ప్రభుత్వాలు ఏర్పడితే, భారత్ తన సంబంధాలను పునరుద్ధరించుకోవడానికి అవకాశం దక్కుతుందా? బంగ్లాదేశ్‌లో మైనారిటీలపై జరిగిన సంఘటనలను పరిగణనలోకి తీసుకుంటే అక్కడి ఎన్నికలు భారత్‌కు చాలా ముఖ్యమైనవి"

ఎన్నికల తర్వాత ఏ కొత్త ప్రభుత్వం ఏర్పడినా, భారత్ దానితో సంబంధాలను బలోపేతం చేసుకోవడానికి ప్రయత్నించాలని ఆయన భావిస్తున్నారు.షేక్ హసీనా ప్రభుత్వాన్ని ప్రస్తావిస్తూ, ఆ సమయంలో రెండు దేశాల మధ్య సంబంధాలు చాలా బలంగా ఉన్నాయన్నారు. కానీ, భారత్ ఒక పెద్ద వ్యూహాత్మక తప్పు చేసిందనే వాదన ఉంది,షేక్ హసీనా అధికారంలో ఉన్నప్పుడు సంబంధాలు చాలా బాగుండేవి. కానీ, బీఎన్‌పీ, ప్రతిపక్ష పార్టీలతో సంబంధాలకు ప్రయత్నించకపోవడం తప్పు. ఒకప్పుడు మనకు మంచి పొరుగు దేశం, మిత్రుడైన బంగ్లాదేశ్‌ను ఇపుడు మనం కోల్పోయాం. ఇప్పుడు తీసుకురావడం చాలా ముఖ్యం" అని అన్నారు.భారత్ తన విదేశాంగ, వాణిజ్య విధానంలో వైవిధ్యాన్ని కొనసాగించాలని ఆమె సూచించారు.భారత్ అనేక దేశాలతో సంబంధాలను కొనసాగించాలి, ఏదేని విషయం కోసం ఒకే దేశంపై ఆధారపడకుండా ఉండాలి. ఒకే దేశంపై ఆధారపడితే, అది సమస్యలను సృష్టించవచ్చు" అన్నారు అర్పితా ముఖర్జీ.భారత్ చాలాకాలంగా రష్యాతో మంచి సంబంధాన్ని కలిగి ఉంది.

చైనా ప్రపంచ సూపర్ పవర్‌గా మారుతోంది. కీలకమైన ఖనిజాలు, ఆయుధాలలో దాని పాత్రను చాలా ఉంది,అమెరికా ఎజెండాను పరిశీలిస్తే, అది 'మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్' అంటే 'మాగా'. ఈ ఎజెండా కింద, అది దాదాపు అన్ని దేశాలపై సుంకాలను విధించింది" అమెరికా సుంకాలు విధించినప్పుడు, ఎవరు మిత్రుడు, ఎవరు శత్రువు అని చూడలేదుభారత్ ఎల్లప్పుడూ చైనాతో మంచి, బలమైన సంబంధాలను కొనసాగించాలి. వాణిజ్య సమతుల్యత మనకు వ్యతిరేకంగా ఉండటమే. ప్రస్తుత కాలంలో అమెరికా అధ్యక్షుడు డోనల్డ్ ట్రంప్‌తో వ్యవహరించడంలో ఏ దేశ విదేశాంగ విధానానికైనా పెద్ద పరీక్షే. 2023లో అధ్యక్షుడు బైడెన్ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని యూఎస్ పర్యటనకు ఆహ్వానించారు. చాలా తక్కువ మంది ప్రపంచ నాయకులకు దక్కిన గౌరవమది" అని ఆయన గుర్తుచేశారు.ప్రధాని మోదీ అయినా లేదా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ అయినా, ప్రతి ఒక్కరికీ వారి సొంత అహం ఉంటుంది. కానీ, అతిపెద్ద అహం ట్రంప్. ఆ అహాన్ని ఎవరు డీల్ చేస్తారు, ఎలా చేస్తారనేది ప్రశ్న. బ్రిటన్ దీన్ని చేయగలిగింది

# ఆరుగురు వైసీపీ ఎమ్మెల్యేలపై కఠిన చర్యలు

విజయవాడ, జనవరి 9, భారత శక్తి ప్రతినిధి,

ఆంధ్రప్రదేశ్ శాసనసభలో నైతిక విలువల కమిటీ సమావేశం అయింది. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కి చెందిన ఆరుగురు ఎమ్మెల్యేలు సభా కార్యక్రమాలకు హాజరుకాకుండానే, అన్ని రకాల ప్రభుత్వ ప్రయోజనాలను పొందుతున్నారనే ఫిర్యాదులపై ఈ కమిటీ చర్చించింది.ఆంధ్రప్రదేశ్ శాసనసభ నిబంధనలను ధిక్కరిస్తూ, సభా కార్యక్రమాలకు గైర్హాజరవుతున్న ఆరుగురు వైసీపీ ఎమ్మెల్యేల తీరుపై ఎథిక్స్ కమిటీ సీరియస్ అయింది. శాసనసభ సమావేశాలకు రాకుండా పార్టీ నిర్ణయం పేరుతో బయటే ఉంటున్న ఈ ఎమ్మెల్యేలు, ప్రభుత్వ ఖజానా నుండి అందే జీతాలు, టీఏ , డీఏ లను మాత్రం క్రమంతప్పకుండా తీసుకుంటున్నట్లు కమిటీ ప్రాథమికంగా గుర్తించింది. ప్రజాప్రతినిధులుగా ప్రజల గొంతుకను సభలో వినిపించాల్సిన బాధ్యతను విస్మరించి, కేవలం ఆర్థిక ప్రయోజనాల కోసం పదవులను వాడుకోవడం నైతికంగా నేరమని కమిటీ సభ్యులు అభిప్రాయపడ్డారు. స్పీకర్ కూడా ఈ విషయంలో అత్యంత కఠినంగా ఉండాలని భావిస్తున్నారు. సభకు రావడం అనేది ఎమ్మెల్యేల హక్కు మాత్రమే కాదు, అది వారి ప్రాథమిక బాధ్యత. ప్రజల సొమ్మును జీతాలుగా తీసుకుంటూ సభను బహిష్కరించడం శాసనసభను అవమానించడమే అని స్పీకర్



కార్యాలయ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. నిబంధనల ప్రకారం, స్పీకర్ అనుమతి లేకుండా వరుసగా 60 రోజుల పాటు సభకు హాజరుకాకపోతే సదరు సభ్యత్వంపై అనర్హత వేటు వేసే అధికారం సభకు ఉంటుంది. అయితే, ఇప్పుడు జీతాల రికవరీ , ఇతర కఠిన చర్యల దిశగా అడుగులు పడుతున్నాయిశాసనసభ నిబంధనల ప్రకారం ఎథిక్స్ కమిటీ స్పీకర్‌కు సిఫారసులు చేసే అవకాశం ఉంది. సభకు హాజరుకాని రోజులకు సంబంధించిన జీతాన్ని, అలవెన్సులను నిలిపివేయడం లేదా రికవరీ చేయడం, నిబంధనల ఉల్లంఘన తీవ్రతను బట్టి నిర్దిష్ట కాలం పాటు సభ నుండి సస్పెండ్ చేయడం, ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తూ, నిరంతరం గైర్హాజరవుతున్న వారి సభ్యత్వాన్ని రద్దు చేయాలని సభకు నివేదించడం చేయవచ్చు. ప్రస్తుతం ఈ వ్యవహారంలో ఆ ఆరుగురు ఎమ్మెల్యేలకు నోటీసులు జారీ చేసి, వివరణ కోరాలని కమిటీ నిర్ణయించినట్లుగా తెలుస్తోంది. వారిచ్చే వివరణ సంతృప్తికరంగా లేకపోతే, రాబోయే అసెంబ్లీ సమావేశాల్లోనే వీరిపై కఠిన చర్యలు తీసుకునేలా స్పీకర్‌కు తుది నివేదిక సమర్పించనుంది. విపక్ష హోదా లేదన్న సాకుతో సభకు రాకుండా తప్పించుకుంటున్న ఎమ్మెల్యేలకు ఈ పరిణామం ఒక పెద్ద హెచ్చరికగా మారనుంది.

చీలక తప్పదంటున్న యనమల

వైఎస్ జగన్ అసెంబ్లీ కార్యకలాపాలను బహిష్కరిస్తున్నట్లు ప్రకటిస్తే, వైసీపీ ఎమ్మెల్యేలు మాత్రం ఆయనకు తెలియకుండా రిజిస్టర్లో సంతకాలు చేయడం ఆ పార్టీలో అంతర్గత విభేదాలను ప్రతిబింబిస్తోందని తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ పరిణామాలు భవిష్యత్తులో వైసీపీలో చీలికకు దారితీయెచ్చని అభిప్రాయపడ్డారు. సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించేందుకు ప్రజలు వారిని ఎన్నుకుంటే సమావేశాలను బహిష్కరించడాన్ని ప్రజలు గమనించాలన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 190 (4) ప్రకారం అనర్హత వేటు పడుతుందనే భయంతోనే వారు ఇలా చేస్తున్నట్లు స్పష్టంగా తెలుస్తోందని వ్యాఖ్యానించారు.

# ఫిబ్రవరిలో డీఎస్సీ నోటిఫికేషన్

విజయవాడ, జనవరి 9, భారత శక్తి ప్రతినిధి,

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉపాధ్యాయ కొలువుల కోసం నిరీక్షిస్తున్న నిరుద్యోగులకు ప్రభుత్వం తీపి కబురు చెప్పనుంది. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ఫిబ్రవరి మొదటి వారంలో డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసేందుకు పాఠశాల విద్యాశాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తోంది. ఈ దఫా సుమారు 2500 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. కేవలం ఖాళీలను భర్తీ చేయడమే కాకుండా విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చే దిశగా పరీక్ష విధానంలో కూడా మార్పులు చేస్తోంది.రాష్ట్రంలో గతే ఏడాది ప్రభుత్వం డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ ఉద్యోగాలను భర్తీ చేసింది. అయినా ఇంకా ఉపాధ్యాయుల కొరత ఉండనే ఉంది. దీనికి తోడు ఈ ఏడాది కూడా భారీగా ఉపాధ్యాయులు ఉద్యోగాల నుంచి రిటైర్ కానున్నారు. పాఠశాల విద్యాశాఖ జరిపిన తాజా సమీక్షలో మొత్తం ఖాళీలు 2500 వరకు ఉన్నట్టు తేల్చారు. ప్రభుత్వ పాఠశాలల్లో బోధన నాణ్యత తగ్గకుండా ఉండాలంటే ఖాళీలను తక్షణమే భర్తీ చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. విద్యారంగంలో సంస్కరణల్లో భాగంగా గతంలో వివాదాస్పద జీవో 117ను ప్రభుత్వం రద్దు చేసింది. దీని స్థానంలో తొమ్మిది కొత్త విధానాలను అమలులోకి తీసుకొచ్చింది. ఈ కొత్త విధానం ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా 9200 ప్రాథమిక పాఠశాలలను మోడల్ ప్రైమరీ స్కూళ్లుగా తీర్చి దిద్దారు. ఈ పాఠశాలల్లో ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండేలా నిబంధనలు మార్చారు. ఇటీవల చేపట్టిన ఉపాధ్యాయ బదిలీల ప్రక్రియ ముగిసిన తర్వాత క్షేత్రస్థాయిలో వాస్తవ ఖాళీలపై స్పష్టత వచ్చింది. బదిలీల అనంతరం సుమారు 1146 మంది ఉపాధ్యాయులు అదనంగా అవసరం ఉన్నట్టు అధికారులు గుర్తించారు. ప్రస్తుతం ఈ స్థానాల్లో తాత్కాలికంగా అకాడమిక్ ఇన్‌స్ట్రక్టర్లను నియమించారు. అయినా శాస్వత ప్రాతిపదికన డీఎస్సీ ద్వారా వీరిని భర్తీచేయాలని మరో నోటిఫికేషన్ వేయనున్నారు. ఈసారి డీఎస్సీ రాసే అభ్యర్థులకు ఒక కొత్త సవాలు ఎదురుకానుంది. మారుతున్న కాలానికి అనుగుణంగా డిజిటల్ విద్యను ప్రోత్సహించే ఉద్దేశంతో ఉపాధ్యాయులకు ఆంగ్లభాషా ప్రావీణ్యం, కంప్యూటర్ అవగాహనపై ఒక ప్రత్యేక పేపర్‌ను ప్రవేశ పెట్టాలని విద్యాశాఖ ప్రతిపాదించింది. ఇప్పటి వరకు కేవలం సబ్జెక్ట్ నైపుణ్యాలకే పరిమితమైన డీఎస్సీ, ఇకపై ఏపీపీఎస్సీ తరహాలో అభ్యర్థుల బహుముఖ నైపుణ్యాలను పరీక్షించనుంది. ప్రాథమిక స్థాయిలోనే విద్యార్థులకు ఆంగ్ల భాషపై పట్టు సాధించేలా చేయాలంటే బోధించే ఉపాధ్యాయులకు ఆ నైపుణ్యం ఉండాలనేది ప్రభుత్వ ఆలోచన, అందుకే ఈ కొత్త పేపర్‌ను డీఎస్సీలో అంతర్భాగం చేయనున్నారు. ఇది అభ్యర్థుల ఎంపికలో కీలక పాత్ర పోషించనుంది. గత నెలలో నిర్వహించిన టెట్ లితాలను జనవరి 19న విడుదల చేయనున్నారు. ఇప్పటికే ప్రాథమిక కీ విడుదల చేశారు. దీనిపై అభ్యంతరాలను కూడా పరిశీలిస్తున్నారు. అనంతరం ఫైనల్ కీ విడుదల చేస్తారు. తర్వాత ఫలితాలను రిలీజ్ చేస్తారు. డీఎస్సీకి టెట్ అర్హత ప్రాధాన్యత కలిగినది కావడంతో ఈ ఫలితాల కోసం లక్షల మంది ఎదురు చూస్తున్నారు.

# అనకాపల్లిపై పట్టు కోసం...

విశాఖపట్టణం, జనవరి 9, భారత శక్తి ప్రతినిధి,

సీఎం రమేష్. తెలుగు స్టేట్స్‌లో పాపులర్ లీడర్. గతంలో టీడీపీలో ఉన్నా..ఇప్పుడు బీజేపీలో ఉన్నా..ఆయన స్టైలే వేరు. లాబీయింగ్ చేయడంలో ఆయన తర్వాతే ఎవరైనా అన్న పేరుంది. కడప జిల్లాకు చెందిన సీఎం రమేశ్ ప్రస్తుతం బీజేపీ తరుపున అనకాపల్లి ఎంపీగా ఉన్నారు. గత ఎన్నికల వరకు సీఎం రమేశ్ ప్రత్యక్ష ఎన్నికల్లో గెలిచింది లేదు. రాజ్యసభకు నామినేట్ అవుతూ పెద్దల సభకు వెళ్లే వారు. గత ఎన్నికల్లో అదును చూసి మరి..కూటమి ఊపులో నామినేట్ పదవులకు స్వస్తి చెప్పి ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేసి గెలిచారు. కడప జిల్లా నుంచి వచ్చి అనకాపల్లిలో ఎంపీ ఏంటీ.. అంటూ మొదట కొందరు విమర్శలు చేసినా, సీఎం రమేశ్‌కు వచ్చిన మెజార్టీ చూశాక అప్పట్లో అందరూ షాక్ అయ్యారట.ఫస్ట్ టైమ్ డైరెక్ట్ ఎలక్షన్స్‌లో ఎంపీగా పోటీ గెలిచిన..సీఎం రమేశ్ తన పొలిటికల్ ఫ్యూచర్‌పై డెప్త్‌గా




ఫోకస్ పెట్టారట. ప్రజలతో నిత్యం టచ్‌లో లేకపోతే లాంగ్ టర్మ్ పొలిటిక్స్ చేయడం కష్టమని భావించి అనకాపల్లి ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటున్నారట. అనకాపల్లిని తన పర్మినెంట్ సీటుగా చేసుకునే ప్లాన్ చేస్తున్నారట. ఇకపై తన రాజకీయ క్షేత్రం అనకాపల్లే అంటూ అనుచరులకు సంకేతాలు ఇస్తున్నారట సీఎం రమేష్.చంద్రబాబుకు కుప్పం, జగన్‌కు పులివెందుల తరహాలో సీఎం రమేశ్ అంటే అనకాపల్లి అనేలా గ్రౌండ్ వర్క్ చేసుకుంటూ పోతున్నారట. తనకంటూ ఓ పర్మినెంట్‌గా ఓ సీటు లేకపోతే ఎన్నికలు వచ్చిన ప్రతీసారి నియోజకవర్గాన్ని వెతుక్కోవడం, అక్కడ అంతా సెట్ చేసుకోవడం కష్టమైన పని అని భావిస్తున్నారట. అందుకే అనకాపల్లి ప్రజల మనసును గెలచుకునేలా పనిచేసి..తన సీటును పదిలం చేసుకోవాలని ప్లాన్ చేస్తున్నారట.సీఎం రమేశ్ అనకాపల్లిపై ఫోకస్ పెట్టడానికి రాజకీయ, సామాజిక, ఆర్థిక కారణాలు చాలానే ఉన్నాయన్న టాక్ వినిపిస్తోంది. అనకాపల్లిలో బీసీ ఓటర్లు అత్యధికం. బీసీలు ఎవరి పక్షనా ఉంటే వారికే పట్టం. సీఎం రమేశ్ సామాజిక వర్గానికి చెందిన ఓట్లు కూడా అధికంగానే ఉన్నాయి. టీడీపీకి అనకాపల్లి కంచుకోట. ఇక్కడైతే తనకు ఎలక్షన్ చేయడం చాలా ఈజీ అని సీఎం రమేశ్ భావిస్తున్నారట. అందుకే అనకాపల్లిని తన సొంత, శాశ్వత నియోజకవర్గంగా చేసుకునే ఎత్తుగడ వేస్తున్నారట

.క్యాంప్ ఆఫీస్ పెట్టి నిత్యం ప్రజలకు తన తరుపున..అధికారులు, అనుచరులు అందుబాటులో ఉండేలా చూస్తున్నారట. తరుచూ నియోజవకర్గంలో పర్యటిస్తూ..శుభకార్యాలు, పరామర్శలు ఉంటే నేరుగా సీఎం రమేశే హాజరవుతున్నారట. ఆయన అందుబాటులో లేకపోతే, తన సోదరుడు లేకపోతే కుమారుడు నియోజకవర్గ వ్యవహారాలు చూసుకుంటున్నారట.అయితే అనకాపల్లి జిల్లాలో అర్సలర్ మిట్టల్ స్టీల్ ప్లాంట్, బల్క్ డ్రగ్ పార్కు, డేటా సెంటర్, గ్రీన్ ఎనర్జీ, ఫార్మా ప్రాజెక్టులు రానున్నాయి. ఇవన్నీ కేంద్ర ప్రభుత్వ అనుమతులుతో రావాల్సినవే. ఈ ప్రాంత అభివృద్ధికి తన వంతు చేస్తున్న కృషిని కూడా సీఎం రమేశ్ గట్టిగానే ప్రచారం చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలోనే అనకాపల్లి అంటే సీఎం రమేష్ అని గుర్తుకొచ్చేలా ఎత్తులు వేస్తున్నారనే టాక్ ఇటీవల ఊపందుకుంది.అయితే ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఎన్నికలప్పుడు లోకల్, నాన్ లోకల్ స్లోగన్ బలంగా వినిపిస్తుంటుంది. ప్రత్యర్థులు, సొంత పార్టీలో ఉండే ఆశవాహులు వాడే లోకల్, నాన్ లోకల్ వెపన్‌ను సీఎం రమేష్ ఎలా ఫేస్ చేస్తారో చూడాలి.

# యాక్టివ్ పాలిటిక్స్ కు జెంటిల్ మ్యాన్ గుడ్ బై...

విజయవాడ, జనవరి 9, భారత శక్తి ప్రతినిధి,

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో మృదుస్వభావిగా, వివాదరహితుడిగా పేరున్న బీజేపీ సీనియర్ నేత, కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాసరావు సంచలన నిర్ణయం తీసుకున్నారు. 2024 ఎన్నికల విజయం తర్వాత, తన రాజకీయ భవిష్యత్తుపై స్పష్టతనిస్తూ.. "ఇకపై ఎన్నికల్లో పోటీ చేయను.. రాజకీయాల నుంచి తప్పుకుంటా" అని ప్రకటించడం రాష్ట్ర రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీసింది. కేవలం తప్పుకోవడమే కాదు, తన కుటుంబం నుంచి కూడా ఎవరూ రాజకీయాల్లోకి రారని చెప్పడం ద్వారా ఆయన వారసత్వ రాజకీయాలకు తాము దూరమని స్పష్టం చేశారు.కామినేని శ్రీనివాసరావు మౌలికంగా రాజకీయ కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తి కాదు. ఆయన వృత్తి రీత్యా వైద్యుడు. లండన్ లాంటి ప్రదేశాల్లో ఉన్నత వైద్య విద్యను అభ్యసించిన ఆయన, తొలినాళ్లలో వైద్య సేవల్లోనే నిమగ్నమయ్యారు. అయితే, ఎన్టీఆర్ హయాం నుంచే ఆయనకు రాజకీయ ప్రముఖులతో, ముఖ్యంగా చంద్రబాబు నాయుడు, వెంకయ్య నాయుడు వంటి అగ్రనేతలతో సన్నిహిత సంబంధాలు ఉండేవి. ఆ సాన్నిహిత్యం, ప్రజాసేవ చేయాలనే తపన ఆయన్ని ప్రత్యక్ష రాజకీయాల వైపు నడిపించింది.2014 ఎన్నికలు కామినేని రాజకీయ జీవితంలో అత్యంత కీలకమైనవి. అప్పటి టీడీపీ-బీజేపీ పొత్తులో భాగంగా కైకలూరు నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసిన ఆయన ఘన విజయం సాధించారు. ఆ విజయంతో చంద్రబాబు మంత్రివర్గంలో వైద్య, ఆరోగ్య శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. ఒక డాక్టర్‌గా వైద్య శాఖ మంత్రి పగ్గాలు చేపట్టడం ఆయనకు బాగా కలిసొచ్చింది. ప్రభుత్వ ఆసుపత్రుల బలోపేతం, ఎన్టీఆర్ వైద్య సేవ వంటి పథకాల అమలులో ఆయన తనదైన ముద్ర వేశారు.కామినేని శ్రీనివాసరావు రాజకీయ నిబద్ధతకు 2018 ఒక ఉదాహరణగా నిలిచింది. అప్పట్లో ఏపీకి ప్రత్యేక హోదా విషయంలో కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వంపై నిరసనగా టీడీపీ కూటమి నుంచి బయటకు వచ్చింది. చంద్రబాబుతో వ్యక్తిగతంగా మంచి స్నేహం ఉన్నప్పటికీ, పార్టీ నిర్ణయానికి కట్టుబడి కామినేని మంత్రి పదవికి రాజీనామా చేశారు. ఆ సమయంలో ఆయన చేసిన ఉద్వేగభరిత ప్రసంగం అసెంబ్లీలో అందరినీ ఆకట్టుకుంది.తాజా ప్రకటనలో



ఆయన చెప్పినట్లుగా.. 2019 తర్వాత ఆయన క్రియాశీల రాజకీయాలకు దూరంగా ఉండాలని భావించారు. కానీ, 2024 ఎన్నికల సమయంలో మళ్లీ పొత్తులు కుదరడం, స్థానికంగా ప్రజలు, పార్టీ శ్రేణులు, అధినాయకత్వం ఒత్తిడి తేవడంతో ఆయన పోటీ చేయక తప్పలేదు. అయితే, ఈసారి ప్రజలు ఆయనకు ఊహించని మెజారిటీని కట్టబెట్టారు. కూటమి అభ్యర్థిగా కైకలూరు నుంచి భారీ ఆధిక్యంతో గెలుపొందారు. ఈ గెలుపు ఆయన వ్యక్తిగత ఇమేజ్‌కి నిదర్శనం.తాజాగా ఆయన చేసిన ప్రకటనలో ఒక పరిణతి కనిపిస్తుంది. పదవులను పట్టుకుని వేలాడకుండా, గెలిచినప్పుడే గౌరవంగా తప్పుకోవాలనే ఆయన నిర్ణయం అభినందనీయం. "రాజకీయాలకు అతీతంగా పని చేసి పేరు తెచ్చుకుంటా" అని ఆయన చెప్పడం, రాబోయే రోజుల్లో ఆయన పూర్తిస్థాయిలో సామాజిక సేవా కార్యక్రమాలపై దృష్టి సారించనున్నారని స్పష్టం చేస్తోంది.రాజకీయాల నుంచి తప్పుకుంటానన్నంత మాత్రాన పాలనలో అలసత్వం ఉండదని ఆయన తేల్చిచెప్పారు. కైకలూరులో అక్రమాలు, అన్యాయాలు జరిగితే సహించేది లేదని, చట్టపరంగా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించడం ద్వారా తన అధికారిక బాధ్యతలను గుర్తుచేశారు. ఇక, సంక్రాంతి పండుగ వేళ జూదాలు వద్దు సంప్రదాయ క్రీడలే ముద్దు అని పిలుపునివ్వడం, యువత పెడదోవ పట్టకుండా ఆయన చూపిస్తున్న శ్రద్ధకు అద్దం పడుతోంది.మొత్తానికి, సౌమ్యుడిగా, 'జెంటిల్ మ్యాన్ పొలిటీషియన్'గా పేరు తెచ్చుకున్న కామినేని శ్రీనివాస్.. తన తాజా నిర్ణయంతో మరోసారి విలువల రాజకీయాలకు ప్రాధాన్యతనిచ్చినట్లయింది.

# వివాదాల్లో రఘురాముడు..

ఏలూరు, జనవరి 9, భారత శక్తి ప్రతినిధి,



ఏపీ రాజకీయాల్లో మరోసారి హాట్ టాపిక్‌గా మారింది డిప్యూటీ స్పీకర్ రఘురామరాజువ్యవహారం. రాజ్యాంగ పదవిలో ఉంటూ ఆయన చేస్తున్న రాజకీయ వ్యాఖ్యలు, ఇటు టీవీ అటు యూట్యూబ్ డిబేట్లలో పాల్గొని ప్రత్యర్థి పార్టీలపై విమర్శలు చేయడంపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో జైభీమ్ పార్టీ నేతలు నేరుగా రాష్ట్రపతి దృష్టికి ఈ అంశాన్ని తీసుకెళ్లడం రాష్ట్ర రాజకీయ వర్గాల్లో చర్చకు దారి తీసింది. డిప్యూటీ స్పీకర్ హోదాలో ఉండి రాజకీయ విమర్శలు చేయడం రాజ్యాంగ నిబంధనలకు విరుద్ధమని జైభీమ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పరసా సురేష్ కుమార్ రాష్ట్రపతికి ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదును పరిశీలించిన రాష్ట్రపతి కార్యాలయం తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాసింది. ఈ లేఖ ముఖ్యమంత్రి కార్యదర్శి విజయానంద్ )కు చేరడంతో, ఈ అంశం మరింత సంచలనంగా మారింది. ఇదిలా ఉండగా, జైభీమ్ పార్టీ అధ్యక్షుడు జడ శ్రవణ్ కుమార్ కూడా డిప్యూటీ స్పీకర్ ప్రవర్తనపై తీవ్రంగా స్పందించారు. స్పీకర్ డిప్యూటీ స్పీకర్ వంటి ఉన్నత పదవుల్లో ఉన్నవారు పార్టీ రాజకీయాలకు దూరంగా ఉండాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు. అలాంటి పదవులు చేపట్టే సమయంలో పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేయాలనే ఆచారం ఉందని గుర్తు చేశారు. కానీ రఘురామరాజు ఆ నిబంధనలను పట్టించుకోకుండా విపక్షంపై వ్యాఖ్యలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఈ విషయంలో కోర్టు ను కూడా ఆశ్రయించనున్నట్లు ప్రకటించారు. ఈ పరిణామాల నేపథ్యంలో ఏపీ రాజకీయ వాతావరణం వేడెక్కింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీతరఫున ఎమ్మెల్యేగా గెలిచిన రఘురామరాజు, మంత్రి పదవిని ఆశించినప్పటికీ, చివరకు డిప్యూటీ స్పీకర్ పదవి దక్కింది. ఆయన మాటల దూకుడే ఇందుకు కారణమని అప్పట్లో రాజకీయ వర్గాల్లో చర్చ జరిగింది. సభాపీఠంపై ఉండటం వల్ల ఆయన రాజకీయ వ్యాఖ్యలకు కట్టడి పడుతుందన్న అంచనాతోనే ఈ పదవి ఇచ్చారని కూటమినేతలు భావించినట్లు సమాచారం. అయితే ఆ అంచనాలకు భిన్నంగా రఘురామరాజు వ్యవహరిస్తున్నారని అంటున్నారు. గతంలో వైసీపీ ఎంపీగా ఉన్న సమయంలోనే స్వపక్షంపై విరుచుకుపడి సంచలనంగా మారిన ఆయన, ఇప్పుడు కూడా అదే తరహా ధోరణి కొనసాగిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. అప్పట్లో తనపై నమోదైన రాజద్రోహం కేసులపై ఇప్పటికీ న్యాయపోరాటం చేస్తున్న ఆయన, మీడియా వేదికగా రాజకీయ ప్రత్యర్థులను టార్గెట్ చేస్తున్నారని విపక్షం అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. ఈ మొత్తం వ్యవహారంలో వైసీపీ నేరుగా రంగంలోకి దిగకపోయినా, జైభీమ్ పార్టీ ద్వారా ఫిర్యాదు చేయించడమే రాజకీయంగా ఆసక్తికరంగా మారింది. డిప్యూటీ స్పీకర్ నోటికి నిజంగానే తాళం పడుతుందా? లేక ఈ వివాదం మరింత ముదిరుతుందా? అన్నది ఇప్పుడు ఏపీ రాజకీయాల్లో అందరూ ఎదురుచూస్తున్న ప్రశ్నగా మారింది.

# రాజధాని రచ్చ...

విజయవాడ, జనవరి 9, ( భారత శక్తి ప్రతినిధి,

ఆంధ్రప్రదేశ్ లో మరోసారి రాజధాని అమరావతి హాట్ టాపిక్ గా మారింది. రెండో విడత భూ సమీకరణ జరుగుతున్న నేపథ్యంలో వైఎస్ జగన్ చేసిన వ్యాఖ్యలు కలకలం రేపుతున్నాయి. మరోసారి ఏపీ రాజకీయాల్లో వేడిని పుట్టించాయి. వైఎస్ జగన్




ఈ సమయంలో రాజధాని అమరావతిపై వ్యాఖ్యలు చేయడం కొంత ప్రభుత్వాన్ని కూడా ఇబ్బందుల్లోకి నెట్టినట్లయింది. దీంతో వైఎస్ జగన్ కు మంత్రులు కౌంటర్ ఇస్తున్నారు. . విజయవాడ, గుంటూరుకు నలభై కిలోమీటర్ల దూరంలో రాజధాని అమరావతి ఉందని తెలిపారు. రాజ్యాంగంలో రాజధాని అనే పదం ఎక్కడా లేదని జగన్ అన్నారు. నదీపరీవాహక ప్రాంతంలో రాజధాని నిర్మాణం చేయడం సరికాదని వైఎస్ జగన్ వ్యాఖ్యానించారు. అక్కడ నగరం నిర్మించాలనుకోవడం సరికాదని జగన్ వ్యాఖ్యానించారు. అమరావతిలో మౌలిక సదుపాయాలు లేవని జగన్ అన్నారు. అక్కడ నీరు, విద్యుత్తు, రహదారి సౌకర్యం కూడా లేదని వైఎస్ జగన్ అన్నారు. ముఖ్యమంత్రి ఎక్కడ కూర్చుని పనిచేస్తే అదే రాజధాని అవుతుందని వైఎస్ జగన్ అన్నారు. అమరావతి రాజధానిగా అనువైన ప్రదేశం కాదని వైఎస్ జగన్ అన్నారు. అసలు మౌలిక సదుపాయాలు లేని చోట రాజధాని నిర్మాణం చేయడం సరికాదని తెలిపారు. రివర్ బేసిన్ లో నిర్మాణాలు చేపట్టడం సరికాదని జగన్ వ్యాఖ్యానించారు. భవనాలు కట్టుకోవాలన్నా అనుమతి కావాల్సి ఉంటుందని జగన్ వ్యాఖ్యానించారు. గుంటూరు – విజయవాడ మధ్య రాజధాని నిర్మాణం చేపట్టి ఉంటే బాగుండేదని జగన్ అభిప్రాయపడ్డారు. అయితే మంత్రి నారాయణ మాట్లాడుతూ జగన్ కు రాజధాని పై అవగాహన లేదని అన్నారు. నదీ గర్భంలో నిర్మాణాలు చేపడతామని మంత్రి నారాయణ ప్రశ్నించారు. గతంలో శాసనసభలో అమరావతి లో రాజధాని నిర్మాణంపై జగన్ చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా ఉపయోగించుకోవడం కోసమేనన్న అభిప్రాయం వ్యక్తం చేశారు. దీంతో మరోసారి రాజధాని రచ్చ మొదలయింది. రైతుల్లో నెలకొన్న అసంతృప్తి రెండో విడత భూ సమీకరణ నేపథ్యంలో మొదటి సారి చేసిన భూ సమీకరణ చేసిన దాంట్లోనే అభివృద్ధిచేయలేన్న అభిప్రాయం వినిపిస్తున్న సమయంలో ఈ వ్యాఖ్యలు కలకలం రేపాయి. అమరావతి పనులు వేగం పుంజుకున్న సమయంలో ఓర్చుకోలేక జగన్ ఈ రకమైన దాడికి రాజధానిపై దిగారని మంత్రులు విరుచుకుపడుతున్నారు. మొత్తం మీద మరోసారి అమరావతి రాజధాని రాజకీయంగా రచ్చగా మారింది.

========================

# కవ్విస్తున్న చైనా

న్యూఢిల్లీ, జనవరి 9, భారత శక్తి ప్రతినిధి,




భారత్‌తో మంచిగా ఉన్నట్లు నటిస్తూనే వెనుక గోతులు తవ్వే చర్యలో చైనా ఎప్పుడూ ముందు వరుసలోనే ఉంటుంది. తాజాగా పాకిస్థాన్, చైనా సంబంధాలు బలోపేతమయ్యాయంటూ బలుచిస్థాన్ మానవ హక్కుల కార్యకర్త మీర్ యార్ బలూచ్.. భారత విదేశాంగ మంత్రి జైశంకర్‌కు లేఖ రాయడం చర్చనీయాంశంగా మారింది. చైనా–పాకిస్థాన్ ఎకనామిక్ కారిడార్ (సీపెక్) ప్రాజెక్టు చివరి దశకు చేరుకుందని.. ఈ క్రమంలో తన పెట్టుబడులను కాపాడుకోవడానికి వ్యూహాత్మకంగా వ్యహరిస్తున్న చైనా నేరుగా తన సైన్యాన్ని బలూచిస్థాన్ గడ్డపై దింపేందుకు సిద్ధమవుతోందని లేఖలో రాసుకొచ్చారు. బలూచిస్థాన్‌లో చైనా సైనిక ఉనికి కేవలం స్థానిక ప్రజల సమస్య మాత్రమే కాదని, దీనివల్ల భారత్‌కు కూడా ప్రమాదం పొంచి ఉందన్నారు. బలూచిస్థాన్ రక్షణ, తమ దళాల సామర్థ్యాలను బలోపేతం చేయకపోతే దీర్ఘకాలంలో చైనా దళాలు మోహరించే అవకాశముందని, ఇదే జరిగితే భారత్ సరిహద్దులో భద్రతా సవాళ్లు ఊహించని రీతిలో పెరుగుతాయని హెచ్చరించారు. బలూచిస్థాన్ రక్షణకు హానీ కలిగించే ఇలాంటి అపవిత్ర కూటమిని అడ్డుకోవడానికి భారత్, బలూచిస్తాన్ మధ్య పరస్పర సహకారం అవసరమన్నారు. పాక్‌తో కలిసి చైనా పన్నుతున్న కుయుక్తులను అడ్డుకోవడంలో బలూచిస్థాన్ పూర్తి మద్దతు భారత్‌కే ఉంటుందని మీర్ యార్ బలూచ్ చెప్పడం ముదావహం. అయితే చైనా మనపై కవ్వింపు చర్యలకు పాల్పడడం ఇదేమీ తొలిసారి కాదు. రెండు రోజుల కిందట చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యి.. గతేడాది మేలో జరిగిన భారత్–పాక్ యుద్ధాన్ని ఆపేందుకు చైనా మధ్యవర్తిత్వం వహించిం దంటూ పేర్కొనడం ఆసక్తి కలిగించింది. 'ఆపరేషన్ సిందూర్' సమయంలో పాక్ సైన్యం వాడిన ఆయుధ సామగ్రిలో చైనా సరఫరా చేసినవే ఎక్కువగా ఉన్నాయని, దాని విలువ 81 శాతమని కూడా తేలింది. ఇప్పటికే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అవకాశం వచ్చినప్పుడల్లా భారత్, పాక్ యుద్ధాన్ని తానే ఆపానంటూ పేర్కొన్న ప్రతీసారి భారత్ ఖండిస్తూనే వచ్చింది. ఇక బ్రహ్మపుత్ర నదిపై 15.27 లక్షల కోట్ల రూపాయల ఖర్చుతో ప్రపంచంలోనే అతి పెద్ద ఆనకట్టను నిర్మిస్తున్నట్టు చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ప్రకటన చేశారు. ఈ ఆనకట్ట వల్ల బ్రహ్మపుత్రలో భారత్ వాటాకు గండిపడడంతో పాటు మన దేశంలోని ఈశాన్య రాష్ట్రాలకు వరద ముప్పు పెరిగే అవకాశముంటుంది. ఈ విషయమై భారత్ గతంలోనే చైనాను హెచ్చరించింది. ఇక మనతో సరిహద్దుల్లో అకారణంగా వైరానికి దిగడం చైనాకు అలవాటే. గతంలో గల్వాన్ లోయలో జరిగిన ఘర్షణే ఇందుకు ఉదాహరణ. అంతేకాదు చైనాకు సరిహద్దు ప్రాంతంగా ఉన్న అరుణాచల్ ప్రదేశ్ తమదేనంటూ పదే పదే ప్రచారం చేసుకునే చైనా అందులోని కొన్ని గ్రామాల పేర్లు అనైతికంగా మార్చే ప్రయత్నాలు చేసి అప్రతిష్టను మూటగట్టుకుంది. చైనా తలపెట్టిన ప్రాజెక్టులు, ఆనకట్టలు అన్నీ పొరుగుదేశాల హక్కులను కాలరాసేవే. చైనా ప్రాబల్య కాంక్షవల్ల భారత్ సహా పొరుగు దేశాలన్నీ ఇబ్బందులకు గురవుతున్నాయి. మహామార్గం వన్ రోడ్డు వన్ బెల్ట్ ప్రాజెక్టు పేరిట భూటాన్, నేపాల్, తదితర పొరుగు రాష్ట్రాల్లో భూభాగాలను కాజేసే యత్నాలను చైనా ఇదివరకే ప్రారంభించింది. ఒకవైపు పాకిస్థాన్, మరోవైపు బంగ్లాదేశ్ తమ ధోరణితో ఇబ్బంది కలిగిస్తున్న వేళ తాజాగా చైనా కూడా తోడవ్వడంతో భారత్ జాగ్రత్తగా ఉండాల్సిన అవసరముంది.

================

# ఏపీలో ఆరు స్థానాలకు ఉపఎన్నికలు

విజయవాడ, జనవరి 9, భారత శక్తి ప్రతినిధి,

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో మరోసారి పెను సంచలనం రేగే సూచనలు కనిపిస్తున్నాయి. వైసీపీకి చెందిన కనీసం ఆరుగురు ఎమ్మెల్యేల సభ్యత్వంపై అనర్హత వేటు పడే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. అదే జరిగితే ఆరు స్థానాలకు ఉపఎన్నికలు వచ్చే వీలుందని రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చ సాగుతోంది. అసెంబ్లీ సమావేశాలకు హాజరుకాకుండానే జీతభత్యాలు, అలవెన్సులు తీసుకుంటున్న ఎమ్మెల్యేల



వ్యవహారంపై శాసనసభ ఎథిక్స్ కమిటీ ఇప్పటికే సీరియస్ అయింది. ఎథిక్స్ కమిటీ సమావేశంలో చైర్మన్ మండలి బుద్ధప్రసాద్ నేతృత్వంలో వైసీపీ ఎమ్మెల్యేల గైర్హాజరీపై కీలక చర్చ జరిగింది. నిబంధనల ప్రకారం, స్పీకర్ అనుమతి లేకుండా వరుసగా 60 రోజుల పాటు సభకు హాజరుకాకపోతే సదరు సభ్యత్వంపై అనర్హత వేటు వేసే అధికారం సభకు ఉంటుంది. వచ్చే అసెంబ్లీ సమావేశాల నాటికి ఈ 60 రోజుల గడువు పూర్తి కానుండటంతో, వారి సభ్యత్వాన్ని రద్దు చేయాలని కమిటీ సిఫారసు చేసే అవకాశం ఉంది. సభకు రాకుండా ప్రజాధనాన్ని జీతాలుగా తీసుకోవడం నైతికంగా తప్పని, దీనిపై ప్రజాభిప్రాయ సేకరణ కూడా చేపట్టాలని కమిటీ భావిస్తోంది. ప్రతిపక్ష హోదా ఇస్తేనే సభకు వస్తామన్న మొండి వైఖరి ఇప్పుడు వైసీపీ ఎమ్మెల్యేలకు శాపంగా మారేలా ఉంది. అసెంబ్లీకి వెళ్లడం అనేది ఎమ్మెల్యేల హక్కు మాత్రమే కాదు, అది వారి ప్రాథమిక బాధ్యత. ప్రజలు తమ సమస్యల కోసం గొంతు వినిపిస్తారని నమ్మి ఓటు వేస్తే, పదవుల్లో ఉండి సభకు దూరంగా ఉండటంపై ప్రజల్లోనూ వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఒకవేళ ఇదే కారణంతో అనర్హత వేటు పడి ఉపఎన్నికలు వస్తే, ప్రజా బాధ్యతను విస్మరించారు అనే నిందతో ప్రజల వద్దకు వెళ్లడం ఆ నేతలకు గడ్డు కాలమే అవుతుంది. ఈ పరిణామాలు అధికార కూటమికి రాజకీయంగా కలిసివచ్చేలా ఉన్నాయి. ఆరు స్థానాల్లో ఉపఎన్నికలు వస్తే, వైసీపీ ఎమ్మెల్యేల గైర్హాజరీని ప్రధాన అస్త్రంగా మార్చుకుని కూటమి ప్రచారం చేసే అవకాశం ఉంది. వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఈ విషయంలో న్యాయపోరాటం చేసే అవకాశం ఉంది. కానీ రాజ్యాంగపరంగా స్పీకర్ నిర్ణయమే తుది నిర్ణయం కావడంతో అక్కడ ఊరట లభించడం కష్టమే. అయితే, తన ఎమ్మెల్యేలపై వేటు వేస్తే దానికి నిరసనగా మిగిలిన ఎమ్మెల్యేలతో కూడా రాజీనామా చేయించి ప్రజాతీర్పు కోరే సాహసోపేత నిర్ణయం జగన్ తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. రాబోయే బడ్జెట్ సమావేశాల నాటికి ఈ వ్యవహారం ఒక కొలిక్కి వచ్చే అవకాశం ఉంది. ఎథిక్స్ కమిటీ ఇప్పటికే ఎమ్మెల్యేల వివరణ కోరాలని నిర్ణయించింది. వారు ఇచ్చే సమాధానం సంతృప్తికరంగా లేకపోతే కఠిన చర్యలు తప్పవు. ఒకేసారి ఆరు స్థానాల్లో ఉపఎన్నికలు రావడం అంటే అది మినీ సాధారణ ఎన్నికల తరహాలోనే ఉంటుంది. ఇది రాష్ట్ర రాజకీయాల్లో ఎవరికి అనుకూలంగా మారుతుందో, ప్రజలు ఎవరి వైపు నిలుస్తారో అన్నది ఆ ఉపఎన్నికలతో తేలిపోతుంది.

# వారసుడు నుంచి లీడర్ ముద్ర

విజయవాడ, జనవరి 9,భారత శక్తి ప్రతినిధి,

యువనేత నారాలోకేశ్ తన పనితీరు ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకుంటున్నారు. యోగాంధ్ర నిర్వహణ ద్వారా ప్రధాని మోదీ అభిమానాన్ని పొందారు. యువనేతల్లో నారాలోకేశ్ పనతీరుపై మోదీకి ఎంతో గురి. ఇక విద్యాశాఖ మంత్రిగా ఆయనచేపట్టిన సంస్కరణలకు.. అటు టీచర్ల నుంచి ఇటు విద్యార్థుల నుంచి ప్రశంసలు దక్కుతున్నాయి. ఇక పెట్టుబడుల విషయంలో అయితే.. ఇండియన్ ఇండస్ట్రీ అంతా ఆయనను హీరోగా చూస్తోంది. దానికి ది వీక్ మ్యాగజైన్ కవర్ పేజీనే సాక్ష్యం. బీహార్ ప్రచారానికి వెళ్లినప్పుడు అక్కడి యువత ఆయనకు పట్టంకట్టారు. అలాగే రాజకీయాలను రాజకీయంగానే డీల్ చేస్తున్నారు. రెడ్ బుక్ అంటూ తప్పు చేసిన వాళ్లంతా వణికిపోతున్నారు. నారా లోకేష్ ను నాలుగైదేళ్ల కిందట వారసుడిగా మాత్రమే చూసేవాళ్లు. కానీ తనకంటూ ఒక ప్రత్యేకమైన ముద్ర వేసుకున్న సమర్థవంతమైన నాయకుడిగా ఎదుగుతున్నారు. ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన కొద్ది కాలంలోనే, వ్యవస్థలో ఆయన తీసుకొచ్చిన విప్లవాత్మక మార్పులు సంచలనం సృష్టిస్తున్నాయి. అటు ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో, ఇటు విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించడంలో ఆయన చూపిస్తున్న చొరవతో సర్వత్రా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. లోకేష్ పనితీరు కేవలం రాష్ట్ర స్థాయిలోనే కాకుండా, జాతీయ స్థాయిలో కూడా గుర్తింపు పొందుతోంది. ముఖ్యంగా 'యోగాంధ్ర' వంటి వినూత్న కార్యక్రమాల నిర్వహణ ద్వారా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దృష్టిని ఆకర్షించడమే కాకుండా, ఆయన అభిమానాన్ని కూడా చూరగొన్నారు. యువ నాయకత్వంలో లోకేష్ చూపిస్తున్న పరిణతి, అంకితభావంపై ప్రధానికి ఎంతో నమ్మకం ఏర్పడటం విశేషం. ఇది ఆయన రాజకీయ భవిష్యత్తుకు ఒక బలమైన పునాదిగా మారుతోంది. రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించడంలో లోకేష్ ఒక ఇండస్ట్రియల్ హీరో గా అవతరించారు. అంతర్జాతీయ కంపెనీలను ఏపీ వైపు మళ్లించడంలో ఆయన అనుసరిస్తున్న వ్యూహాలు భారతీయ పారిశ్రామిక రంగాన్ని అబ్బురపరుస్తున్నాయి. తాజాగా ప్రముఖ ది వీక్ మ్యాగజైన్ కవర్ పేజీపై ఆయనను ప్రదర్శించడం, ఆయన పెరుగుతున్న ప్రాభవానికి నిదర్శనం. పెట్టుబడుల విషయంలో ఆయన చూపిస్తున్న వేగం చూస్తుంటే, రాబోయే రోజుల్లో ఏపీ పారిశ్రామిక హబ్‌గా మారడం ఖాయమనిపిస్తోంది. లోకేష్ ప్రభావం కేవలం ఆంధ్రప్రదేశ్‌కే పరిమితం కాలేదు. బీహార్ వంటి ఇతర రాష్ట్రాల ఎన్నికల ప్రచారానికి వెళ్లినప్పుడు అక్కడ ఆయనకు లభించిన ఆదరణ అసాధారణం. అక్కడి యువత లోకేష్‌ను ఒక రోల్ మోడల్‌గా భావించి బ్రహ్మరథం పట్టడం చూస్తుంటే, ఆయన జాతీయ స్థాయిలో ఎదగగల సత్తా ఉన్న నాయకుడని స్పష్టమవుతోంది.

# చింతమనేనికి చిక్కులు

ఏలూరు, జనవరి 9,భారత శక్తి ప్రతినిధి,

పశ్చిమ గోదావరి జిల్లా దెందులూరు నియోజకవర్గం ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ జిల్లాలో జరుగుతున్న పరిణామాలపై అసంతృప్తిగా ఉన్నారని తెలిసింది. వైసీపీ నుంచి నేతలను చేర్చుకోవడమే కాకుండా వారికే ప్రాధాన్యత దక్కుతుండటాన్ని చింతమనేని ప్రభాకర్ జీర్ణించుకోలేకపోతున్నారు. ఆళ్లనాని తో పాటు ఏలూరు కార్పొరేషన్ మేయర్ కుటుంబం టీడీపీలో చేరే సమయంలోనే చింతమనేని ప్రభాకర్ అభ్యంతరం వ్యక్తం చేసినట్లు సమాచారం. తాము గత ఐదేళ్ల పాటు ఎన్నో కేసులు ఎదుర్కొని, వారి చేత మాటలు పడి.. పోలీస్ స్టేషన్ కు వెళ్లి, చివరకు జైలు జీవితం కూడా గడిపి వస్తే నేడు అధికారం కోల్పోయిన వెంటనే వారిని పార్టీలో చేర్చుకోవడంపైన కూడా చింతమనేని ప్రభాకర్ అసహనం వ్యక్తం చేస్తున్నారని తెలిసింది. చింతమనేని ప్రభాకర్ మామూలుగా దూకుడుగా ఉండేవారు. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత కేవలం తన నియోజకవర్గం పరిధిలో మాత్రమే ఆయన రెస్పాండ్ అవుతున్నారు. అందులోనూ వైసీపీ మాజీ ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి విషయంలోనే ఆయన యాక్టివ్ గా కనిపిస్తున్నారు తప్పించి జిల్లాలో జరుగుతున్న రాజకీయ పరిణామాల పట్ల ఆయన అసహనం వ్యక్తం చేస్తున్నారని తెలిసింది. జనసేన ఎమ్మెల్యేలతో పాటు టీడీపీ నాయకత్వం కూడా వైసీపీ నేతలకు ప్రాధాన్యత ఇవ్వడమేంటని చింతమనేని వర్గీయులు ప్రశ్నిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో అన్నిబాధలు పడి, జెండాను వదలకుండా పార్టీ కోసం పనిచేస్తే చివరకు అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా ఆనందం లేకుండా పోయిందని అంటున్నారు. అందుకే చింతమనేని ప్రభాకర్ అధినాయకత్వానికి కూడా ఇటీవల కాలంలో టచ్ మి నాట్ అన్న తరహాలోనే ఉన్నారు. ఏదైనా పార్టీ కేంద్ర కార్యాలయం పిలుపు మేరకు ఆయన పనిచేసుకుంటూ వెళుతున్నారు. అయితే త్వరలో సంక్రాంతి పండగ వస్తుండటంతో ఆయన ఆ బిజీలో ఉన్నారని, చింతమనేని ప్రభాకర్ ప్రత్యేకంగా సంక్రాంతి పండగకు ప్రత్యేకంగా బరులను ఏర్పాటు చేసి కోడి పందేలను నిర్వహిస్తుండటం సంప్రదాయంగా వస్తుంది. అందుకోసమే ఆయన కొంత రాజకీయాలకు దూరంగా ఉన్నారని సన్నిహితులు చెబుతున్నారు. మొత్తం మీద చింతమనేని ప్రభాకర్ మాత్రం 2014 నుంచి 2019 వరకూ ఉన్న తరహాలో ఇప్పుడు ఉండటం లేదన్నది మాత్రం పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతున్న విషయం.

# ఇదేం... దాడి...

# మహిళా అధికారి క్యారెక్టర్ పై కథనాలా

హైదరాబాద్, జనవరి 9, భారత శక్తి ప్రతినిధి,

రాజకీయ నేతలు రాజకీయ కుట్రల కోసం హద్దులు దాటిపోతూంటారు. ఇప్పటి వరకూ రాజకీయ నేతలు.. రాజకీయ నేతలపై కుట్రలు చేసుకుంటూ..తప్పుడు ప్రచారాలు చేసుకుంటూ ఉంటారు. కానీ తెలంగాణలో ఇది మరో స్థాయికి దిగజారిపోయింది. కాంగ్రెస్ ప్రభుత్వంపై నిందలేయడానికి.. ఓ మంత్రి అంటూ.. మరో ఐఏఎస్ అధికారిణి పేరును లింక్ పెట్టి తప్పుడు ప్రచారాలు ప్రారంభిస్తున్నారు. ఓ ఊరూపేరూ లేని చానల్ లో ఆ కథనాన్ని ప్రసారం చేయిస్తున్నారు. తర్వాత ఆ వీడియోను బీఆర్ఎస్ సోషల్ మీడియాకు చెందిన వారు పోస్టు చేసి.. ఆ మంత్రి ఎవరు.. ఆ ఐఏఎస్ అధికారి ఎవరూ అంటూ క్విజ్ ప్రోగ్రాం పెట్టి వైరల్ చేస్తున్నారు. రాజకీయ నేతలు తమపై బురద చల్లించుకోవడానికి.. ఎదుటి వారిపై చల్లడానికి రెడీగా ఉంటారు. కానీ ఈ విషయంలోకి మహిళా ఐఏఎస్ అధికారిని తీసుకు రావడమే అత్యంత వివాదాస్పదమైన అంశంగా మారింది.గౌరవప్రదమైన స్థానంలో ఉన్న మహిళా ఐఏఎస్ అధికారిణిని లక్ష్యంగా చేసుకుని జరుగుతున్న సోషల్ మీడియా తప్పుడు ప్రచారం, కొన్ని వార్తా సంస్థల తీరు ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారింది. రాజకీయ ప్రయోజనాల కోసం ఒక అధికారిణి వ్యక్తిత్వాన్ని హననం చేయడం ఆమె కుటుంబాన్ని ఈ వివాదంలోకి లాగడంపై పౌర సమాజం నుంచి తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ఎటువంటి ఆధారాలు లేకుండా, కేవలం ఊహాగానాలతో ఆమె వ్యక్తిగత జీవితంపై అసభ్యకరమైన ఆరోపణలు చేస్తున్నారు. పరోక్షంగా కాకుండా, దాదాపు నేరుగా ఆమెను ఉద్దేశిస్తూ చేస్తున్న వ్యాఖ్యలు జర్నలిజం విలువలకే మచ్చ తెచ్చేలా ఈ కథనాలు ఉంటున్నాయి.ఈ వివాదంలో బీఆర్ఎస్ పార్టీ అధికారిక సోషల్ మీడియా హ్యాండిల్స్, ఆ పార్టీ మద్దతుదారులు, సోషల్ మీడియా కార్యకర్తలు సానుభూతి చూపిస్తున్నట్లుగా నటిస్తూ.. ట్వీట్లు చేస్తున్నారు. ఆ వీడియోను కావాలని వైరల్ చేస్తున్నారు. వారి ప్రమేయం ఉండ బట్టే వాటిని ఇలా వైరల్ చేస్తున్నారని అనుకోవచ్చు. ఒక ఉన్నత స్థాయి అధికారిణి ప్రతిష్టను దెబ్బతీసేలా అసభ్యకరమైన గాసిప్స్‌ను వీరు వ్యాప్తి చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. పైకి సానుభూతి చూపిస్తున్నట్లు నటిస్తూనే, లోలోపల అసత్య ప్రచారాన్ని క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లే వ్యూహాన్ని వీరు అమలు చేస్తున్నారు.రాజకీయ పార్టీలు తమ ప్రత్యర్థులపై పైచేయి సాధించడానికి అనేక మార్గాలను అన్వేషించవచ్చు, కానీ ఒక మహిళా అధికారిణి వ్యక్తిత్వాన్ని హననం చేయడం, ఆమె క్యారెక్టర్‌ను తక్కువ చేసి చూపడం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదు. కేవలం సదరు అధికారిణిని మాత్రమే కాకుండా, ఆమె కుటుంబాన్ని కూడా ఈ వివాదాల్లోకి లాగడంపై తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. వ్యక్తిగత ప్రతిష్టను మంటగలిపేలా జరుగుతున్న ఈ దాడులు సదరు అధికారిణి మానసిక ధైర్యాన్ని దెబ్బతీసేలా ఉన్నాయని, ఇది వ్యవస్థకే ప్రమాదకరం. బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్న మహిళా అధికారులకు రక్షణ కల్పించాల్సిన అవసరం ఉంది. ఇలాంటి తప్పుడు ప్రచారాలు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్న అభిప్రాయం అధికారవర్గాల్లో వినిపిస్తోంది.

# రప్పా..రప్పా... రక్తాభిషేకాలు..

# అండగా ఉంటామంటున్న జగన్

అనంతపురం, జనవరి 9, ( భారత శక్తి ప్రతినిధి,

వైసీపీ కార్యకర్తలపై నమోదు అవుతున్న కేసుల అంశం ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో మరోసారి తీవ్ర చర్చకు దారి తీసింది. ఈ పరిణామాల నేపథ్యంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్




జగన్మోహన్ రెడ్డి ఒక కీలక నిర్ణయం తీసుకున్నారు. కూటమి ప్రభుత్వం లక్ష్యంగా చేసుకుని వైసీపీ శ్రేణులపై నమోదు చేస్తున్న కేసులకు పార్టీ తరఫున పూర్తిస్థాయి న్యాయ సహాయం అందించాలని ఆయన నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఈ మేరకు బుధవారం మాజీ హోంమంత్రి తానేటి వనిత నేతృత్వంలో తనను కలిసిన కార్యకర్తలకు జగన్ స్పష్టమైన భరోసా ఇచ్చారు.కార్యకర్తలు ఎట్టి పరిస్థితుల్లోనూ భయపడాల్సిన అవసరం లేదని, తమపై నమోదైన కేసుల విషయంలో పార్టీ లీగల్ టీం పూర్తిగా అండగా నిలుస్తుందని ఆయన తెలిపారు. రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే ఈ కేసులు నమోదు అవుతున్నాయని, న్యాయపరంగా పోరాడి కార్యకర్తలకు రక్షణ కల్పిస్తామని జగన్ చెప్పినట్లు సమాచారం. ఈ భరోసాతో పార్టీ శ్రేణుల్లో కొంత ఊరట కనిపిస్తున్నదని అంటున్నారు.ఈ వివాదానికి కారణమైన సంఘటన ఏలూరు జిల్లా గోపాలపురం నియోజకవర్గం లో చోటుచుకుంది. గత నెలలో జగన్ పుట్టినరోజు సందర్భంగా కొందరు వైసీపీ కార్యకర్తలు ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. అందులో "2029లో అధికారంలోకి వచ్చాక ఒక్కొక్కడికి రప్పా.. రప్పా" అనే పదాలు ఉండటంతో ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. ఫ్లెక్సీ ముద్రించిన కార్యకర్తలను అరెస్ట్ చేయడంతో పాటు, ప్రింటింగ్ షాపును కూడా సీజ్ చేసినట్లు వైసీపీ ఆరోపిస్తోంది. అంతేకాదు, నిందితులను బహిరంగంగా రోడ్డుపై నడిపించారని, ఇది ఉద్దేశపూర్వక అవమాన చర్య అని పార్టీ నేతలు మండిపడుతున్నారు.ఇలాంటి ఘటనలు ఒక్క గోపాలపురం వరకే కాకుండా అనంతపురం సత్యసాయి జిల్లాల్లో కూడా చోటుచుకున్నాయని చెబుతున్నారు. అక్కడ కొందరు కార్యకర్తలు కత్తులు ప్రదర్శించడం, జంతు బలులు ఇచ్చి జగన్ పోస్టర్లకు రక్తాభిషేకం చేయడం వంటి ఘటనలను ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. జంతు సంరక్షణ చట్టాలు, ఆయుధాల చట్టం కింద కేసులు నమోదు చేసి పలువురిని అరెస్ట్ చేసింది. ఈ కేసులలోనూ నిందితులను కోర్టులకు తరలించే సమయంలో రోడ్డుపై నడిపించారని వైసీపీ శ్రేణులు ఆరోపిస్తున్నాయి.ఈ వ్యవహారంపై జగన్ తీసుకున్న నిర్ణయాన్ని పార్టీ కార్యకర్తలు స్వాగతిస్తున్నారు. తమ అభిమానాన్ని వ్యక్తపరిచినందుకే ప్రభుత్వం అణచివేస్తోందని వారు భావిస్తుండగా, అధినేత నుంచి న్యాయ సహాయం హామీ రావడంతో ధైర్యం వచ్చిందని చెబుతున్నారు. మరోవైపు ప్రభుత్వ అనుకూల వర్గాలు మాత్రం "రప్పా.. రప్పా" వంటి నినాదాలు ప్రజాస్వామ్య రాజకీయాలకు విఘాతమని, హింసను ప్రోత్సహించేలా ఉన్నాయని విమర్శిస్తున్నాయి. ఈ నేపథ్యంలో జగన్ నిర్ణయం రాజకీయంగా, న్యాయపరంగా మరింత పెద్ద చర్చకు దారి తీసినట్లు రాజకీయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# శాటిలైట్ సాయంతో...

# సంక్రాంతికి ట్రాఫిక్ క్లియర్....

నల్గొండ, జనవరి 9, భారత శక్తి ప్రతినిధి,

తెలుగు రాష్ట్రాల్లో అత్యంత రద్దీగా ఉండే రహదారుల్లో హైదరాబాద్- విజయవాడ జాతీయ రహదారి ప్రధానమైంది. ముఖ్యంగా సంక్రాంతి , దసరా వంటి పండుగ సమయాల్లో ఈ రోడ్డుపై వాహనాల రద్దీ ఏ స్థాయిలో ఉంటుందో ప్రత్యేకంగా



చెప్పనక్కర్లేదు. కిలోమీటర్ల మేర బారులు తీరే వాహనాలు, టోల్ ప్లాజాల వద్ద గంటల తరబడి వేచి చూడటం ప్రయాణికులకు ఒక నరకంలా మారుతోంది. అయితే, ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా అడుగులు వేస్తోంది. తాజాగా యాదాద్రి జిల్లాలోని పంతంగి టోల్ ప్లాజా వద్ద శాటిలైట్ ఆధారిత టోల్ వసూలు విధానాన్ని ప్రయోగాత్మకంగా పరీక్షించారు. గురువారం

సాయంత్రం పంతంగి టోల్ ప్లాజాలో మొత్తం 16 టోల్ బూత్‌లు ఉండగా విజయవాడవైపు వెళ్లే మార్గంలో 8 బూత్‌లను ఈ పరీక్ష కోసం కేటాయించారు. దాదాపు అరగంటపాటు సాగిన ఈ ట్రయల్ రన్‌లో శాటిలైట్ సాంకేతికత పనితీరును అధికారులు నిశితంగా పరిశీలించారు. ఈ నూతన విధానంలో వాహనం టోల్ ప్లాజా వద్ద ఆగాల్సిన అవసరం ఉండదు. శాటిలైట్, హై- స్పీడ్ కెమెరాల సాయంతో వాహనం, నంబర్‌ను గుర్తించి, సెన్సార్ల ద్వారా ఆటోమేటిక్‌గా టోల్ ఫీజు కట్ చేస్తారు. ఈ ప్రక్రియ ఎంత వేగంగా జరుగుతుందంటే, కేవలం 3 సెకన్లలోనే ఫాస్టాగ్ స్కాన్ పూర్తవుతుంది. దీని వల్ల నిమిషానికి 20 వాహనాలు ఎటువంటి ఆటంకం లేకుండా ప్లాజాను దాటి వెళ్లే అవకాశం ఉంటుంది.

ట్రయల్ రన్‌లో ఎదురైన సవాళ్లు

ఏదైనా కొత్త సాంకేతికతను ప్రవేశ పెట్టినప్పుడు ప్రారంభంలో కొన్ని ఇబ్బందులు సహజం. పంతంగి వద్ద నిర్వహించిన పరీక్షల్లో కూడా కొన్ని సాంకేతిక లోపాలు వెలుగులోకి వచ్చాయి. కొన్ని వాహనాలు ప్లాజా దాటుతున్నప్పుడు సెన్సార్లు సరిగా స్పందించకపోవడం, టోల్ వసూలు కాకపోవడం వంటి అంశాలను గుర్తించారు. ఈ లోపాలను సరిదిద్దే పనిలో ప్రస్తుతం ఔఊంఎ, టోల్‌ప్లాజా సాంకేతిక నిపుణులు నిగ్నమయ్యారు. రాబోయే సంక్రాంతి రద్దీని దృష్టిలో ఉంచుకొని, ఒక వేళ వాహనాల సంఖ్య విపరీతంగా పెరిగితే, అదనంగా రెండు బూత్‌లను కూడా అందుబాటులోకి తెచ్చేందుకు ప్లాన్ చేస్తున్నారు. అక్కడ హ్యాండ్ గన్ ద్వారా


ఫాస్ట్‌గన్‌లను స్కాన్ చేసి ట్రాఫిక్ వేగంగా క్లియర్ చేసేందుకు ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రస్తుతం అమలులో ఉన్న ఫాస్టాగ్ విధానం వల్ల పాత నగదు చెల్లింపుల కంటే సమయం ఆదా అవుతున్నప్పటికీ, వాహనాలు గేట్ల వద్ద ఆగాల్సిన వస్తోంది. కానీ శాటిలైట్ ఆధారిత విధానం వల్ల కలిగే ప్రయోజనాలు చాలా ఉన్నాయి.

జీరో నిరీక్షణ సమయం: వాహనాలు వేగాన్ని తగ్గించకుండా టోల్ చెల్లింపు పూర్తి చేయవచ్చు. ఇంధన ఆదా: ట్రాఫిక్ జామ్‌లలో ఇంజిన్ ఆన్ చేసి ఉంచడం వల్ల వృథా అయ్యే ఇంధనం ఆదా అవుతుంది. పర్యావరణ హితం: వాహనాల కాలుష్యం తగ్గుతుంది.పారదర్శకత: శాటిలైట్ ట్రాకింగ్ వల్ల టోల్ వసూళ్లలో అక్రమాలకు తావుండదు.

హైదరాబాద్- విజయవాడ హైవేపై ప్రస్తుతం పంతంగి వద్ద మాత్రమే ఈ విధానాన్ని ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నారు. ఇది విజయవంతం అయితే దేశవ్యాప్తంగా ఉన్న అన్ని ప్రధాన టోల్ ప్లాజాల్లో దీనిని విస్తరించనున్నారు.

# పీవీ పేరిట జిల్లా...

కరీంనగర్, జనవరి 9, భారత శక్తి ప్రతినిధి,



తెలంగాణలో జిల్లాల పునర్వ్యవస్థీకరణపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చేసిన వ్యాఖ్యలతో కొత్త జిల్లాల డిమాండ్లు ఊపందుకున్నాయి. గతంలో జరిగిన విభజన అశాస్త్రీయమని మంత్రి అనడంతో.. హుజూరాబాద్‌ను జిల్లాగా ప్రకటించాలని స్థానికులు ఉద్యమిస్తున్నారు. మాజీ ప్రధాని పీవీ నరసింహారావు జన్మస్థలమైన ఈ ప్రాంతాన్ని ఆయన పేరు మీదనే 'పీవీ నరసింహారావు జిల్లా'గా ఏర్పాటు చేయాలని కోరుతూ భారీ ర్యాలీ నిర్వహించారు. పరిపాలన ప్రజలకు దగ్గరవ్వాలంటే హుజూరాబాద్ జిల్లా కేంద్రం కావడం అవసరమని నాయకులు స్పష్టం చేశారు. మంత్రి హామీ మేరకు ప్రభుత్వం త్వరలోనే ఈ దిశగా సానుకూల నిర్ణయం తీసుకోవాలని, భౌగోళిక పరిస్థితులకు అనుగుణంగా మార్పులు చేయాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.తెలంగాణ రాష్ట్రంలో గత ప్రభుత్వం చేపట్టిన జిల్లాల విభజన అశాస్త్రీయంగా జరిగిందని.. దానిని పునర్వ్యవస్థీకరిస్తామని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అసెంబ్లీలో చేసిన ప్రకటన ఇప్పుడు కొత్త చర్చకు దారితీసింది. ముఖ్యంగా కరీంనగర్ జిల్లాలోని హుజూరాబాద్ ప్రాంత ప్రజలు తమ ప్రాంతాన్ని జిల్లాగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ ఉద్యమ బాట పట్టారు. రాష్ట్రంలోని మండలాల నుంచి జిల్లాల వరకు విభజన ప్రక్రియ ప్రజల సౌలభ్యం కంటే రాజకీయ ప్రయోజనాల కోసమే జరిగిందని మంత్రి విమర్శించారు.ఒకే నియోజకవర్గంలోని మండలాలు వేర్వేరు జిల్లాల

పరిధిలోకి వెళ్లడం వల్ల పరిపాలన పరంగా ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఆయన అభిప్రాయపడ్డారు. దీనిపై అధికారుల నుంచి సమగ్ర నివేదిక తెప్పించి.. అసెంబ్లీలో చర్చించిన తర్వాతే మార్పులు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ క్రమంలోనే ఏ ప్రాతిపదికన జిల్లాలను మారుస్తారో అనే అంశంపై రాష్ట్రవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది.మంత్రి వ్యాఖ్యల నేపథ్యంలో.. హుజూరాబాద్ పట్టణాన్ని కేంద్రంగా చేసుకుని కొత్త జిల్లాను ఏర్పాటు చేయాలని స్థానిక నాయకులు, ప్రజలు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. మాజీ ప్రధాని, దివంగత నేత పీవీ నరసింహారావు ఈ గడ్డ బిడ్డ కావడంతో.. ఆయన గౌరవార్థం ఈ జిల్లాకు 'పీవీ నరసింహారావు జిల్లా' అని పేరు పెట్టాలని వారు కోరుతున్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానం నుంచి అంబేద్కర్ కూడలి వరకు సాగిన ఈ ర్యాలీలో ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొన్నారు. సైదాపూర్ క్రాసింగ్ వద్ద ఉన్న పీవీ విగ్రహానికి పూలమాలలు వేసి తమ నిరసనను విన్నవించారు.హుజూరాబాద్ నియోజకవర్గం చుట్టుపక్కల ఉన్న మండలాలకు ఇది కీలకమైన వాణిజ్య కేంద్రంగా ఉంది. జిల్లా కేంద్రమైన కరీంనగర్‌కు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఇక్కడే అన్ని ప్రభుత్వ సేవలు అందేలా జిల్లా హోదా కల్పించాలని స్థానికులు కోరుతున్నారు. తెలంగాణలో ప్రస్తుతం 33 జిల్లాలు ఉన్నాయి. ప్రజల డిమాండ్ మేరకు కొత్త జిల్లాలను ఏర్పాటు చేయాలంటే ప్రభుత్వం భౌగోళిక సరిహద్దులు, జనాభా ప్రాతిపదికన పలు అంశాలను పరిగణనలోకి తీసుకోవాలి.హుజూరాబాద్ వంటి ప్రాంతాల్లో జిల్లా కార్యాలయాల ఏర్పాటుకు అవసరమైన భూమి, భవనాల సౌకర్యాలను ప్రభుత్వం సమీక్షించాల్సి ఉంటుంది. కొత్త జిల్లాల ఏర్పాటు వల్ల కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయం వంటి మౌలిక సదుపాయాల కోసం భారీగా నిధులు అవసరమవుతాయి. మంత్రి పొంగులేటి చెప్పినట్లుగా కేబినెట్‌లో చర్చించి.. అన్ని పార్టీల అభిప్రాయాలను తీసుకున్న తర్వాతే తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ప్రస్తుతం హుజూరాబాద్ ప్రజలు చేస్తున్న డిమాండ్ ప్రభుత్వం దృష్టికి వెళ్ళింది. రాబోయే పునర్వ్యవస్థీకరణ ప్రక్రియలో ఈ విజ్ఞప్తిని ప్రభుత్వం ఎలా పరిగణనలోకి తీసుకుంటుందో వేచి చూద్దాం.

# 11 లక్షల ఉద్యోగాలే లక్ష్యం

హైదరాబాద్ జనవరి 9, భారత శక్తి ప్రతినిధి,

తెలంగాణను ప్రపంచ ఐటీ పటంలో అగ్రస్థానంలో నిలిపేందుకు రాష్ట్ర ప్రభుత్వం గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ (జీసీసీ), ఇమేజ్ 2.0 వంటి నూతన విధానాలను అమలు చేస్తోంది. 2025-26 నాటికి రూ.3.60 లక్షల కోట్ల ఐటీ ఎగుమతులు, 11 లక్షల ఉద్యోగాలే లక్ష్యంగా అడుగులు వేస్తోంది. సీఎం రేవంత్ రెడ్డి దావోస్ పర్యటన ద్వారా అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించి, హైదరాబాద్‌ను జీసీసీ హబ్‌గా మార్చనున్నారు. యానిమేషన్, గేమింగ్ రంగాల కోసం ఇమేజ్ 2.0 విధానాన్ని తెస్తూ.. సృజనాత్మక రంగంలో యువతకు ఉపాధి పెంచనున్నారుతెలంగాణను ప్రపంచ ఐటీ రంగంలో అగ్రస్థానంలో నిలిపేందుకు రాష్ట్ర ప్రభుత్వం సరికొత్త వ్యూహాలతో ముందుకు సాగుతోంది. ముఖ్యంగా గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ (జీసీసీ) పాలసీ, ఇమేజ్ 2.0 విధానాలను ప్రవేశపెట్టడం ద్వారా భారీగా పెట్టుబడులను ఆకర్షించాలని లక్ష్యంగా పెట్టుకుంది. 2025-26 ఆర్థిక సంవత్సరం నాటికి ఐటీ ఎగుమతులను రూ.3.60 లక్షల కోట్లకు చేర్చడమే కాకుండా.. దాదాపు 11 లక్షల మందికి ఉపాధి కల్పించాలని ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది.స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరిగే వరల్డ్ ఎకనామిక్ ఫోరం సమావేశాల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబు పాల్గొననున్నారు. ఈ పర్యటనలో భాగంగా ప్రపంచ స్థాయి కంపెనీల సీఈఓలతో సమావేశమై హైదరాబాద్‌ను ప్రధాన ఐటీ హబ్‌గా ప్రదర్శించనున్నారు. కృత్రిమ మేధ, సైబర్ సెక్యూరిటీ, డేటా అనలిటిక్స్ వంటి రంగాల్లో పనిచేసే గ్లోబల్ కంపెనీలను రాష్ట్రానికి తీసుకురావడమే ఈ పర్యటన ముఖ్య ఉద్దేశం.వినోద, సాంకేతిక రంగాల కలయికతో 'ఇమేజ్

2.0' పాలసీని ప్రభుత్వం రూపొందిస్తోంది. ఇది కేవలం సాఫ్ట్‌వేర్ రంగమే కాకుండా యానిమేషన్, గేమింగ్, విజువల్ ఎఫెక్ట్స్ (ఎఈచీ) విభాగాల్లో తెలంగాణను గ్లోబల్ హబ్‌గా మారుస్తుంది. దీనివల్ల కళాత్మక నైపుణ్యం ఉన్న యువతకు హై-స్కిల్ ఉద్యోగాలు లభిస్తాయి. మెటావర్స్, డిజిటల్ కంటెంట్ తయారీలో మరిన్ని స్టార్టప్‌లు వచ్చేలా రాయితీలు కల్పించనున్నారు. కొత్త విధానాలను సమర్థవంతంగా అమలు చేసేందుకు ప్రభుత్వం పరిశ్రమల నుంచి నేరుగా నిపుణులను కన్సల్టెంట్లుగా నియమించుకోవాలని నిర్ణయించింది.ప్రభుత్వ యంత్రాంగంలో ఉన్న నైపుణ్య లోటును భర్తీ చేసేందుకు ఈ నిర్ణయం దోహదపడుతుంది. అంతర్జాతీయ సంస్థలతో నిరంతరం సంప్రదింపులు జరపడానికి.. పెట్టుబడి ప్రతిపాదనలను వేగంగా ఆమోదించడానికి ఈ నిపుణుల బృందం పని చేస్తుంది. ఈ చర్యల ద్వారా తెలంగాణ కేవలం సేవల రంగంలోనే కాకుండా.. పరిశోధన మరియు అభివృద్ధి ) విభాగాల్లోనూ అగ్రగామిగా నిలవనుంది. మిషన్ 2047 లక్ష్యంలో భాగంగా రాష్ట్ర ఆదాయాన్ని పెంచడంతోపాటు.. అంతర్జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు తీసుకురావడానికి ఈ సరికొత్త ఐటీ పాలసీలు కీలకం కానున్నాయి.

# కంచికచర్ల తహసీల్దార్ కార్యాలయంలో అగ్నిప్రమాదం

## పలు రికార్డులు అగ్నికి ఆహుతి

నందిగామ జనవరి 9, భారత శక్తి ప్రతినిధి,

ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల మండల తహసీల్దార్ కార్యాలయంలో అగ్నిప్రమాదం జరిగింది. ఘటనలో పలు రికార్డులు అగ్నికి ఆహుతి అయ్యాయి. తహశీల్దార్ ఆఫీస్ బయట చలి మంట వేయటం వలన నిప్పురవ్వలు కార్యాలయంలో ఉన్న రికార్డు గదిలో పడడంతో మంటలు చెలరేగినట్లు అనుమానం. అగ్నిమాపక సిబ్బంది మంటలు అదుపు చేసింది.

# మహిళల సేఫ్టీలో తెలంగాణ ఫోర్త్ ప్లేస్

హైదరాబాద్ జనవరి 9, భారత శక్తి ప్రతినిధి,

దేశంలోనే మహిళలకు బెస్ట్ సిటీగా బెంగళూరు రికార్డు సృష్టించింది. టాప్ సిటీస్ ఫర్ ఉమెన్ ఇన్ ఇండియా 2025 నివేదిక ప్రకారం.. మహిళా సాధికారత, ఉద్యోగ అవకాశాల్లో బెంగళూరు దేశంలోనే నంబర్ 1 నగరంగా నిలిచింది. భద్రతలో మొదటి స్థానంలో చెన్నై ఉండగా.. హైదరాబాద్ నాలుగో స్థానంలో నిలిచింది. మొత్తం మీద దక్షిణ, పశ్చిమ భారతదేశ నగరాలు మహిళలకు అత్యంత సురక్షితమైన, వృద్ధిని ఇచ్చే ప్రాంతాలుగా తమ ఆధిపత్యాన్ని చాటుకున్నాయి. తమిళనాడు రాజధాని చెన్నైకి చెందిన అవతార్ గ్రూప్ అనే ప్రముఖ వర్క్‌ప్లేస్ ఇంక్లూజన్ సంస్థ 2025 ఏడాదికి గానూ దేశంలోని వివిధ నగరాలపై.. పలు అంశాలపై అధ్యయనం

నిర్వహించింది. ఈ తాజా అధ్యయనంలో కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. 2025లో భారతదేశంలో మహిళలు నివసించడానికి, పనిచేయడానికి అత్యంత అనుకూలమైన నగరంగా కర్ణాటక రాజధాని బెంగళూరు అగ్రస్థానంలో నిలిచింది. ఈ రిపోర్ట్‌లో మొత్తం దేశంలోని 125 నగరాలను విశ్లేషించి.. సిటీ ఇంక్లూజన్ స్కోర్ (సీఐఎస్) ఆధారంగా ఆయా నగరాలకు అవతార్ గ్రూప్ ర్యాంకులను కేటాయించారు. మొత్తం స్కోరులో 53.29 పాయింట్లతో మొదటి స్థానంలో బెంగళూరు నిలిచింది. ఆ తర్వాత 49.86 పాయింట్లతో చెన్నై రెండో స్థానంలో నిలిచింది. ఇక టాప్ -5లో ఉన్న పుణె (46.27).. హైదరాబాద్ (46.04).. ముంబై (44.49) వరుసగా నిలిచాయి. ప్రధానంగా రెండు అంశాల మీద ఆధారపడి ఈ అధ్యయనాన్ని నిర్వహించారు. ఒకటి సామాజిక భద్రత, జీవన ప్రమాణాలను కొలిచే సోషల్ ఇంక్లూజన్ స్కోర్.. రెండోది ఉద్యోగ అవకాశాలు, పని వాతావరణాన్ని కొలిచే ఇండస్ట్రియల్ ఇంక్లూజన్ స్కోర్. మహిళల భద్రత, ప్రభుత్వ సేవలు, విద్య, ఆరోగ్య సదుపాయాల విషయంలో చెన్నై నగరం దేశంలోనే అగ్రస్థానాన్ని దక్కించుకుంది. అయితే.. బలమైన కార్పొరేట్ వ్యవస్థ, స్టార్టప్‌లు, విస్తృతమైన ఉద్యోగ అవకాశాల కారణంగా బెంగళూరు పారిశ్రామిక విభాగంలో అగ్రస్థానంలో నిలిచి ఓవరాల్‌గా నంబర్ 1 నగరంగా మారింది. హైదరాబాద్, పుణె నగరాలు అటు సామాజిక భద్రతలోనూ.. ఇటు ఉద్యోగ అవకాశాలలోనూ సరైన సమతుల్యతను కలిగి ఉన్నాయని ఈ నివేదిక వెల్లడించింది. ఈ నివేదికలోని మరో ఆసక్తికరమైన అంశం ఏంటంటే.. టాప్ 10 నగరాల జాబితాలో దక్షిణ భారతదేశం నుంచి.. బెంగళూరు, చెన్నై, హైదరాబాద్, తిరువనంతపురం, కోయంబత్తూర్ అనే 5 నగరాలు చోటు దక్కించుకున్నాయి. ఇది దక్షిణ భారత్‌లో మహిళలకు ఉన్న సురక్షితమైన, వృద్ధిదాయకమైన వాతావరణాన్ని ప్రతిబింబిస్తోంది. ఉత్తర భారతదేశం నుంచి.. గురుగ్రామ్ ఒక్కటే 6వ స్థానంలో నిలిచి టాప్ 10 నగరాల జాబితాలో చేరింది.

# పురపోరుకు అంతా రెడీ

హైదరాబాద్ జనవరి 9, భారత శక్తి ప్రతినిధి,

రాష్ట్రంలోమున్సిపల్ ఎన్నికలకు సంబంధించిన షెడ్యూల్‌ను రాష్ట్ర ఎన్నికల సంఘం విడుదల చేయనుంది. సంక్రాంతి పండుగకు మూడు రోజులు ముందుగానే ప్రకటించే అవకాశం ఉంది. నేడు రాజకీయ పార్టీలతో తెలంగాణ ఎన్నికల అధికారి భేటీ కానున్నారక. స్థానిక సంస్థల ఏర్పాట్లపై ఎస్ఈసీ చర్చించనుంది. రాష్ట్రంలో 117 మున్సిపాలిటీలకు ఈనెల 20లోగా నోటిఫికేషన్ వెలువడే అవకాశముందని తెలిసింది. తెలొంగాణలోని 117 మునిసిపాలిటీలు, 6 మునిసిపల్ కార్పొరేషన్లలో వార్డుల వారీగా ఓటర్ల జాబితా తయారీని షెడ్యూల్ ప్రకారం సిద్ధంచేస్తోంది. ఈనెల 12న రాష్ట్రవ్యాప్తంగా అన్ని మునిసిపాలిటీలు, కార్పొరేషన్‌ల పరిధిలో వార్డుల వారీగా తుది ఓటరు జాబితాను విడుదల చేయనున్నారు. మున్సిపాలిటీల్లో ఎన్నికల సన్నద్ధతపై రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణికుముదిని, కార్యదర్శి మంద్ మకరంద్ అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, మునిసిపాలిటీలు, కార్పొరేషన్ల కమిషనర్లతో బుధవారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎన్నికలకు పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తిచేయాలని కమిషనర్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఎప్పుడైనా మున్సిపాలిటీకి సంబంధించిన నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశముంది. ఇటీవల పంచాయతీ ఎన్నికలను మూడు దఫాలుగా సజావుగా నిర్వహించిన నేపథ్యంలో మున్సిపల్ ఎన్నికలను కూడా మూడు దశల్లో నిర్వహించాలని నిర్ణయించారుఈనెల 12న అన్ని మునిసిపాలిటీలు, కార్పొరేషన్ల పరిధిలో ఓటర్ల తుది జాబితాను ప్రచురించాలని, 13న పోలింగ్ కేంద్రాల ముసాయిదా జాబితా ప్రచురణ.. ఆ వెంటనే 'టీ-పోల్' సాఫ్ట్‌వేర్‌లో అప్‌లోడ్ చేయాలని రాష్ట్ర ఎన్నికల అధికారులు సూచించారు.. 16న ఫొటోలతో కూడిన ఓటర్ల తుది జాబితాను పోలింగ్ కేంద్రాల వారీగా ప్రచురించాలని మున్సిపల్ అధికారులకు ఇప్పటికే ఆదేశాలు అందాయి. సంక్రాంతి పండగ ముగిసిన తర్వాత నోటిఫికేషన్ విడుదల చేసి ఫిబ్రవరి నెలాఖరుకు ఎన్నికలను పూర్తి చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం భావిస్తుంది. మున్సిపల్

ఎన్నికలకు సంబంధించి నేడు జరిగే ప్రజాప్రతినిధుల సమావేశంలో స్పష్టత వచ్చే అవకాశముంది.

# డీలర్ దగ్గరే వాహనాల రిజిస్ట్రేషన్

హైదరాబాద్ జనవరి 9 భారత శక్తి ప్రతినిధి,

తెలంగాణ రాష్ట్రంలో రవాణా శాఖలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారు. కొత్తగా వ్యక్తిగత వాహనాలను కొనుగోలు చేసే సామాన్యులకు ఊరటనిచ్చేలా ప్రభుత్వం ఒక కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై కొత్త వాహనాల రిజిస్ట్రేషన్ కోసం వాహనదారులు ప్రాంతీయ రవాణా కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పని లేదు. వాహనం కొనుగోలు చేసిన షోరూమ్‌లోనే అంటే డీలర్ వద్దనే రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేసేలా నూతన సంస్కరణలను అమల్లోకి తెచ్చారు. కొంతకాలంగా ఆర్టీఏ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ అంటేనే అవినీతికి నిలయమనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా వ్యక్తిగత వాహనాల శాశ్వత రిజిస్ట్రేషన్ కోసం కార్యాలయాలకు

వెళ్లినప్పుడు, అక్కడ ఉండే మధ్యవర్తులు లేదా అధికారులకు ముడుపులు ఇస్తేనే పనులు జరుగుతున్నాయన్న ఫిర్యాదులు



పెరిగాయి. . ఈ పరిస్థితిని గమనించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, గతేడాది డిసెంబర్ 19న రవాణా శాఖాధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రజలకు పారదర్శకమైన సేవలు అందించడమే లక్ష్యంగా, డీలర్ల వద్దనే నేరుగా రిజిస్ట్రేషన్ చేసే విధానాన్ని తీసుకురావాలని ఆయన సూచించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రవాణాశాఖ కమిషన్ ఇలంబర్తి తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నూతన విధానాన్ని సంబంధించి అవసరమైన సాఫ్ట్‌వేర్‌ను కేవలం 15 రోజుల్లోగా సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో ఈ సేవలను వేగవంతం చేసేందుకు ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను రూపొందిస్తున్నారు. వాస్తవానికి కేంద్ర రోడ్డు రవాణా, రహదారి మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో వాహన్, సారథి పోర్టల్ ద్వారా దేశంలోని పలు రాష్ట్రాల్లో ఈ విధానం ఇప్పటికే అమలవుతోంది. అయితే తెలంగాణలో ఈ పోర్టల్‌లు పూర్తి స్థాయిలో అందుబాటులోకి రావడానికి మరో ఆరు నెలల సమయం పట్టే అవకాశం ఉండటంతో, ప్రజలకు తక్షణ సౌకర్యం కోసం ప్రభుత్వం ఈ తాత్కాలిక సాఫ్ట్‌వేర్ ఏర్పాటు చేస్తోంది.

ఇప్పటి వరకు ఉన్న నిబంధనల ప్రకారం, ఎవరైనా కొత్త వాహనాన్ని కొనుగోలు చేస్తే డీలర్ వద్ద కేవలం తాత్కాలిక రిజిస్ట్రేషన్ మాత్రమే జరిగేది. శాశ్వత రిజిస్ట్రేషన్ కోసం తప్పనిసరిగా వాహనాన్ని ఆర్టీఏ కార్యాలయానికి తీసుకెళ్లాల్సి వచ్చేది. కానీ కొత్త నిబంధనల ప్రకారం, అధీకృత డీలర్ వద్దనే శాశ్వత రిజిస్ట్రేషన్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చు.

వాహనదారులు డీలర్ వద్ద సమర్పించాల్సిన పత్రాలు

వాహన్ ఇన్వాయిస్

ఫారం-21( విక్రయ ధ్రువీకరణ పత్రం)

ఫారం-22(రోడ్డు అనుకూలత ధ్రువీకరణ)

బీమా

కొనుగోలుదారుల చిరునామా ధ్రువీకరణ పత్రం

సదరు వ్యక్తి పేరు మీద మరో వాహనం లేదని తెలిపే డిక్లరేషన్

కొనుగోలుదారుల ఫొటో, సంతకం స్కాన్ కాపీ

వాహనం ఇంజిన్, ఛాసిస్ నంబర్లు ఫొటోలు

రవాణా శాఖ నిర్దేశించే ఇతర అవసరమైన పత్రాలు

ఈ పత్రాలన్నింటినీ డీలర్ ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తారు. ఆ తర్వాత రిజిస్టరింగ్ అథారిటీ లేదా అదనపు రిజిస్టరింగ్ అథారిటీ ఆ పత్రాలను నిశితంగా పరిశీలిస్తారు. అన్ని నిబంధనల ప్రకారం ఉంటే దరఖాస్తును ఆమోదిస్తారు. లేని పక్షంలో తిరస్కరించే అధికారం ఉంటుంది. దరఖాస్తు ఆమోదం పొందిన తర్వాత, వాహనదారులకు రిజిస్ట్రేషన్ పత్రం కోసం ఎదురు చూడాల్సిన పని లేదు. నమోదు ప్రక్రియ పూర్తి అయిన తర్వాత ఆర్సీ కార్డు నేరుగా స్పీడ్ పోస్టు ద్వారా కొనుగోలుదారుల చిరునామాకు పంపిస్తారు. దీని వల్ల వాహనదారులకు సమయం ఆదా అవుతుంది. కార్యాలయాల చుట్టూ తిరిగే శ్రమ తప్పుతుంది. ఈ సడలింపుల వల్ల ఎటువంటి అక్రమాలు జరగకుండా ప్రభుత్వం కఠిన నిబంధనలను కూడా పెట్టింది. డీలర్ల వద్ద ఉన్న వాహనాల నిల్వలు, రిజిస్ట్రేషన్ ప్రక్రియను అధికారులు ఎప్పుడైనా తనిఖీ చేయవచ్చు. వెహికల్ ఇన్‌స్పెక్టర్, ఆర్టీవో, డీటీసీ, జేటీసీ, రవాణా కమిషనర్ కూడా అధీకృత డీలర్ల వద్ద తనిఖీలు చేయవచ్చు. తద్వారా నిబంధనలు ఉల్లంఘించే డీలర్లపై చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

# కవితను టార్గెట్ చేసిన కేటీఆర్ టీమ్

హైదరాబాద్, జనవరి 9,భారత శక్తి ప్రతినిధి,

శాసనమండలిలో మొన్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత భావోద్వేగంతో మాట్లాడింది కదా.. తమ కుటుంబ దైవం లక్ష్మీనరసింహస్వామి, తన ఇద్దరు కొడుకుల పై ఒట్టు వేసి.. తనది ఆస్తికోసం పోరాటం కాదని.. ఆత్మగౌరవం కోసం పోరాటమని చెప్పింది కదా.. పదేళ్లలో ఏం పీకి కట్టలు కట్టిన మని జాతీయస్థాయికి పోయినమని.. తన తండ్రి పరిపాలనను ఉద్దేశించి విమర్శించింది కదా.. ఇక ఎప్పుడైతే కవిత ఆ మాటలు మాట్లాడిందో.. అప్పటినుంచి కేటీఆర్ కాంపౌండ్ లో పనిచేసే వ్యక్తులు రెచ్చిపోవడం మొదలుపెట్టారు. సోషల్ మీడియాలో కవితను ఉద్దేశించి పిచ్చిపిచ్చిగా వ్యాఖ్యలు చేస్తున్నారు. అసలు ఆమె ఉంటే ఎంత.. చస్తే ఎంత అన్నట్టుగా పోస్టులు పెడుతున్నారు. వాస్తవానికి ఇటీవల కాలంలో కవిత మీద కాంగ్రెస్ పార్టీ కంటే, కాషాయం పార్టీ కంటే గులాబీ పార్టీ అనుకూల సోషల్ మీడియానే యుద్ధం చేస్తోంది. కవిత వ్యక్తిత్వాన్ని కించపరిచే విధంగా పోస్టులు పెడుతోంది. ఇక కిరాయి యూట్యూబ్ ఛానల్స్ అయితే పిచ్చిపిచ్చిగా వార్తలను ప్రసారం చేస్తున్నాయి. కెసిఆర్ లాంటి మహానుభావుడి కడుపులో కవిత అనవసరంగా పుట్టిందని.. ఇప్పుడు తండ్రికి తలంపులు తెచ్చే దుర్మార్గానికి శ్రీకారం చుట్టిందని ఆరోపిస్తున్నారు. చెత్త అని, చెదలు అని, కేసుల మాఫీ కోసం కాంగ్రెస్ పార్టీ, బిజెపి నాయకులతో చేయి కలిపిందని ఆరోపిస్తున్నారు. త్వరలో కవిత కాంగ్రెస్ పార్టీలో చేరబోతుందని.. ఇప్పటికే రేవంత్ రెడ్డి తో మంతనాలు జరిపిందని.. అందువల్లే భారత రాష్ట్ర సమితి మీద తీవ్రస్థాయిలో ఆరోపణలు చేస్తోందని.. కొంతమంది నాయకులు ఆరోపిస్తున్నారు. ఇక మిగతా నాయకులైతే కవితను దారుణంగా తిడుతున్నారు. సోషల్ మీడియాలో.. ప్రధాన మీడియాలో కవితను ప్రశ్నిస్తూ గులాబీ పార్టీ నాయకులు విమర్శలు చేస్తున్నారంటే వారు ఏ స్థాయిలో అసహనంతో ఉన్నారో అర్థం చేసుకోవచ్చు. వాస్తవానికి కవిత లేవనెత్తుతున్నది తనకు జరిగిన అన్యాయం పైన.. తనది ఆస్తుల కోసం పోరాటం కాదని చెబుతూనే ఉంది. అలాంటప్పుడు కేటీఆర్ అనుకూల వ్యక్తులు ఆమెను వ్యక్తిగతంగా టార్గెట్ చేయడం ఏంటి. కవిత సంధించిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పాల్సిన బాధ్యత అయితే కేసీఆర్ లేకుంటే కేటీఆర్ మీద ఉంటుంది. మధ్యలో ఈ కిరాయి యూట్యూబర్లకు ఏం అవసరం. ఈరోజు బిస్కెట్లు పడేస్తున్నారు కాబట్టి కుక్కల మాదిరిగా తోకలు

ఊపుతారు. ఆ తదుపరి ఏం చేస్తారని కవిత వర్గం నాయకులు ప్రశ్నిస్తున్నారు. కవిత కూడా తన సోషల్ మీడియాను బలోపేతం చేసింది. ట్విట్టర్లో కవితక్క అప్డేట్స్ పేరుతో ఒక ఎకౌంటు ఓపెన్ అయింది. అందులో ప్రధానంగా సంతోష్ రావు చేసిన అక్రమాలు.. హరీష్ రావు చేసిన దుర్మార్గాలు ప్రస్తావిస్తున్నారు. భారత రాష్ట్ర సమితి అధికారంలో 10 సంవత్సరాలలో తెలంగాణలో ఏం జరిగింది.. ఏ పథకంలో ఎంత నొక్కారు.. అనే విషయాలను కవితక్క అప్డేట్స్ అనే అకౌంట్ ద్వారా బయటపెడుతున్నారు. దీంతో గులాబీ పార్టీకి. ఆ పార్టీ అనుకూల కిరాయి సోషల్ మీడియాకు బలమైన సమాధానం చెబుతున్నారు. త్వరలో కవిత రాజకీయ పార్టీ పెడుతుంది కాబట్టి.. అది కూడా లాంచనమే కాబట్టి.. కవితక్క వర్సెస్ గులాబీ పార్టీ అన్నట్టుగా పొలిటికల్ వ్యవహారం సాగుతుందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

# అగ్రి యూనివర్సిటీలో పరీక్షా పత్రాల లీక్
## ఇది రేవంత్ మార్క్ ప్రభుత్వ వైఫల్యం హరీష్ రావు

హైదరాబాద్ జనవరి 9,భారత శక్తి ప్రతినిధి,

ఆచార్య జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో జరిగిన పరీక్షా పత్రాల లీక్ ఘటన, పరీక్షల నిర్వహణలో ప్రభుత్వ చేతగాని తనాన్ని, అసమర్థతను, అవినీతిని బట్టబయలు చేస్తోందని మాజీ మంత్రి బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు ఆరోపించారు. మొన్నటి పీజీ వైద్య విద్య పరీక్షల్లో బయటపడిన మెడికల్ స్కాం ఇంకా మరువకముందే, ఇప్పుడు అగ్రికల్చర్ బీఎస్సీ పరీక్షల్లో ప్రశ్నాపత్రాలను వాట్సాప్ ద్వారా ముందుగానే లీక్ చేసి, ఏఐ పెన్లతో రాసిన మోడరన్ స్కాం



రాష్ట్రాన్నిగ్భ్రాంతికి గురి చేస్తోంది. ఇంత బహిరంగంగా, అక్రమంగా పరీక్షలు జరుగుతుంటే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేస్తున్నట్లు? విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతుంటే, ఈ ప్రభుత్వం ఎందుకు మొద్దు నిద్రలో మునిగి ఉందని నిలదీసారు.

మార్పు తెస్తామంటూ అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం, రెండేళ్ల వ్యవధిలోనే స్కాంలకు చిరునామాగా మారడం దురదృష్టకరం. చివరకు విద్యా సంస్థలు సైతం అవినీతికి కేంద్రంగా మారడం రాష్ట్ర ప్రభుత్వ దిగజారుడు తనానికి, రేవంతు రెడ్డి విలువల్లేని తనానికి నిదర్శనం. రేవంత్ రెడ్డి "కాదేదీ స్కాంకు అనర్హం" అని చెప్పడమే కాకుండా, చేసి చూపిస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇవ్వడం చేతకాదు, పరీక్షలను సక్రమంగా నిర్వహించడం చేతకాదు..ఇది రేవంత్ మార్క్ ప్రభుత్వ వైఫల్యం. పరీక్షల నిర్వహణలో అక్రమాలకు పాల్పడిన అధికారులపై తక్షణం చర్యలు తీసుకోవాలని, ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా పకడ్బందీగా పరీక్షలు నిర్వహించాలని బీఆర్ఎస్ పక్షాన ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు.

# పెండింగ్ జాతర పనులు సకాలంలో పూర్తి చేయాలి
## అదనపు కలెక్టర్ వేణు

పెద్దపల్లి జనవరి 9, జిల్లాలో సమ్మక్క సారలమ్మ జాతర పనులు సకాలంలో పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ డి.వేణు సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం అదనపు కలెక్టర్ డి.వేణు సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో రామగుండం గోదావరి నది వద్ద, అంతర్గాం గోలివాడ , సుల్తానాబాద్ లోని నీరుకుల్ల వద్ద నిర్వహించే సమక్క సారలమ్మ జాతర ఏర్పాట్ల పురోగతి పై సంబంధిత అధికారులతో సమీక్షించారు. అదనపు కలెక్టర్ డి.వేణు మాట్లాడుతూ మన జిల్లాలో గోదావరిఖని, గోలివాడ, నీరుకుల్ల ప్రాంతాలలో జరిగే సమ్మక్క సారలమ్మ జాతరకు 5 లక్షల పైగా భక్తులు రానున్న నేపథ్యంలో వారికి ఎలాంటి ఇబ్బందులు కల్గకుండా అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని, జాతర నిర్వహణ కు సంబంధించి జాతర కమిటీకు సంపూర్ణ సహకారం అందించాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. జనవరి 28 నుంచి జనవరి 31 వరకు నిర్వహించే సమక్క సారలమ్మ జాతరలో ఎలాంటి ఇబ్బందు లు కల్గకుండా కట్టుదిట్టంగా ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలని , అధిక సంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించుకునే ఈ జాతరను విజయ వంతంగా నిర్వహించడానికి అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి సన్నద్ధం కావాలని అన్నారు. జాతర సందర్భంగా పారిశుద్యంనిర్వహణకు అధిక ప్రాధాన్యత కల్పించాలని, అవసర మైన మేర అదనపు పారిశు ధ్య కార్మికులను ఏర్పాటు చేయాలని అదనపు కలెక్టర్ సూచించారు. జాతర నిర్వహించు ప్రదేశంలో తాత్కాలిక మరుగుదొడ్లు నిర్మించాలని, శుభ్ర పర్చడానికి వ్యక్తులను నియమించాలని, ప్రతి రోజు చెత్తను శు భ్రపర్చు ట, స్నానాలు ఆచరించడానికి షవర్స్, స్త్రీలు దుస్తులు మార్చుకోవడానికి గదులు ఏర్పాటు చేయాలని, విద్యుత్ దీపాలంకరణ సాయంత్రం నుండి ఉదయం వరకు నిరంతరాయంగా సాగేటట్లుగా చూడాలని అన్నారు. విద్యుత్ అంతరాయం కల్గకుండా జనరేటర్లు అందుబాటులో ఉంచుకోవాలని, గోదావరి నదీ ప్రాంతంలో సేఫ్టి ఫెన్సింగ్ ఏర్పాటు పనులను పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. జాతర జరుగు 4 రోజులు వైద్య సిబ్బంది,108 వాహనం, మందులు అందుబాటులో ఉంచాలని, ఫైర్ ఇంజన్ 24 గంటల పాటు షిఫ్ట డ్యూటిలలో అందుబాటులో ఉంచాలని తెలిపారు. జాతర జరుగు ప్రాంతాలలో ఎలాంటి ఇబ్బందులు కల్గకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని, ట్రాఫిక్ ఇబ్బంది కల్గకుండా చూడాలని,అవసరమైన చోట సిసి కెమెరాలను ఏర్పాటు చేయాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. పుణ్య స్నానాలు చేసే ప్రాఅంతంలో గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని, ప్రభుత్వ శాఖల సిబ్బందికి భోజన ఏర్పాటు, జాతర ప్రారంభానికి వి.ఐ.పి.ల ఆహ్వానం, పబ్లిక్ అడ్రెస్ సిస్టం ఏర్పాటు, నిర్వహణ వంటి పనులు నిర్వహించాలని, గోదావరిఖని ఆర్టిసి డిపో మేనేజరు జాతర జరుగు ప్రాంతాలకు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రత్యేక బస్సులు భక్తులకు ఇబ్బందు లు ఏర్పడకుండా నడపాలని, జాతర పరిసరాల ప్రాంతాలలో ని అనుమతి లేని మద్యం దుకాణాలు మూసివేయాలని, పోలీసు భద్రత ఏర్పాట్లు చేయాలని, భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని అదనపు కలెక్టర్ తెలిపారు. జాతర నిర్వహణ అంశంలో ప్రతి ఒక్క శాఖ తమకు కేటాయించిన విధులను పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు

# కాంగ్రెస్ నాయకులకు కబ్జాలపై ఉన్న సోయి అభివృద్ధిపై లేదు

## -ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లయినా పట్టణంలో ఒక్క అభివృద్ధి చేయలేదు
## -కాలువ కోసం తీసిన గుంతలో పడి గాయాలపాలైన ఆలయ ఉద్యోగి
## -పనులు పూర్తి చేయాలని రోడ్డెక్కిన బిఆర్ఎస్, బిజెపి నాయకులు



భారత శక్తి, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి, జనవరి 09:యాదగిరిగుట్ట పట్టణంలోని కాంగ్రెస్ నాయకులకు కబ్జాలపై ఉన్న సోయి పట్టణ అభివృద్ధిపై లేదని బిజెపి, బిఆర్ఎస్ నాయకులు విమర్శించారు. యాదగిరిపల్లి ఎస్సీ కాలనీకి వెళ్లే దారిలో కాలువ నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం పట్టణంలోని బస్టాండు వద్ద బిజెపి, బిఆర్ఎస్ నాయకులు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా బిజెపి పట్టణ అధ్యక్షుడు కర్రె ప్రవీణ్, బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు కర్రె వెంకటయ్య, బిఆర్ఎస్ పట్టణ సెక్రటరీ జనరల్ పాపట్ల నరహరిఅబశ్రీశ్రీ మాట్లాడుతూఅబశ్రీశ్రీ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లయినా పట్టణంలో ఒక్క అభివృద్ధి పనీ జరగలేదని గత ప్రభుత్వం శంకుస్థాపన చేసి నిధులు విడుదల చేసిన పనులనే చేస్తూ కాలం వెల్లదీస్తున్నారని అన్నారు. గతంలో యాదగిరిపల్లి నుండి వంగపల్లి చెరువులోకి నీరు వెళ్లేందుకు కాలువ నిర్మాణానికి సుమారు 5 కోట్లతో పనులు ప్రారంభించగా, ఆ పనులు కొన్నేళ్లుగా అసంపూర్తిగా ఉండడంతో గురువారం రాత్రి దేవస్థానంలో విధులు ముగించుకొని ఎస్సీ కాలనీలోని తన ఇంటికి వెళ్తున్న బూడిద బాషా ప్రమాదవశాత్తు కాలువలో పడిపోయి గాయాలపాలైనాడని తెలిపారు. ఈ ప్రభుత్వానికి దళితుల ప్రాణాలంటే లెక్కలేదని, కాలువ పనుల గురించి స్థానిక ఎమ్మెల్యే వద్ద ఎన్నిసార్లు మొర పెట్టుకున్నా ఫలితం శూన్యం అని పేర్కొన్నారు. గతంలో ఇదేవిషయమై ఒకసారి ప్రతిపక్షలు ధర్నా చేయగా ఎమ్మెల్యే సందర్శించి రెండు నెలల్లో పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చి ఇప్పటికి ఆరు నెలలు గడుస్తున్నా తట్టెడు మట్టి కూడా తీయలేదని విమర్శించారు. తక్షణమే అట్టి కాలువ పనులను ప్రారంభించి వీలైనంత త్వరగా పూర్తి చేయాలని లేదంటే రానున్న మున్సిపల్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీకి ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు బూడిద సురేందర్, కవిడె మహేందర్, కోల వెంకటేష్, చిత్తర్ల బాలయ్య గౌడ్, బిజెపి నాయకులు బందారపు మల్లేష్ గౌడ్, ఆకుల చంద్రమౌళి, లెంకలపల్లి శ్రీనివాస్, తాళ్ల భాస్కర్ రెడ్డి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# నాణ్యమైన మౌలిక సదుపాయాలకు వెన్నెముకగా మెట్రాలజీ

## – గీతం ఆతిథ్య ఉపన్యాసంలో జాతీయ భౌతిక ప్రయోగశాల డైరెక్టర్ ప్రొఫెసర్ ఆచంట వేణుగోపాల్



సంగారెడ్డి,భారత శక్తి ప్రతినిధి, జనవరి 9:

ఒక దేశం యొక్క నాణ్యమైన మౌలిక సదుపాయాలకు వెన్నెముకగా మెట్రాలజీ నిలుస్తోందని జాతీయ భౌతిక ప్రయోగశాల డైరెక్టర్ ప్రొఫెసర్ ఆచంట వేణుగోపాల్ చెప్పారు. హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ సైన్స్, భౌతిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో 'క్వాంటం టెక్నాలజీలకు క్వాంటం మెట్రాలజీ, మెట్రాలజీ' అనే అంశంపై శుక్రవారం ఆయన ఆతిథ్య ఉపన్యాసం చేశారు. విస్తరిస్తున్న క్వాంటం టెక్నాలజీల అభివృద్ధిలో ఖచ్చితత్వ కొలత యొక్క కీలక పాత్ర, ఈ సాంకేతికతల భవిష్యత్తులో అందివచ్చే విస్తారమైన ఉపాధి అవకాశాలను డాక్టర్ వేణుగోపాల్ వివరించారు. భారతదేశంలో క్వాంటం టెక్నాలజీలను అభివృద్ధి చేయడానికి, ముందుకు తీసుకెళ్లడానికి మరిన్ని ప్రయత్నాలు అవసరమని ఆయన స్పష్టీకరించారు.

జాతీయ భౌతిక ప్రయోగశాల, దాని జాతీయ బాధ్యతలు, క్షపణుల నుంచి అంతరిక్షం వంటి వ్యూహాత్మక రంగాల వరకు ఈ సంస్థ సహకారంపై సమగ్ర అవలోకనాన్ని అందించారు. అకౌస్టిక్ గ్యాస్ థర్మోమెట్రీ, సీఎస్-ఫౌంటెన్ అటామిక్ క్లాక్, భారత ప్రామాణిక సమయం (ఐఎస్ టీ) యొక్క నిరంతర నిర్వహణతో సహా ఎన్ పీఎల్ లోని అత్యాధునిక సౌకర్యాలను కూడా ఆయన వివరించారు.జాతీయ మెట్రాలజీ సంస్థల ప్రపంచ నెట్ వర్కు గురించి చెబుతూ, శాస్త్రీయ, సాంకేతిక పురోగతికి గుర్తించదగిన, అధిక ఖచ్చితత్వ కొలతలు అవసరమని చెప్పారు.

భవిష్యత్తు మెట్రోలజీ వినియోగంలో నానోఫోటోనిక్స్ యొక్క ప్రాముఖ్యత, వీటి మూలాలు, వాటిని కనిపెట్టే పరికరాల కోసం సింగిల్-ఫోటాన్ మెట్రాలజీ, లేబుల్-ఫ్రీ సింగిల్-మాలిక్యూల్ డిటెక్షన్, ఇంటిగ్రేటెడ్ క్వాంటం సర్క్యూట్ల కోసం ౫ఱచీ ఉ ౫ఛీ× ప్లాట్ ఫారమ్ ల సామర్థ్యాన్ని పెంచడం అవశ్యమని ఆయన పేర్కొన్నారు.తొలుత, గీతం విశిష్ట ఆచార్యుడు ప్రొఫెసర్ బీ.వీ.ఆర్. టాటా వక్తను పరిచయం చేయగా, స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రెజా, భౌతికశాస్త్ర విభాగాధిపతి ప్రొఫెసర్ టి.విశ్వం తదితరులు అతిథిని సత్కరించారు. ఈ ఆతిథ్య ఉపన్యాస కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు హాజరై, సందేహాలను అడిగి తెలుసుకున్నారు.



# సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే చింత ప్రభాకర్

సంగారెడ్డి,భారత శక్తి ప్రతినిధి, జనవరి 9 :

సంగారెడ్డి పట్టణంలోని 15వ వార్డులో ఎమ్మెల్యే చింత ప్రభాకర్ సహకారంతో స్థానిక మాజీ కౌన్సిలర్ విజయలక్ష్మ – విఠల్ సొంత నిధులతో చేపట్టిన 3 బోర్లు మరియు సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింత ప్రభాకర్ మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడంలో ప్రజాప్రతినిధులు ముందుండాలని అన్నారు. తాగునీటి సమస్య పరిష్కారం కోసం బోర్లు, రవాణా సౌకర్యం మెరుగుపర్చేందుకు సీసీ రోడ్లు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. సొంత నిధులతో వార్డులో అభివృద్ధి పనులు చేపట్టడం పై మాజీ కౌన్సిలర్ విజయలక్ష్మ – విఠల్ ను ఎమ్మెల్యే అభినందించారు. అభివృద్ధి అనేది నిరంతర ప్రక్రియ అని, ప్రజల మౌలిక సదుపాయాలకు ఎల్లప్పుడూ ప్రాధాన్యం ఇస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. వార్డులోని పలు సమస్యలను వార్డు ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకోచ్చారు. సానుకూలంగా స్పందించిన సమస్యల పరిష్కారానికి పూర్తి మద్దతు సహకారం ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్. వెంకటేశ్వర్లు, రషీద్, జీవీ శ్రీనివాస్, ఎర్నా కృష్ణయ్య, వడ్డేపల్లి శ్రవణ్ కుమార్, కొత్తపల్లి నాని, జలందర్, గొల్ల బాలరాజ్, పవన్,మామిడి చంద్రమల్లి తదితరులు పాల్గొన్నారు.

# సదాశివపేట మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొన్న నిర్మల జగ్గారెడ్డి



సంగారెడ్డి,భారత శక్తి ప్రతినిధి, జనవరి 9:

ఆలస్యం అయిన కష్టపడితే కాంగ్రెస్ లో పదవులు దక్కుతాయనే విషయానికి సదాశివపేట మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ గా అలివేని నర్సింహారెడ్డి ఉదాహరణ అని టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి అన్నారు.సదాశివపేట పట్టణంలోని బాలాజీ ఫంక్షన్ హాల్ లో సదాశివపేట మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ అలివేణి నర్సింహారెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు.. ఈ కార్యక్రమానికి జగ్గారెడ్డి, నిర్మల ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్మల జగ్గారెడ్డి మాట్లాడుతూ రైతులకు సరైన గిట్ట బాటు ధర కల్పించడం మార్కెట్ కమిటీ బాధ్యత వహించాలన్నారు. మార్కెట్ కమిటీ లో రైతులకు కావాల్సిన అన్ని సౌకర్యాలు ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి నియోజకవర్గ ఇంచార్జి ఆంజనేయులు,సిడిసి చైర్మెన్ రామ్ రెడ్డి,ఆత్మ చైర్మెన్ ప్రభు,సంగారెడ్డి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రఘు గౌడ్, సంగారెడ్డి మార్కెట్ కమిటీ చైర్మన్ చందర్ నాయక్ కాంగ్రెస్ నాయకులు మునిపల్లి సత్యనారాయణ ,సిద్దన్న తదితరులు పాల్గొన్నారు.

# ప్రతిభ హై స్కూల్లో కైట్ ఫెస్టివల్ సంబురాలు



జిన్నారం,భారత శక్తి ప్రతినిధి, జనవరి 9 :

సంగారెడ్డి జిల్లా జిన్నారం మున్సిపల్ కేంద్రంలోని ప్రతిభ విద్యానికేతన్ హైస్కూల్లో శుక్రవారం విద్యార్థులు ఉపాధ్యాయ బృందం కైట్ ఫెస్టివల్, సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థినిలు పాఠశాల ఆవరణలో రంగురంగుల ముగ్గులు వేసి సందడి చేయగా బాలుర విద్యార్థులు కైట్ ఫెస్టివల్ లో ఉత్సాహంగా కేరింతలు చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సార శ్రీనివాస్ మాట్లాడుతూ పండుగలు మన గొప్ప సంస్కృతికి నిదర్శనం అన్నారు. సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించేలా కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమని ఉపాధ్యాయ విద్యార్థి బృందాలను ప్రిన్సిపల్ శ్రీనివాస్ అభినందించారు.ఈ సందర్భంగా విద్యార్థులు రంగవల్లికలు, కైట్ ఫెస్టివల్, కార్యక్రమాలతో అలరించారు. ఈ కార్యక్రమంలో ప్రతిభ విద్యానికేతన్ హై స్కూల్ బృందం విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# యువతకు క్రీడా పోటీలు ఆదర్శనీయం

## – మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు
## – క్రీడా పోటీలకు ఆహ్వానం
## – సిజిఆర్ ట్రస్ట్ చైర్మన్ గోవర్ధన్ రెడ్డి

సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, జనవరి 9 :

యువతకు క్రీడా పోటీలు నిర్వహించడం ఆదర్శనీయమని మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు పేర్కొన్నారు. గుమ్మడిదల మున్సిపాలిటీ కేంద్రంలో ఈ నెల 10వ తేదీ నుండి 12వ తేదీ వరకు సిజిఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న క్రీడా పోటీలకు ట్రస్ట్ చైర్మన్ చిమ్ముల గోవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో ట్రస్ట్ సభ్యులు మాజీ మంత్రి హరీశ్ రావును కలిసి ఆహ్వాన పత్రికను అందించారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ, యువతలో ఆత్మవిశ్వాసం, జట్టు భావన, ఆరోగ్య స్ఫూర్తిని పెంపొందించడంలో క్రీడలకు ప్రాధాన్యం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. స్వామి వివేకానంద స్ఫూర్తిగా సిజిఆర్ ట్రస్ట్ యువత కోసం క్రీడా పోటీలను నిర్వహించడం ఆదర్శనీయమని అభినందించారు. యువత ఈ అవకాశాన్ని వినియోగించుకొని తమ ప్రతిభను చాటుకోవాలని



సూచించారు. 12వ తేదీ కార్యక్రమానికి హాజరై విజేతలకు బహుమతులు అందజేయనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో జిన్నారం వెంకటేష్ గౌడ్, కుమార్ గౌడ్,సంతోష్ రెడ్డి, ట్రస్టు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# తారా విద్యార్థుల ప్రతిభ అభినందనీయం

## – జిల్లా కలెక్టర్ ప్రావీణ్య
## – తంజావూరు పెయింటింగ్ సర్టిఫికెట్ కోర్సు విజయవంతం



సంగారెడ్డి,భారత శక్తి ప్రతినిధి, జనవరి 9 :

తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సంగారెడ్డికి చెందిన విద్యార్థులు నాలుగు రోజులపాటు నిర్వహించిన తంజావూరు పెయింటింగ్ సర్టిఫికెట్ కోర్సులో కనబరిచిన ప్రతిభ అభినందనీయమని జిల్లా కలెక్టర్ పి. ప్రావిణ్య

అన్నారు. శుక్రవారం కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ను తారా కళాశాల ప్రిన్సిపల్, విద్యార్థులు కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఇలాంటి కళా నైపుణ్య శిక్షణా కోర్సులు విద్యార్థుల్లో మానసిక స్థిరత్వం, సృజనాత్మకతను పెంపొందించడంతో పాటు, భవిష్యత్తులో ఆర్థిక స్వావలంబనకు దోహదపడతాయని తెలిపారు. అరుదైన కళారూపాలను కాపాడుతూ ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా ఈ కోర్సును నిర్వహించడం అభినందనీయమన్నారు. తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని అర్థశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో, సోలాపూర్‌కు చెందిన స్వచ్ఛంద సంస్థ జ్ఞాన ప్రబోధిని, మల్లికార్జున హైస్కూల్, రాకంబాయి హత్తురే జూనియర్ కళాశాల, సోలాపూర్ వారి సంయుక్త సహకారంతో

25 గంటల తంజావూరు పెయింటింగ్ సర్టిఫికెట్ కోర్సు నిర్వహించామని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ప్రవీణ తెలిపారు. ఈ కోర్సును బోధించేందుకు సోలాపూర్‌కు చెందిన రిసోర్స్ పర్సన్ ప్రొఫెసర్ మల్లికార్జున బిరాజ్‌దార్ కళాశాలకు వచ్చి, ఇక్కడే బస చేసి ప్రతిరోజు ఆరు గంటల చొప్పున శిక్షణ ఇచ్చి, విద్యార్థులకు తంజావూరు పెయింటింగ్‌కు సంబంధించిన కనీస నైపుణ్యాలను నేర్పించారని తెలిపారు. పెయింటింగ్ అన్నది మానసిక సౌందర్యానికి, సృజనాత్మకతకు ప్రతీక అని, ఈ కోర్సులో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని నైపుణ్యాలు సాధించడాన్ని కలెక్టర్, కళాశాల ప్రిన్సిపల్ ప్రత్యేకంగాఅభినందించారు.

కోర్సును సమర్థవంతంగా బోధించిన మల్లికార్జున బిరాజ్‌దార్, కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపక బృందం, అర్థశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ జగదీశ్వర్, అధ్యాపకురాలు డాక్టర్ అనురాధ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఇలాంటి ఉపాధి కల్పించే వృత్తి నైపుణ్య కోర్సుల ద్వారా విద్యార్థులు తమ కాళ్లపై తాము నిలబడే అవకాశం లభిస్తుందని, ఇతరులపై ఆధారపడే అవసరం తగ్గుతుందని ప్రిన్సిపల్ పేర్కొన్నారు. సాధారణ విద్యతో పాటు వృత్తి విద్యను ప్రోత్సహించే దిశగా తారా కళాశాల నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. నాలుగు రోజుల పాటు నిర్వహించిన తంజావూరు పెయింటింగ్ సర్టిఫికెట్ వర్క్‌షాప్ విజయవంతంగా ముగిసిందని, ఈ కార్యక్రమానికి కళాశాల అధ్యాపక బృందం పూర్తి సహకారం అందించిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్స్ నిర్మల ,జగదీశ్వర్, అర్థశాస్త్ర విభాగ అధ్యాపకులు జ్ఞాన ప్రబోధిని,సంస్థకు చెందిన మురళి, రిసోర్స్ పర్సన్ మల్లికార్జున బిరాజ్‌దార్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# భైంసా వాసవి హైస్కూల్లో ముందస్తు సంక్రాంతి వేడుకలు: మేనేజింగ్ డైరెక్టర్ సురేందర్ రెడ్డి

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, జనవరి 09 (భారత శక్తి): భైంసా పట్టణంలోని వాసవిహైస్కూల్లో ముందస్తు సంక్రాంతి సంబరాలు అంబరాన్ని ఉంటాయి.

ఈ కార్యక్రమంలో భోగిమంటలు గంగిరెద్దులు, పంట పొలం,బొమ్మల కొలువు, ముగ్గుల పోటీలు మరియు పిల్లలు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వాసవి హై స్కూల్ మేనేజింగ్ డైరెక్టర్ సురేందర్ రెడ్డి మాట్లాడుతూ వాసవి పాఠశాలలో కేవలం విద్యనే కాకుండా మన జాతీయ పండుగలను మరియు మన రాష్ట్ర పండుగలను వాటి గొప్పతనాన్ని విశిష్టతను పిల్లలకి తెలియజేస్తూ విద్యతోపాటు అన్ని రంగాల్లో మంచి జ్ఞానాన్ని అందిస్తున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు మరియు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.






# 69వ ఎస్ జి ఎఫ్ అండర్--17 బాలుర జాతీయ కబడ్డీ పోటీలు

## -రెండో రోజు ఉత్కంఠభరితంగా సాగిన కబడ్డీ పోటీలు

పినపాక జనవరి 09 (భారతశక్తి): రాష్ట్రంలో స్కూల్స్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్.జి.ఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 69వ అండర్--17 బాలుర జాతీయ కబడ్డీ పోటీల్లో భాగంగా రెండో రోజు కబడ్డీ పోటీలు ఉత్కంఠభరితంగా సాగి క్రీడాభిమానులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఉదయం, మధ్యాహ్నం సెషన్లలో వివిధ రాష్ట్రాలు, జాతీయ స్థాయి విద్యా సంస్థల జట్లు అత్యంత పోటీతత్వంతో తలపడుతూ విజయం కోసం హోరాహోరీగా పోరాడాయి. ఉదయం సెషన్‌లో మధ్యప్రదేశ్ 50--40తో పంజాబ్‌పై, విద్యాభారతి 55--40తో కేవీఎస్‌పై, ఒడిశా 52--43తో చండీగఢ్‌పై గెలుపు సాధించాయి. ఆంధ్రప్రదేశ్ 70--43తో త్రిపురపై ఘన విజయం సాధించగా, పుదుచ్చేరి 60--46 తో సీఐఎస్‌సీఈను మట్టికరిపించింది. తెలంగాణ జట్టు 46--40తో తమిళనాడుపై విజయం సాధించగా, కర్ణాటక 40--35తో ఢిల్లీని, మహారాష్ట్ర 41--34తో హిమాచల్ ప్రదేశ్‌ను ఓడించాయి. రాజస్థాన్ జట్టు 34--22 తేడాతో ఉత్తరాఖండ్‌పై గెలుపొందింది. మధ్యాహ్నం సెషన్‌లో హర్యానా 71--25తో కేవీఎస్‌పై ఆధిపత్యం చూపింది. మధ్యప్రదేశ్ 52--35తో ఎన్వీఎస్‌ను, మణిపూర్ 49--34తో



జార?ండ్‌ను, సీబీఎస్ఈ 39--35తో పశ్చిమ బెంగాల్‌ను ఓడించాయి. గుజరాత్ 38--32తో జమ్మూ ˛ కాశ్మీర్‌పై, కేరళ 39--35తో సీబీఎస్ఈ వెల్ఫేర్‌పై గెలుపొందాయి. ఉత్తరప్రదేశ్ 34--32తో ఛత్తీస్‌గఢ్‌పై విజయం సాధించగా, విద్యాభారతి 49--38తో అస్సాం, పంజాబ్ 59--34తో ఎన్వీఎస్‌పై ఘన విజయాలు సాధించాయి. రెండో రోజు మ్యాచ్‌లలో ఆటగాళ్లు ప్రదర్శించిన శక్తి, నైపుణ్యం, వ్యూహాత్మక ఆటతీరు ప్రేక్షకులను ఉత్సాహపరిచిందని నిర్వాహకులు తెలిపారు. రాబోయే రోజుల్లో పోటీలు మరింత ఉత్కంఠభరితంగా కొనసాగనున్నాయి.

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల తీరును పరిశీలించిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) జనవరి 09: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ కార్యక్రమంలో భాగంగా జరుగుతున్న ఇళ్ల నిర్మాణ పనుల తీరును శుక్రవారం దోమకొండ మండలం సీతారాంపల్లి గ్రామంలో లబ్ధిదారులు నిర్మించుకుంటున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పనుల తీరును జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పరిశీలించారు.



ఈ సందర్భంగా కలెక్టర్ నిర్మాణ పనుల పురోగతి, నాణ్యత, ఉపయోగిస్తున్న నిర్మాణ సామగ్రి తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. పనులు నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని, ప్రభుత్వ మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటిస్తూ నాణ్యతలో ఎలాంటి రాజీ లేకుండా నిర్మాణాలు చేపట్టాలని లబ్ధిదారులు, సంబంధిత అధికారులకు సూచించారు. అలాగే లబ్ధిదారులకు అవసరమైన అన్ని సహాయ సహకారాలు అందించాలని అధికారులను ఆదేశించారు.

కలెక్టర్ తో పిడి హౌసింగ్ విజయపాల్ రెడ్డి, ఎమ్మార్వో విజయ కుమార్, ప్రత్యేక అధికారి జ్యోతి, ఎంపిడిఓ ప్రవీణ్ కుమార్, సర్పంచ్ నర్సయ్య, లబ్ధిదారులు, తదితరులు ఉన్నారు.

# దోమకొండ మండలంలోని సీతారాంపల్లి కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్



కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) జనవరి 09: దోమకొండ మండల కేంద్రంలోని సీతారాంపల్లి కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాన్ని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు జిల్లా కలెక్టర్ ను బొకే అందించి ఆత్మీయంగా స్వాగతం పలికారు. విద్యార్థినులతో కలెక్టర్ మాట్లాడుతూ, విద్యాలయంలో అన్ని మౌలిక సదుపాయాలు, సౌకర్యాలు సరిగా ఉన్నాయా, భోజనం నాణ్యత ఎలా ఉందని, టాయిలెట్లు అందుబాటులో ఉన్నాయా, వాటిలో రన్నింగ్ వాటర్ వస్తున్నదా, త్రాగునీటి సమస్య ఏమైనా ఉందా అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మొక్కలు నాటి కేజీబీవీ ఆవరణలో నిర్మిస్తున్న పెండింగ్‌లో ఉన్న సంపు నిర్మాణ పనులను పరిశీలించి ఆరా తీశారు. సంపు నిర్మాణ పనులు వెంటనే పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం స్టోరేజ్ ని పరిశీలించి సరకుల నిల్వలను సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. రిజిస్టర్ లను పరిశీలించి రిజిస్టర్ లో ఉన్న నిల్వలను స్టోరేజీలో ఉన్న నిల్వల వివరాలను ఆరా తీసి నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఆన్నారు.

ఈ సందర్శనలో ప్రిన్సిపల్ మంగమ్మ , ఎమ్మార్వో విజయ్ కుమార్, ప్రత్యేక అధికారి జ్యోతి, ఎంపిడిఓ ప్రవీణ్ కుమార్, సర్పంచ్ భానుశ్రీ, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# విజిలెన్స్ మెరుపు దాడిలో పట్టుబడిన 50 లక్షల విలువైన బియ్యం

హైదరాబాద్, భారతశక్తి ప్రత్యేక ప్రతినిధి,జనవరి 09:

విజిలెన్స్ ˛ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆర్.సి.పురం యూనిట్ విశ్వసనీయ సమాచారం మేరకు 08.01.2026 న నిజామాబాద్ జిల్లా ఖానాపూర్ గ్రామంలోని ఒక మూతపడిన రైస్ మిల్‌పై ఆకస్మిక దాడి నిర్వహించారు.



ఈ తనిఖీలో నంబర్ ఞ16ఖజ8287 కలిగిన ఒక ఆటో మరియు భారీ పరిమాణంలో నిల్వ ఉంచిన పీడీఎస్ బియ్యాన్ని కనుగొన్నారు. సదరు మిల్లర్ ఎటువంటి అనుమతులు లేకుండా ఈ బియ్యాన్ని సార్టెక్స్ చేస్తున్నట్లు గుర్తించి, పంచనామా నిర్వహించవలసిందిగా నిజామాబాద్ జిల్లా పౌర సరఫరాల అధికారులను కోరారు. ఈ దాడిలో సుమారు 900 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ సుమారు రూ. 51,00,000/- గా అంచనా వేయబడింది. ఈ స్టాక్‌ను నిజామాబాద్ జిల్లా పౌర సరఫరాల అధికారులకు అప్పగించి, నిత్యావసర వస్తువుల చట్టం కింద 6ూ కేసు నమోదు చేసి తదుపరి చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఆదాయం దుర్వినియోగం కాకుండా చూడటం, ప్రభుత్వ నిధులు మరియు సహజ వనరుల దుర్వినియోగాన్ని నిరోధించడమే విజిలెన్స్ ˛ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం యొక్క ముఖ్య ఉద్దేశ్యం. ప్రభుత్వ నిధులు లేదా వనరుల దుర్వినియోగానికి సంబంధించి ఏదైనా సమాచారం ఉంటే టోల్ ఫ్రీ నంబర్ 14432 కు తెలియజేయాలని విజిలెన్స్ ˛ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ జనరల్ ప్రజలను కోరుతున్నారు.

# సినిమా






## జననాయకన్‌కు మద్రాస్ హైకోర్టు గ్రీన్ సిగ్నల్

విజయ్ నటించిన జననాయకన్ సినిమా విడుదలకు మార్గం సుగమమైంది. సినిమా కోసం యూ/ఏ 16 ప్లస్ సర్టిఫికెట్ జారీ చేయాలని మద్రాస్ హైకోర్టు సెంట్రల్ ఫిల్మ్ సర్టిఫికేషన్ బోర్డును ఆదేశించింది. ఇరు పక్షాల వాదనలు విన్న అనంతరం జస్టిస్ పీటీ ఆశ ఈ తీర్పు ఇచ్చారు. సినిమాపై అభ్యంతరం తెలిపిన సెన్సార్ బోర్డ్ సభ్యుడి ఫిర్యాదు తరువాత వచ్చిన ఆలోచనలా కనిపిస్తోందని కోర్టు వ్యాఖ్యానించింది. ఇలాంటి ఫిర్యాదులను ప్రోత్సహించడం ప్రమాదకరమని, సర్టిఫికేషన్ ప్రక్రియలో స్పష్టత, బాధ్యత అవసరమని స్పష్టం చేసింది. సెన్సార్ సర్టిఫికెట్ ఆలస్యం కావడంతోనే జననాయకన్ విడుదల వాయిదా పడింది. ఈ నేపథ్యంలో నిర్మాతలు హైకోర్టును ఆశ్రయించారు. ఇప్పటికే దేశంలో, విదేశాల్లో అడ్వాన్స్ బుకింగ్స్ ప్రారంభం కావడం గమనార్హం. తీర్పు తర్వాత కూడా నిర్మాతలు విడుదల తేదీని ఇంకా ప్రకటించలేదు. జనవరి 14న పొంగల్ సందర్భంగా సినిమా విడుదలయ్యే అవకాశముందని సమాచారం. ఇది రాజకీయాల్లోకి అడుగుపెట్టే ముందు విజయ్ నటించిన చివరి సినిమా కావడం వల్ల ప్రత్యేక ప్రాధాన్యం సంతరించుకుంది.

## త్వరలోనే గుడ్ న్యూస్



చిన్నారి పెళ్లి కూతురు సీరియల్ తో దక్షిణాది ప్రేక్షకులకు ఇష్టమైన నటిగా మారింది అవికా గోర్. బాలనటిగా బుల్లితెరపై సందడి చేసిన ఈ అమ్మడు.. ఇప్పుడు హీరోయిన్‌గా వెండితెరపై అలరిస్తుంది. అయితే గత కొద్దిరోజులుగా అవికా తెలుగు సినిమాలకు దూరంగా ఉంటుంది. బాలీవుడ్ లో ఎక్కువగా ఫోకస్ పెట్టింది. అక్కడ మూవీలు, వెబ్ సిరీస్ లు చేస్తూ అభిమానులను ఆకట్టుకుంటుంది. కాగా.. ఈ భామ గతేడాది పెళ్లిపీటలెక్కింది. ప్రియుడు మిలింద్ చంద్వానీని 2025 సెప్టెంబర్ 30న వివాహం చేసుకుంది. అయితే ఇటీవల ఈ జంట ఓ వ్లాగ్‌లో త్వరలోనే ఒక కొత్త ప్రయాణం మొదలు కానుందని అనౌన్స్‌చేసింది. తాము ఊహించని, ప్లాన్ చేయని మార్పు ఇది.. కలలో కూడా దీని గురించి ఆలోచించలేదని వారు పేర్కొన్నారు.దీంతో అవికా ప్రెగ్నెంట్ అంటూ ప్రచారం ఊపందుకుంది. ఈ రూమర్స్‌ను తాజాగా ఈ బ్యూటీ కొట్టిపారేసింది. 'నేను గర్భవతిని కాదు. అలాంటి విశేషం ఏం లేదు. కాకపోతే అతి త్వరలోనే ఓ గుడ్‌న్యూస్ చెప్తాను. అదేంటో తెలుసుకోవాలంటే కొంతకాలం ఆగాల్సిందే!' అంటూ అవికా క్లారిటీ ఇచ్చింది.

## విజయ్ 'జన నాయగన్'కు మళ్లీ షాక్.. స్టే ఇచ్చిన డివిజన్ బెంచ్



చెన్నై: విజయ్ 'జన నాయగన్'కు మరో షాక్ తగిలింది. ఈ సినిమాకు యూ/ఏ సర్టిఫికెట్ ఇవ్వాలని సెన్సార్ బోర్డును మద్రాసు హైకోర్టు సింగిల్ బెంచ్ ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. కోర్టు ఉత్తర్వులతో విజయ్ అభిమానులతో సహా, చిత్ర బృందం ఊపిరి పీల్చుకుంది. కానీ, ఆ ఆనందం ఎంతో సేపు నిలవలేదు. సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ సీబీఎఫ్‌సీ మద్రాసు హైకోర్టు డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించింది. కేసు విచారణకు స్వీకరించిన న్యాయస్థానం.. సెన్సార్ సర్టిఫికెట్ జారీపై తాత్కాలిక స్టే విధించింది. తదుపరి విచారణను జనవరి 21వ తేదీకి వాయిదా వేసింది.


## 'పరాశక్తి'కి సెన్సార్ పూర్తి.. వివాదాలను దాటి విడుదలకు మార్గం సుగమం

మరో తమిళ చిత్రం విడుదలకు మార్గం సుగమమైంది. శివకార్తికేయన్ కథానాయకుడిగా సుధ కొంగర దర్శకత్వంలో రూపొందిన పీరియాడిక్ పొలిటికల్ యాక్షన్ డ్రామా 'పరాశక్తి'. జనవరి 10న (Para sakthi release date) ఈ చిత్రం తమిళ, తెలుగు భాషల్లో విడుదల కానుంది. శ్రీలీల, రవిమోహన్, అథర్వ మురళీ నటించారు. గురువారం రాత్రి వరకూ సెన్సార్ సర్టిఫికెట్ రాకపోవడంతో సినిమా వస్తుందా? రాదా? అన్నదానిపై సందిగ్ధత నెలకొంది. ఎట్టకేలకు శుక్రవారం ఉదయం 'పరాశక్తి'కి యూ/ఏ ఇస్తూ సెన్సార్ సర్టిఫికెట్ ఇచ్చింది. దీంతో అనుకున్న తేదీ ప్రకారం జనవరి 10న సినిమా ప్రేక్షకుల ముందుకురానుంది. 1960లలో తమిళనాడులోని హిందీ వ్యతిరేక నిరసనల నేపథ్యంతో ఇద్దరు స్నేహితుల చుట్టూ తిరుగుతున్న కథాంశంతో రూపొందినట్లు ప్రచార చిత్రాలు చూస్తే అర్థమవుతోంది.

## ఆద్యంతం వార్తల్లో నిలుస్తూ..




సినిమా ప్రారంభం నుంచి టైటిల్ వరకూ ఏదోఒక సందర్భంలో 'పరాశక్తి' వార్తల్లో నిలుస్తూనే ఉంది. విజయ్ ఆంటోని తమిళంలో రూపొందించిన 'శక్తి తిరుమగణ్'కు తెలుగులో 'పరాశక్తి' అని పేరు పెట్టారు. టైటిల్ విషయంలో కొన్ని రోజుల పాటు చర్చ నడిచింది. ఆ టైటిల్ పెట్టడంపై విజయ్ ఆంటోనీ కూడా క్లారిటీ ఇచ్చారు. తాను గతంలోనే ఈ పేరు రిజిస్టర్ చేయించుకున్నానని తెలియజేశారు. అంతేకాదు, తెలుగులో తాను 'పరాశక్తి' అనే టైటిల్ ఉపయోగించుకునేలా ది సౌత్ ఇండియన్ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఇచ్చిన అధికారిక పత్రాన్ని కూడా షేర్ చేశారు. హైదరాబాద్‌లోని కోఠి ఉమెన్స్ కాలేజ్‌లో కొన్ని రోజుల పాటు 'పరాశక్తి' షూట్ జరిగింది. ఈ సందర్భంగా అక్కడి విద్యార్థులు ఇబ్బందికర పరిస్థితులు ఎదుర్కొన్నట్లు వార్తలు వచ్చాయి. దీనిపై కళాశాల ప్రిన్సిపల్ సైతం స్పందించారు. విద్యార్థినుల భద్రతే తమకు ముఖ్యమని, కేవలం సెలవు రోజుల్లో మాత్రమే షూటింగ్‌లకు అనుమతిస్తామని చెప్పారు. ఇక 'పరాశక్తి' విడుదల తేదీ విషయంలోనూ వార్తల్లో నిలిచింది. తొలుత అనుకున్న షెడ్యూల్ ప్రకారం ఈ చిత్రాన్ని జనవరి 14న విడుదల చేయాలనుకున్నారు. రెండు భాషల్లో విడుదలవుతున్న 'పరాశక్తి'కి తెలుగులో థియేటర్స్ దొరకడం కాస్త కష్టమే. ఎందుకంటే సంక్రాంతి పండగ మూడు రోజులు ఇక్కడ వరుస సినిమాలు సందడి చేయనున్నాయి. ఈ క్రమంలో అప్పుడు రావడం సరైన నిర్ణయం కాదని చిత్రబృందం భావించింది. దీంతో విడుదల తేదీని కాస్త ముందుకు జరిపారు. ప్రభాస్ 'ది రాజా సాబ్' ఇప్పటికే విడుదల కాగా, జనవరి 12న చిరంజీవి 'మన శంకరవరప్రసాద్‌గారు', జనవరి 13న 'భర్త మహాశయులకు విజ్ఞప్తి', జనవరి 14న 'నారీ నారీ నడుమ మురారి', జనవరి 14న 'అనగనగా ఒక రాజు' చిత్రాలు సందడి చేయబోతున్నాయి. దీంతో 'పరాశక్తి'ని జనవరి 10వ తేదీకి మార్చారు. ఆకాశ్ భాస్కరన్‌కు చెందిన డాన్ పిక్చర్స్ రూ.150 కోట్ల బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మించింది.



## అఖండ 2 స్ట్రీమింగ్

నందమూరి బాలకృష్ణ, బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో రూపొందిన సినిమా అఖండ 2: తాండవం. సనాతన హైందవ ధర్మ పరిరక్షణ నేపథ్యంలో రూపొందిన డివైన్ యాక్షన్ మూవీ ఇది. ఇందులో రుద్ర సికిందర్ అఘోరాగా, బాల మురళీ కృష్ణగా బాలయ్య ద్విపాత్రాభినయం చేశాడు. గతేడాది డిసెంబరు 12న థియేటర్లలో విడుదలైన ఈ చిత్రం ఇప్పుడు ఓటీటీలో స్ట్రీమింగ్ అవుతోంది. తెలుగుతో పాటు హిందీ, తమిళ్, కన్నడ, మలయాళ భాషల్లో అందుబాటులో ఉంది. ఈ మూవీ డిజిటల్ హక్కులను ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్‌భారీ రేటుకు సొంత చేసుకున్న విషయం తెలిసిందే. సినిమా కథ విషయానికొస్తే.. టిబెట్ సరిహద్దుల్లో కుంభమేళా నేపథ్యంలో సాగుతుంది. దేవుడిపై భారతీయుల నమ్మకాల్ని దెబ్బకొట్టాలని ప్లాన్ చేసిన శత్రుదేశం.. కుంభమేళాని లక్ష్యంగా చేసుకుని బయోవార్‌కు దిగుతుంది. దానికి విరుగుడు వ్యాక్సిన్ కనిపెట్టిన ఇస్రో శాస్త్రవేత్తల బృందాన్ని అంతం చేయడానికి ప్రయత్నిస్తుంది. ఆ బృందంలో మిగిలిన ఏకైక శాస్త్రవేత్త జనని (హర్షాలీ మల్హోత్రా)ని రక్షించడానికి రుద్ర సికిందర్ అఘోరా (బాలకృష్ణ) రంగంలోకి దిగుతాడు. జననీతో అఘోరాకి ఉన్న సంబంధం ఏంటి?, శత్రువుల్ని ఎదిరించి అఖండ ఎలా సనాతన హైందవ ధర్మాన్ని, దేశాన్ని కాపాడాడు? అనేది ఈ చిత్ర ఇతివృత్తం.

## ఇది మొసళ్ల పండుగ!


దిరాజాసాబ్ విడుదల వేళ మొసళ్ల పండగను తలపిస్తున్నాయి థియేటర్లు. ఈ సినిమా ట్రైలర్ విడుదలైన నాటి నుంచి మొసలి మీమ్స్ సోషల్ మీడియాలో వైరల్ అయిన విషయం తెలిసిందే. ఇవాళ ఈ చిత్రం విడుదల కావడంతో కొందరు అభిమానులు ఏకంగా మొసలి బొమ్మలను థియేటర్‌లలోకి తీసుకెళ్లి హంగామా చేస్తున్నారు. క్లైమాక్స్‌లో ప్రభాస్ మొసలితో ఫైట్ చేసే సన్నివేశం థియేటర్‌లో వచ్చే సమయంలో ఆ బొమ్మలతో స్క్రీన్ వద్దకు వెళ్లి దాన్ని రీక్రియేట్ చేస్తున్నారు. ప్రస్తుతం ఈ వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. అయితే కొందరు మాత్రం ఇవి ఏఐతో చేసిన వీడియోలంటూ కామెంట్స్ పెడుతున్నప్పటికీ ఈ సినిమా విడుదల సందర్భంగా మొసలి మాత్రం హైలైట్ అవుతోంది. 'ఎవర్రా మీరంతా..', 'ఇది మొసళ్ల పండగ' అంటూ నెటిజన్లు ఫన్నీ కామెంట్స్ పెడుతున్నారు.



### 'కాంతార', 'మహావతార్ నరసింహ' జోరు..

## ఆస్కార్ బరిలో మరో ముందడుగు

ఈ ఏడాది ఆస్కార్ బరిలో హోంబలే ఫిల్మ్స్ నిర్మించిన రెండు సినిమాలు పోటీపడనున్నాయి. ప్రతిష్ఠాత్మక ఈ అవార్డుల రేసులో ఉన్న కాంతార: చాప్టర్ 1, మహావతార్ నరసింహ చిత్రాలు మరో ముందడుగు వేశాయి. ఆస్కార్ అవార్డ్స్‌ల జనరల్ ఎంట్రీలో చోటు దక్కించుకున్నాయి. దీంతో ఉత్తమ నటుడు, ఉత్తమ నటి, ఉత్తమ డైరెక్టర్‌తో పాటు నిర్మాత, స్క్రీన్‌ప్లే, ప్రొడక్షన్ డిజైన్, సినిమాటోగ్రఫీ వంటి ఇతర కేటగిరీల్లోనూ ఇవి పోటీపడబోతున్నాయి. ఈ విషయాన్ని తెలుపుతూ హోంబలే ఫిల్మ్స్ ఎక్స్‌లో పోస్టు పెట్టింది. ఆస్కార్‌కు రెండు అడుగుల దూరంలో ఉన్నామని తెలిపింది. ఇక 98వ ఆస్కార్ అవార్డుల వేడుక 2026 మార్చి 15న జరగనుంది . ఆస్కార్ కోసం పోటీపడనున్న చిత్రాల తుది జాబితాను 2026 జనవరి 22న ప్రకటించనున్నట్లు అకాడమీ వెల్లడించింది. లాస్ ఏంజెలెస్‌లోని డాల్బీ థియేటర్‌లో ఈ 98వ ఆస్కార్ వేడుక జరగనుంది. 2025 జనవరి నుంచి డిసెంబర్ వరకు విడుదలైన చిత్రాలు ఇందులో పోటీపడనున్నాయి. 'కాంతార 1', 'మహావతార్ నరసింహ'లతో పాటు ఈ ఏడాది ఆస్కార్‌కు భారత్ నుంచి ఐదు చిత్రాలు పోటీపడనున్నాయి. 'టూరిస్ట్ ఫ్యామిలీ', 'తన్వీ ది గ్రేట్', 'సిస్టర్ మిడ్‌నైట్' సినిమాలు ఆస్కార్ బరిలో నిలిచాయి. దీంతో జనవరి 22న తుది నామినేషన్ల జాబితా కోసం సినీ ప్రియులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.






## సుజుకీ ఇయాక్సెస్ వచ్చేసింది.. ధర రూ.1.88 లక్షలు



సుజుకీ మోటార్‌సైకిల్ ఇండియా తన తొలి విద్యుత్ స్కూటర్‌ను దేశీయ మార్కెట్‌లోకి లాంచ్ చేసింది. తన విజయవంతమైన మోడల్ యాక్సెస్‌ను.. ఎలక్ట్రిక్ వెర్షన్‌లో ఇయాక్సెస్ పేరుతో లాంచ్ చేసింది. కంపెనీ తన గురుగ్రామ్ ప్లాంట్‌లో దీన్ని తయారు చేయనుంది. ఎలక్ట్రిక్ స్కూటర్ల మార్కెట్‌లో బజాజ్ చేతక్, టీవీఎస్ ఐక్యూబ్, ఏథర్ రిజ్తాతో ఇది పోటీ పడనుంది. సుజుకీ ఇయాక్సెస్‌లో 3.07 kWh లిథియం ఐరన్ పాస్ఫేట్ బ్యాటరీని అమర్చారు. ఇది సింగిల్ ఛార్జ్‌తో 95 కిలోమీటర్ల రేంజ్ ఇస్తుందని కంపెనీ చెబుతోంది. ఈ స్కూటర్‌లో 4.1kW ఎలక్ట్రిక్ మోటార్‌ను అమర్చారు. ఇది 15 Nm పీక్ టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. పోర్టబుల్ ఛార్జర్‌తో 080 శాతం ఛార్జింగ్‌ను 4 గంటల 30 నిమిషాల్లో ఛార్జ్ చేయొచ్చని కంపెనీ పేర్కొంది. ఫాస్ట్ ఛార్జర్‌తో అయితే పూర్తి బ్యాటరీని ఛార్జ్ చేయడానికి 2 గంటల 12 నిమిషాల సమయం పడుతుందని కంపెనీ వెల్లడించింది. టాప్ స్పీడ్ గంటకు 71 కిలోమీటర్లుగా కంపెనీ పేర్కొంది. ఇందులో పూర్తి డిజిటల్ ఇన్‌స్ట్రుమెంటల్ కన్సోల్ ఉంది. దీంట్లో ఎకో, రైడ్ ఏ, రైడ్ బి మోడ్‌లు ఉన్నాయి. రీజనరేటివ్ బ్రేకింగ్, రివర్స్ మోడ్ వంటి సదుపాయాలు కూడా ఉన్నాయి. బ్లూటూత్/యాప్ కనెక్టివిటీ ఉన్నాయి. యూఎస్‌బీ ఛార్జింగ్ సదుపాయం కూడా ఉంది. ఎల్ఈడీ లైట్స్ ఇచ్చారు. మొత్తం నాలుగు కలర్ ఆప్షన్లలో లభిస్తోంది. గతేడాది భారత్ మొబిలిటీ ఎక్స్‌పో 2025లో దీన్ని తొలిసారిగా ప్రదర్శించారు. సుజుకీ డీలర్‌షిప్‌లతో పాటు ఫ్లిప్‌కార్ట్‌లో కూడా ఆర్డర్ చేయొచ్చు. ఏడేళ్లు లేదా 80వేల కిలోమీర్ల వరకు వారెంటీ, సుజుకీ కస్టమర్లకు రూ.10వేల వరకు లాయల్టీ బోనస్, ఇతర వినియోగదారులకు రూ.7వేలు వెల్‌కం బోనస్ ఇస్తున్నారు. 5.99 శాతం వడ్డీ రేటుతో ఫైనాన్సింగ్ ఆప్షన్లు కూడా ఉన్నాయి.

## ఆధార్‌పై అవగాహన కోసం మస్కట్ ఉదయ్

ఆధార్ సేవలపై ప్రజలకు మరింత సులభంగా అవగాహన కలిగేలా 'ఉదయ్' పేరుతో మస్కట్‌ను భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (యూఐఏడీఐ) తీసుకొచ్చింది. మైగవ్ ప్లాట్‌ఫామ్‌పై డిజైన్, పేరు కోసం నిర్వహించిన పోటీలో వచ్చిన స్పందనల నుంచి ఈ మస్కట్‌ను ఎంపిక చేశారు. ఆధార్ అప్‌డేట్‌లు, ధ్రువీకరణ, ఆఫ్‌లైన్ వెరిఫికేషన్, ఎంపిక




చేసిన సమాచారాన్ని పంచుకోవడం, కొత్త టెక్నాలజీని అందిపుచ్చుకోవడం, బాధ్యతాయుత వినియోగం వంటి ఆధార్ సేవలను కొత్త మస్కట్ సులభతరం చేయనుంది. తిరువనంతపురంలో జరిగిన కార్యక్రమంలో మస్కట్‌ను యూఐఏడీఐ ఛైర్మన్ నీల్‌కాంత్ మిశ్రా ఆవిష్కరించి, రూపకర్తలను సత్కరించారు. మస్కట్ కోసం నిర్వహించిన పోటీలో దేశవ్యాప్తంగా విద్యార్థులు, నిపుణులు, డిజైనర్ల నుంచి 875 ఎంట్రీలు వచ్చాయి. మస్కట్ డిజైన్ పోటీలో కేరళలోని త్రిసూర్‌కు చెందిన అరుణ్ గోకుల్ మొదటి బహుమతి గెలుచుకున్నారు.

## టెంపుల్ డివైజ్‌పై వివాదం..
### స్పందించిన జొమాటో సీఈఓ దీపిందర్ గోయల్



జొమాటో సీఈవో దీపిందర్ గోయల్ ఇటీవల తన కణతపై ఒక స్పెషల్ డివైజ్‌తో కనిపించారు. దాన్ని టెంపుల్ డివైజ్ అంటారని కూడా చెప్పారు. ఈ హెల్త్ టెక్ పరికరంపై తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. ఎయిమ్స్ డాక్టర్లు కూడా ఈ విషయంలో అభ్యంతరం వ్యక్తం చేశారు. తాజాగా దీనిపై దీపిందర్ ఎక్స్‌లో వివరణ ఇచ్చారు. ''మా 'టెంపుల్' డివైజ్ ఇంకా అభివృద్ధి దశలోనే ఉంది. పనితీరు, ప్రమాణాలపై ఎలాంటి డేటా విడుదల చేయలేదు. దీనిని ప్రజల ముందుకు తీసుకురావడానికి కొంత సమయం పడుతుంది. పూర్తిగా పరీక్షించని, ధ్రువీకరించని, ఆమోదం పొందని పరికరాన్ని కొనుగోలు చేయొద్దని కొందరు సూచిస్తుండటం వింతగా ఉంది. డివైజ్‌ను మార్కెట్‌లోకి తీసుకురావాలని మేం భావించినప్పుడు.. దాని వెనక ఉన్న శాస్త్రీయతను వివరిస్తాం. అప్పుడు మీ సూచనలు ఇవ్వండి. అప్పటివరకు ఆసక్తిగా ఎదురుచూడండి. భారత స్టార్టప్‌లను వీలైనంతగా ప్రోత్సహించండి'' అని దీపిందర్ పేర్కొన్నారు. టెంపుల్ పరికరం గురించి కొన్ని రోజుల క్రితం గోయల్ ఒక పాడ్‌కాస్ట్‌లో వెల్లడించారు. ఇది మెదడులో రక్తప్రసరణ వివరాలను గుర్తిస్తుందని, ఏదైనా ఒత్తిడి కలిగినప్పుడు శరీరంలో వచ్చే మార్పులను తెలియజేస్తుందని తెలిపారు. శరీర స్థితిగతులను బట్టి మెదడు ఎలా స్పందిస్తుందనేది ముందుగానే పసిగట్టడం వల్ల నివారణ మార్గాలవైపు దృష్టి సారించే వీలు కలిగే అవకాశం ఉందని తెలిపారు.

## జియో ఐపీఓ: 2.5%వాటా విక్రయించనున్న రిలయన్స్!




మదుపర్లు ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఐపీఓల్లో రిలయన్స్ జియో ఒకటి. 50 కోట్ల మంది యూజర్లతో దేశంలోనే అతిపెద్ద టెలికాం కంపెనీ కావడం, పైగా రిలయన్స్ ఇండస్ట్రీస్ వంటి పెద్ద సంస్థ నుంచి వస్తుండడంతో దీనిపై ఆసక్తి నెలకొంది. ఈ ఏడాదిలోనే రానున్న ఈ ఐపీఓకు సంబంధించి తాజాగా ఓ విషయం బయటకు వచ్చింది. తొలి పబ్లిక్ ఇష్యూ (IPO) ద్వారా 2.5 శాతం వాటాను రిలయన్స్ విక్రయించనున్నట్లు రాయిటర్స్ తన కథనంలో పేర్కొంది. తద్వారా మార్కెట్ నుంచి సుమారు 4 బిలియన్ డాలర్లు (సుమారు రూ.36 వేల కోట్లు) సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు సంబంధిత వర్గాలను ఉటంకిస్తూ పేర్కొంది. దీంతో భారత స్టాక్ మార్కెట్ చరిత్రలో అతిపెద్ద ఐపీఓగా ఇది నిలవనుంది. రిలయన్స్ జియో మార్కెట్ విలువను ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ జెఫ్రీస్ 180 బిలియన్ డాలర్లుగా అంచనా కట్టింది. ఆ లెక్కన 2.5 శాతం వాటా విక్రయిస్తే సుమారు 4.5 బిలియన్ డాలర్లు అవుతుంది. ఈ వాటా విక్రయాన్ని ఆఫర్ ఫర్ సేల్ రూపంలో చేపడతారా లేక కొత్త షేర్ల జారీ ద్వారానా అనే విషయంలో ఇంకా నిర్ణయం తీసుకోలేదని తెలుస్తోంది. ప్రస్తుతం ఐపీఓకు సంబంధించి మోర్గాన్ స్టాన్లీ, కోటక్ మహీంద్రా బ్యాంకు ముసాయిదా పత్రాల రూపకల్పనలో నిమగ్నమై ఉన్నాయని రాయిటర్స్ పేర్కొంది. అయితే ఈ విషయంలో రిలయన్స్ అధికారికంగా స్పందించలేదు. రిలయన్స్ జియోను రాబోయే ఐదేళ్లలో ఐపీఓకు తీసుకొస్తామని 2019లోనే ముకేశ్ అంబానీ ప్రకటించారు. ఆ తర్వాత కేవలం టెలికాం వ్యాపారానికే పరిమితం కాకుండా.. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లోకీ సంస్థ ఎంట్రీ ఇచ్చింది. తద్వారా కంపెనీ మార్కెట్ విలువను భారీగా పెంచుకోగలిగింది. ఐపీఓ ఆలస్యం కావడానికి ఇదీ ఓ కారణం. ఇదిలా ఉండగా కొన్ని ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకులు జియో మార్కెట్ విలువ 200 నుంచి 240 బిలియన్ డాలర్లుగా లెక్కగడుతున్నాయి. ఇటీవల కాలంలో అనేక కంపెనీలు రిలయన్స్ జియోలో పెద్ద మొత్తంలో పెట్టుబడులు పెట్టాయి. ఐపీఓ సమయంలో తమ వాటాలను విక్రయించి సొమ్ము చేసుకోవాలని ఆయా కంపెనీలు చూస్తున్నాయి.




## వాళ్లు అన్నంత పనీ చేస్తారేమో..
## బంగ్లా ఆటగాళ్లలో గుబులు..!


భారత్, బంగ్లాదేశ్ మధ్య దౌత్యపరమైన ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ బంగ్లా క్రికెటర్ల స్పాన్సర్‌షిప్‌లకు ఎసరు వచ్చే సూచనలు కనిపిస్తున్నాయి! బంగ్లాదేశ్ కెప్టెన్ లిటన్ దాస్, యాసిర్ అలీ, మోమినుల్ హక్ వంటి టాప్ ప్లేయర్లకు భారత సంస్థ ఎస్‌జీ స్పాన్సర్‌గా వ్యవహరిస్తోంది. ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో ఆ సంస్థ తమ స్పాన్సర్‌షిప్‌ను కొనసాగించకూడదనే నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. అయితే దీనిపై ఇంతవరకు అధికారిక ప్రకటన వెలువడలేదు. ఈ పరిణామాలపై బంగ్లా క్రికెటర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. 'త్వరలోనే ఎస్‌జీ స్పాన్సర్‌గా వైదొలగొచ్చు' అని ఓ క్రికెటర్ ఓ వెబ్‌సైట్‌తో చెప్పినట్లుగా వార్తలు వస్తున్నాయి. 'ఒకవేళ ఎస్‌జీ అలాంటి నిర్ణయం తీసుకుంటే.. ఇతర సంస్థలు సైతం అదే మార్గంలో నడవొచ్చు' అని అతడు అభిప్రాయపడ్డట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. బంగ్లాదేశ్‌లో కొంతకాలంగా రాజకీయ అనిశ్చితి




కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో హిందువులపై వరుసగా దాడులు జరుగుతున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో బంగ్లా క్రికెటర్ ముస్తాఫిజుర్ రెహమాన్‌ను ఐపీఎల్ (IPL) మినీ వేలంలో కేకేఆర్ (Kolkata Knight Riders) రూ.9.20 కోట్లకు తీసుకోవడంపై విమర్శలు వ్యక్తమయ్యాయి. దీంతో అతడిని రిలీజ్ చేయాలని బీసీసీఐ (BCCI).. కోల్‌కతా నైట్ రైడర్స్ యాజమాన్యాన్ని ఆదేశించింది. ఈ నేపథ్యంలో కేకేఆర్ ఫ్రాంఛైజీ ముస్తాఫిజుర్‌ను విడుదల చేసింది. ఈ సంఘటన తర్వాత బంగ్లాదేశ్ ప్రభుత్వం తమ దేశంలో ఐపీఎల్ ప్రసారాలను నిలిపివేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే భద్రత కారణాల దృష్ట్యా తమ క్రికెట్ జట్టు టీ20 వరల్డ్ కప్ (ICC Mens T20 World Cup) 2026 భారత్‌లో ఆడబోదని బీసీబీ.. ఐసీసీకి (ICC) లేఖ రాసింది. తమ మ్యాచ్‌లను మరోచోట నిర్వహించాలని అందులో పేర్కొన్న విషయం తెలిసిందే. అయితే దీనిపై ఐసీసీ ఇంతవరకు అధికారికంగా స్పందించలేదు.

## సెమీస్‌కు పీవీ సింధు.. క్వార్టర్ ఫైనల్‌లో గాయంతో వైదొలగిన యమగుచి

కౌలాలంపుర్ వేదికగా జరుగుతున్న మలేసియా ఓపెన్ ప్రపంచ టూర్ సూపర్ 1000 బాడ్మింటన్ టోర్నమెంట్‌లో పీవీ సింధు సెమీఫైనల్‌కు చేరుకుంది. ఆమె ప్రత్యర్థి జపాన్‌కు చెందిన అకానే యమగుచి గాయం వల్ల క్వార్టర్ ఫైనల్ నుంచి వైదొలిగింది. ఆమె ఆట నుంచి తప్పుకోవడానికి ముందు సింధు 21 11తో ప్రారంభ గేమ్‌ను గెలుచుకుంది. ఈ విజయంతో ప్రపంచ మూడో ర్యాంక్‌లో



ఉన్న యమగుచిపై 18వ ర్యాంక్‌లో ఉన్న సింధు హెడ్ టు హెడ్ రికార్డ్ 15 12కు చేరుకొంది. గాయం తర్వాత సింధు తొలిసారిగా ఈ టోర్నమెంట్‌లో పోటీపడుతోంది. మరో క్వార్టర్ ఫైనల్‌లో చైనాకు చెందిన రెండో సీడ్ వాంగ్ జియి, ఇండోనేషియా ఆరో సీడ్ పుత్రి కుసుమా వార్దాని పోటీపడుతున్నారు. వీరిలో విజేతగా నిలిచిన వారితో సింధు సెమీస్‌లో తలపడనుంది.

## డబ్ల్యూపీఎల్ 2026లో ఫస్ట్ మ్యాచ్..
### టాస్ నెగ్గిన బెంగళూరు

నవీ ముంబయి: మహిళల ప్రిమియర్ లీగ్ 2026 సీజన్‌కు వేళైంది. తొలి మ్యాచ్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, ముంబయి ఇండియన్స్ జట్ల మధ్య జరగనుంది. ఈ క్రమంలో టాస్ నెగ్గిన ఆర్సీబీ బౌలింగ్ ఎంచుకుంది. మ్యాచ్‌కు ముందు జరిగిన ప్రారంభోత్సవంలో బాలీవుడ్ తారల డ్యాన్స్‌లు, పాటలతో వేదిక మారుమోగిపోయింది.




**తుది జట్లు:**

ముంబయి: నాట్ స్కివెర్ బ్రంట్, కమలిని (వికెట్ కీపర్), అమెలియా కెర్, హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), అమన్‌జోత్ కౌర్, నికోలా కారీ, పూనమ్, షబ్నిమ్ ఇస్మాయిల్, సంస్కృతి గుప్తా, సంజీవన్ సజనా, సైకా ఇష్కి బెంగళూరు: స్మృతి మంధాన (కెప్టెన్), గ్రేస్ హారిస్, దయాలన్ హేమలత, రిచా ఘోష్ (వికెట్ కీపర్), రాధా యాదవ్, నదైన్ డి క్లార్క్, అరుంధతి రెడ్డి, శ్రేయాంక పాటిల్, ప్రేమా రావత్, లిన్సే స్మిత్, లౌరెన్ బెల్

## తమీమ్ ఇక్బాల్ 'ఇండియన్ ఏజెంట్'
## బీసీబీ సభ్యుడి సంచలన ఆరోపణలు..

బంగ్లాదేశ్ మాజీ క్రికెటర్ తమీమ్ ఇక్బాల్‌ను బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డ్ సభ్యుడు నజ్ముల్ ఇస్లామ్ సోషల్ మీడియా వేదికగా 'ఇండియన్ ఏజెంట్' అని నిందించాడు. ఫిబ్రవరి 7 నుంచి మార్చి 8 మధ్య టీ20 వరల్డ్ కప్ భారత్, శ్రీలంక వేదికగా జరగనుంది. అయితే భద్రతా కారణాలను సాకుగా చూపుతూ తమ జట్టు భారత్‌కు రాలేదని, తమ మ్యాచ్‌లను తటస్థ వేదికపై నిర్వహించాలని బీసీబీ.. ఐసీసీకి మెయిల్ చేసింది. దీనిపై ఐసీసీ ఇంతవరకు అధికారికంగా స్పందించలేదు. అయితే ఈ అంశంపై బంగ్లాదేశ్ మాజీ క్రికెటర్ తమీమ్ ఇక్బాల్ మాట్లాడాడు. '90 నుంచి 95 శాతం ఆదాయం ఐసీసీ నుంచే మనకు వస్తోంది. కాబట్టి ప్రతిదీ క్షుణ్ణంగా సమీక్షించుకున్నాకే నిర్ణయాలు తీసుకోవాలి' అని తమీమ్ సూచించాడు. దీనిపై బీసీబీ సభ్యుడు నజ్ముల్ ఇస్లామ్ సంచలన ఆరోపణలు చేశాడు. 'నజ్ముల్ ఇస్లామ్ ఇండియన్ ఏజెంట్ అని ఈసారి బంగ్లాదేశ్ మొత్తానికి నిరూపితమైంది' అని ఫేస్‌బుక్‌లో పోస్ట్ పెట్టాడు. 'నాకు




బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డుతో సంబంధం లేదు. అందుకే నేను సైతం సాధారణ పౌరుడిలానే మీడియా ద్వారా విషయాలను తెలుసుకుంటున్నాను. నా దగ్గర ఎక్కువ సమాచారం లేదు కాబట్టి నేను ఎక్కువగా వ్యాఖ్యలు చేయకూడదు. అయితే నేను చెప్పే విషయం ఒక్కటే.. అటువంటి నిర్ణయం తీసుకునేముందు భవిష్యత్తును కూడా దృష్టిలోపెట్టుకోవాలి. చర్చల ద్వారా పరిష్కారం కనుగొంటే అంతకంటే మంచిది మరోటి లేదు. అలాగే ఇది సున్నితమైన అంశం కాబట్టి.. బహిరంగ వ్యాఖ్యలు చేసేముందు బీసీబీ అంతర్గతంగా చర్చించుకోవాలి. తర్వాతే నిర్ణయాలు తీసుకోవాలి. ఎందుకంటే ఒక్కసారి మాట జారిన తర్వాత దాన్ని వెనక్కి తీసుకోవడం చాలా కష్టం. బంగ్లాదేశ్ క్రికెట్ భవిష్యత్తే అన్నింటికన్నా ముఖ్యం. మనకు 90 నుంచి 95 శాతం వరకు ఆదాయం ఐసీసీ నుంచే వస్తుంది. కాబట్టి బంగ్లాదేశ్ క్రికెట్‌కు ఏది ఉపయోగపడుతుందనే దాని ఆధారంగా.. నిర్ణయాలు తీసుకోవాలి' అని తమీమ్ ఇక్బాల్ అన్నాడు.

# బడంగ్‌పేట్ సర్కిల్‌లో ముమ్మరంగా 'స్పెషల్ శానిటేషన్ డ్రైవ్'

* **పరిశుభ్రత ఎక్కడ ఉంటుందో.. ఆరోగ్యం అక్కడ ఉంటుంది..,జోనల్ కమిషనర్ కె. చంద్రకళ, డెప్యూటీ కమిషనర్ త్రిల్లేశ్వర్ రావు,**
* **నగరంలో పేరుకుపోయిన లెగసీ వేస్ట్ తొలగింపు.. 12 నుంచి ఈ-వేస్ట్ సేకరణ**

బడంగ్‌పేట్, జనవరి 9 (భారత శక్తి) : బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ (సర్కిల్ 16) పరిధిలో పారిశుధ్య వ్యవస్థను మెరుగుపరిచే లక్ష్యంతో ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ చేపట్టారు. జోనల్ కమిషనర్ కె. చంద్రకళ, డెప్యూటీ కమిషనర్ త్రిల్లేశ్వర్ రావు పర్యవేక్షణలో శుక్రవారం అన్ని డివిజన్లలో క్షేత్రస్థాయి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పారిశుధ్య నిర్వహణపై పలు సూచనలు చేశారు.

* **డివిజన్ల వారీగా లెగసీ వేస్ట్ తొలగింపు:**

నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఏళ్ల తరబడి పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించే ప్రక్రియను అధికారులు వేగవంతం చేశారు.

* 57వ డివిజన్: నాదర్గుల్, కుర్మగూడ విలేజ్ రైస్ గోదాం వెనుక వైపు ఉన్న ప్రధాన రహదారిపై వ్యర్థాలను తొలగించారు.
* 58వ డివిజన్: ప్రశాంతి హిల్స్, జనప్రియ మహానగర్ ప్రాంతాల్లో పారిశుధ్య పనులు నిర్వహించారు.
* 59వ డివిజన్: జిల్లెల్‌గూడ ప్రగతి నగర్ పరిధిలో చెత్తను క్లీన్ చేశారు.
* 60వ డివిజన్: మీర్‌పేట్ అయోధ్య నగర్, మైసమ్మ గుడి సమీపంలోని వ్యర్థాలను తొలగించారు.
* 61వ డివిజన్: బాలాపూర్ నుంచి బడంగ్‌పేట్ వెళ్లే ప్రధాన రహదారిపై పారిశుధ్య చర్యలు చేపట్టారు.



* 62వ డివిజన్: బాలాపూర్ మిషన్ భగీరథ వాటర్ ట్యాంకర్ సమీపంలోని వ్యర్థాలను తొలగించారు.

* **ఈ నెల 12, 13 తేదీల్లో ఈ-వేస్ట్ సేకరణ:**

పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఈ నెల 12, 13 తేదీలలో ప్రత్యేకంగా ఈవేస్ట్ సేకరణ కార్యక్రమం నిర్వహించనున్నారు. ప్రజలు తమ వద్ద ఉన్న పనికిరాని ఎలక్ట్రానిక్ వస్తువులను జిల్లెల్‌గూడ వార్డు ఆఫీసు లేదా బడంగ్‌పేట్ కమ్యూనిటీ హాల్ వద్ద అందజేయాలని అధికారులు కోరారు.

* **సేకరించే వస్తువులు:**

* పెద్ద పరికరాలు: రిఫ్రిజిరేటర్లు, వాషింగ్ మెషీన్లు, ఏసీలు, మైక్రోవేవ్ ఓవెన్లు, వాటర్ కూలర్లు.
* చిన్న పరికరాలు: మిక్సీలు, గ్రైండర్లు, ఇస్త్రీ పెట్టెలు, ట్రిమ్మర్లు, ఫ్యాన్లు.
* ఐటీ పరికరాలు: కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు, మౌస్, ప్రింటర్లు, మొబైల్ ఫోన్లు, ఛార్జర్లు.
* ఎలక్ట్రానిక్స్: టీవీలు, మ్యూజిక్ సిస్టమ్స్, కెమెరాలు, సర్క్యూట్ బోర్డులు.
* ఇతరాలు: యూపీఎస్, ఇన్వర్టర్లు, బ్యాటరీలు, పవర్ బ్యాంకులు, స్మార్ట్ వాచ్‌లు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం అధికారులు ఎం. అన్వర్ కుమార్, ఎస్. హరీష్, గంగా ప్రసాద్, మేనేజర్ జి. శ్రీధర్ రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ వి. యాదగిరి, నరసింహ, రాము, వార్డు ఆఫీసర్లు మరియు ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



# పేదలకు అండగా ముఖ్యమంత్రి సహాయనిధి

* **టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్ చేతుల మీదుగా లబ్ధిదారులకు సీ.ఎం.ఆర్.ఎఫ్ చెక్కుల పంపిణీ**

హయత్ నగర్, జనవరి 9 (భారత శక్తి) : ఆర్థిక ఇబ్బందులతో వైద్యం చేయించుకోలేని నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) కొండంత అండగా నిలుస్తోందని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్ అన్నారు. అనారోగ్యంతో వివిధ ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొంది, ఆర్థిక సహాయం కోసం దరఖాస్తు చేసుకున్న పలువురు లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను శుక్రవారం హయత్ నగర్ లోని తన కార్యాలయంలో ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రైవేటు ఆసుపత్రుల్లో వైద్యం సామాన్యులకు భారంగా మారుతున్న తరుణంలో, ప్రభుత్వం అందిస్తున్న ఈ సహాయం ఎంతో ఊరటనిస్తుందన్నారు. బాధితులు తమ సమస్యను వివరించగానే సానుకూలంగా స్పందించి నిధులు మంజూరయ్యేలా కృషి చేసినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని ఆయన పేర్కొన్నారు.

**సహాయం పొందిన వారు వీరే..**

మొత్తం 15 మంది బాధితులకు ఈ ఆర్థిక సాయం అందింది. రాజేందర్ గౌడ్, నక్క సుధాకర్ గౌడ్, కార్తీక్ యాదవ్, అనమోని నిర్మల, ధనవత్ కౌసల్యలకు రూ.60,000 చొప్పున.. యశోదకు రూ.51,000, కుళవిందర్ కౌర్ సింగ్‌కు రూ.47,500, కిషోర్ రెడ్డికి రూ.46,500, గ్యార లతకు రూ.42,500 చొప్పున చెక్కులను అందజేశారు. అలాగే సరిత, పడిగేశ్వర్ రావు, అనిల్ కుమార్, శ్రీనివాస్ చారి, మహ్మద్ ఇస్మాయిల్, పెద్ద యాదమ్మలకు కూడా మంజూరైన నిధులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి గజ్జి భాస్కర్ యాదవ్, నాయకులు శ్రీపాల్ రెడ్డి, రవీందర్ గౌడ్, నర్సింహా యాదవ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు అశోక్ గౌడ్, గణేష్ నాయక్, బాబా యాదవ్, సుధాకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# నగర స్వచ్ఛతలో రాజీ పడొద్దు

: **జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్..**

* **క్షేత్రస్థాయిలో మెగా పారిశుద్ధ్య డ్రైవ్ తనిఖీ**
* **జనవరి 12, 13 తేదీల్లో నగరం అంతటా 'మెగా ఈ-వేస్ట్' సేకరణ**

హైదరాబాద్, జనవరి 09 (భారత శక్తి): భాగ్యనగరాన్ని పరిశుభ్రతకు చిరునామాగా మార్చడమే లక్ష్యంగా అధికారులు పని చేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ ఆదేశించారు. పారిశుద్ధ్య కార్యక్రమాల్లో అలసత్వం వహించకుండా, పకడ్బందీగా క్షేత్రస్థాయిలో పనులు చేపట్టాలని జోనల్, డిప్యూటీ కమిషనర్లు మరియు ఇంజనీరింగ్ విభాగం అధికారులను సూచించారు. శుక్రవారం ఫిల్మ్ నగర్ కొత్త చెరువు ప్రాంతంలో అదనపు కమిషనర్ రఘు ప్రసాద్‌తో కలిసి కమిషనర్ స్వయంగా పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించారు.

* **11వ రోజుకు చేరిన మెగా శానిటేషన్ డ్రైవ్:**

గత నెల డిసెంబర్ 29న ప్రారంభమైన 'జీహెచ్ఎంసీ మెగా స్పెషల్ శానిటేషన్ డ్రైవ్' శుక్రవారంతో 11వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ..

వ్యర్థాల తొలగింపు: నగరంలోని 300 వార్డుల్లో దీర్ఘకాలికంగా పేరుకుపోయిన చెత్తను, నిర్మాణ వ్యర్థాలను పూర్తిస్థాయిలో తొలగిస్తున్నట్లు తెలిపారు.

అనాథ వాహనాలపై చర్యలు: రోడ్ల పక్కన వదిలేసి, ట్రాఫిక్ ఇబ్బందులకు కారణమవుతున్న పాత వాహనాలను పోలీసుల సమన్వయంతో వెంటనే తొలగించాలని ఆదేశించారు.

* **నిరంతర పర్యవేక్షణ:**

ఈ నెలాఖరు (జనవరి 31) వరకు ఈ ప్రత్యేక



డ్రైవ్ కొనసాగుతుందని, అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. త్వరలో 'మెగా ఈవేస్ట్' డ్రైవ్: పర్యావరణ పరిరక్షణకే ప్రాధాన్యం. నగరంలో పేరుకుపోతున్న ఎలక్ట్రానిక్ వ్యర్థాల (eWaste) శాస్త్రీయ పరిష్కారం కోసం జనవరి 12, 13 తేదీల్లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించనున్నట్లు కమిషనర్ వెల్లడించారు.

* **సేకరించే వస్తువులు:**

పాడైన ఫ్రిజ్‌లు, వాషింగ్ మెషీన్లు, ఏసీలు, కంప్యూటర్లు, మొబైల్ ఫోన్లు, టీవీలు, బ్యాటరీలు మరియు పవర్ బ్యాంకులు వంటి ఎలక్ట్రానిక్ పరికరాలను ఈ డ్రైవ్ ద్వారా సేకరిస్తారు.

* **అవగాహన కార్యక్రమాలు:**

ప్రతి వార్డులో తాత్కాలిక సేకరణ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆర్‌డబ్ల్యూఏలు (RWA), ఎన్‌జీవోలు, స్వయం సహాయక సంఘాల మహిళల సహకారంతో ప్రజల్లో ఈ వేస్ట్ వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. సేకరించిన వ్యర్థాలను శాస్త్రీయ పద్ధతిలో రీసైక్లింగ్ యూనిట్లకు తరలిస్తామని కమిషనర్ పేర్కొన్నారు. నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజలందరూ సహకరించాలని, ఇంటి వద్ద ఉన్న ఈవేస్ట్‌ను ఈ నెల 12, 13 తేదీల్లో మున్సిపల్ సిబ్బందికి అందజేయాలని ఆయన కోరారు.

# ఆక్రమణదారుల గుప్పిట నుంచి పార్కు స్థలం విముక్తి..!

* **జొన్నబండలో రంగంలోకి దిగిన హైడ్రా 1444 గజాల స్థలానికి రక్షణగా ఫెన్సింగ్**

హైదరాబాద్, జనవరి 9 (భారత శక్తి) : ప్రజా అవసరాల కోసం కేటాయించిన పార్కు స్థలాన్ని ఆక్రమణదారుల చెర నుంచి హైడ్రా (HYDRAA) విముక్తి చేసింది. మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా ఓల్డ్ ఆల్వాల్ పరిధిలోని జొన్నబండలో గురువారం ఈ ఆపరేషన్ నిర్వహించారు. స్థానికుల ఫిర్యాదుతో స్పందించిన అధికారులు.. విలువైన ప్రభుత్వ భూమికి రక్షణ కవచం ఏర్పాటు చేశారు.

* **ప్రజావాణిలో ఫిర్యాదు.. వెనువెంటనే చర్యలు**

జొన్నబండలోని ఎంహెచ్‌ఆర్ కాలనీ లేఅవుట్ ప్రకారం.. సర్వే నంబర్లు 575, 576 (పార్ట్), 577, 578 (పార్ట్), 598, 580 (పార్ట్)లలో మొత్తం 1444.40 గజాల స్థలాన్ని పార్కు కోసం కేటాయించారు. అయితే, ఈ స్థలంపై కొందరు కన్నేసి ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నట్లు




కాలనీవాసులు ఇటీవల హైడ్రా 'ప్రజావాణి'లో ఫిర్యాదు చేశారు.

**రంగంలోకి అధికారుల బృందం**

హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశాల మేరకు రంగంలోకి దిగిన అధికారుల బృందం క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టింది. రెవెన్యూ రికార్డులు, లేఅవుట్ ప్లాన్లను నిశితంగా పరిశీలించి, సదరు స్థలం పార్కుకే చెందుతుందని నిర్ధారించుకుంది. ఈ క్రమంలోనే గురువారం ఉదయం సిబ్బందితో కలిసి పార్కు చుట్టూ ఇనుప ఫెన్సింగ్‌ను ఏర్పాటు చేసి బోర్డులను పాతారు.

**హర్షం వ్యక్తం చేస్తున్న స్థానికులు**

కాలనీకి ఊపిరితిత్తుల్లాంటి పార్కు స్థలాన్ని కాపాడటంపై ఎంహెచ్‌ఆర్ కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. హైడ్రా తీసుకున్న సత్వర చర్యలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ స్థలంలో ఇకపై ఎవరూ చెత్త వేయకుండా చూడాలని, తక్షణమే దీనిని పార్కుగా అభివృద్ధి చేయాలని జీహెచ్ఎంసీ అధికారులను కోరుతామని స్థానికులు పేర్కొన్నారు.

# గ్యాస్ డెలివరీ వర్కర్ మృతి బాధాకరం – కుటుంబానికి న్యాయం చేయాలి

: **శ్రీనివాస్ గౌడ్**

మహేశ్వరం, జనవరి 9 (భారత శక్తి) : తెలంగాణ కుకింగ్ గ్యాస్ డెలివరీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మహేశ్వరం రూమా ఇండియన్ గ్యాస్ ఏజెన్సీలో పనిచేస్తున్న గడ్డి కొండలు సన్నాఫ్ కిష్టయ్య (వయసు 45) అనే డెలివరీ వర్కర్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం అత్యంత బాధాకరమని యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. గత రెండు సంవత్సరాలుగా ప్రోమో గ్యాస్ రూమా ఇండియన్ గ్యాస్ ఏజెన్సీలో డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్న కిష్టయ్య, ఈ నెల 5వ తేదీన విధులు ముగించుకుని ఇంటికి వెళ్తున్న సమయంలో మహేశ్వరం కమాన్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. విషయం తెలియగానే కుటుంబ సభ్యులు స్థానిక ఆసుపత్రికి, అనంతరం శంషాబాద్‌లోని సన్‌రైజ్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ నిన్న రాత్రి మృతి చెందారు. ఈ ఘటనపై సమాచారం



అందుకున్న వెంటనే తెలంగాణ కుకింగ్ గ్యాస్ డెలివరీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్ మృతుడి కుటుంబ సభ్యులతో మాట్లాడి సంతాపం తెలిపారు. అనంతరం మహేశ్వరం పోలీస్ స్టేషన్‌లో సీఐని కలిసి ఘటన వివరాలను చర్చించారు. అలాగే రూమా ఇండియన్ గ్యాస్ ఏజెన్సీకి వెళ్లి మేనేజర్ రఘుతో ఘటనపై వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ, మృతుడికి ఈఎస్ఐ, పీఎఫ్ వంటి సౌకర్యాలు లేకపోవడం వల్ల అతని కుటుంబంపై సుమారు రూ.5 లక్షల వరకు ఆర్థిక భారం పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి దుర్ఘటనలు పునరావృతం కాకుండా గ్యాస్ ఏజెన్సీలు తప్పనిసరిగా డెలివరీ వర్కర్లకు ఈఎస్ఐ, పీఎఫ్, ఇన్సూరెన్స్ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సదుపాయాలు లేకపోవడం వల్ల వర్కర్ మృతి చెందినప్పుడు వారి కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు. ఈ అంశంపై త్వరలో ఆయిల్ కంపెనీల యాజమాన్యాలను కలిసి చర్చిస్తామని, డెలివరీ వర్కర్లకు ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. గత రెండు నెలల్లోనే నలుగురు గ్యాస్ డెలివరీ వర్కర్లు మృతి చెందడం చాలా బాధాకరమని, యాజమాన్యాల ఒత్తిడే ఇలాంటి ప్రమాదాలకు కారణమవుతోందని అన్నారు. ఇటువంటి ఘటనలు జరగకుండా త్వరలో భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు.

# మూసీ పునరుజ్జీవనానికి 'సబర్మతి' బాట!

* **అహ్మదాబాద్‌లో జీహెచ్ఎంసీ బృందం అధ్యయన పర్యటన**
* **ప్రాజెక్టు రూపకల్పన, పునరావాస ప్రక్రియపై ఆరా**
* **త్వరలో ప్రభుత్వానికి సమగ్ర నివేదిక సమర్పణ**

అహ్మదాబాద్, జనవరి 09 (భారత శక్తి): భాగ్యనగరానికి తలమానికంగా ఉన్న మూసీ నదిని పునరుజ్జీవింపజేసేందుకు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (GHMC) కసరత్తు వేగవంతం చేసింది. ఇందులో భాగంగా గుజరాత్‌లోని ప్రసిద్ధ సబర్మతి రివర్‌ఫ్రంట్ ప్రాజెక్టును అధ్యయనం చేసేందుకు మేయర్ గద్వాల్ విజయలక్ష్మి నేతృత్వంలోని కార్పొరేటర్ల బృందం రెండు రోజుల పర్యటన చేపట్టింది. గురు, శుక్రవారాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించిన బృందం, ప్రాజెక్టు అమలు తీరును నిశితంగా పరిశీలించింది.

**రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి**

అహ్మదాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రతినిధులు, సబర్మతి రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అధికారులు ఈ ప్రాజెక్టు విజయగాథను వివరించారు. ముఖ్యంగా రాజకీయ జోక్యం లేకుండా, ఒక ప్రత్యేక సంస్థ ద్వారా పనులు చేపట్టడం వల్లే ఇది సాధ్యమైందని వారు తెలిపారు. నిర్వాసితులకు భరోసా: నదీ తీరంలోని



వాస్తవ నివాసితులతో నేరుగా చర్చించి, వారికి పునరావాసం మరియు ఇతర ప్రయోజనాలు నేరుగా అందేలా చూడటం ఈ ప్రాజెక్టులో అత్యంత కీలకమని అధికారులు వెల్లడించారు.

**అద్భుతమైన పర్యాటక హబ్**

ఒకప్పుడు నిర్లక్ష్యానికి గురైన సబర్మతి తీరం, నేడు పర్యాటక కేంద్రంగా ఎలా మారిందో బృందం పరిశీలించింది.

వివిధ దశలు: మొత్తం 7 దశల్లో భాగంగా ఇప్పటికే 11.5 కిలోమీటర్ల మేర మొదటి దశ పూర్తయిందని, మరో 6 నెలల్లో రెండో దశ పూర్తికానుందని అధికారులు తెలిపారు.

**ఆకర్షణలు:**

నదికి ఇరువైపులా ఉన్న వాకింగ్ ట్రాక్‌లు, థీమ్ పార్కులు, గార్డెన్లను మేయర్ బృందం సందర్శించింది. ముఖ్యంగా తూర్పు, పడమర తీరాలను కలుపుతూ నిర్మించిన 'అటల్ ఫుట్ బ్రిడ్జి' ఇంజనీరింగ్ నైపుణ్యంపై ప్రశంసలు కురిపించారు.

**మూసీకి దిక్సూచిగా 'సబర్మతి' నమూనా**

సబర్మతి పర్యటనలో సేకరించిన అంశాలు హైదరాబాద్‌లోని మూసీ నది తీరాభివృద్ధికి, వరద నియంత్రణకు మరియు పౌర కేంద్రిత నగర అభివృద్ధికి ఎంతగానో ఉపయోగపడతాయని జీహెచ్ఎంసీ బృందం అభిప్రాయపడింది. పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రజా వినోదాన్ని మేళవించిన ఈ నమూనాను మూసీ ప్రాజెక్టులో అమలు చేసేందుకు ఉన్న అవకాశాలను వారు పరిశీలించారు. ఈ స్టడీ టూర్ లో గుర్తించిన ఉత్తమ విధానాలు మరియు క్షేత్రస్థాయి పరిశీలనలతో కూడిన సమగ్ర నివేదికను బృందం త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వానికి మరియు జీహెచ్ఎంసీకి సమర్పించనుంది. ఈ పర్యటనలో డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డితో పాటు పలువురు కార్పొరేటర్లు, అధికారులు పాల్గొన్నారు.

# కోనసీమ గ్యాస్ లీక్‌పై సీఎం చంద్రబాబు ఏరియల్ సర్వే

కోనసీమ, జనవరి 09 (భారత శక్తి): కోనసీమ జిల్లా, ఇరుసుమండ గ్రామంలోని ఓఎన్జీసీ బావి వద్ద ఐదో రోజు కూడా మంటలు కొనసాగుతుండటంతో, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు శుక్రవారం ఏరియల్ సర్వే నిర్వహించారు. గ్యాస్ బావి నుంచి ఎగిసిపడుతున్న మంటలను, పరిసర ప్రాంతాల్లోని పరిస్థితిని ఆయన గగనతలం నుంచి పరిశీలించారు. అనంతరం మండపేట నియోజకవర్గంలోని రాయవరంలో ఆయన ఓఎన్జీసీ అధికారులు, కోనసీమ జిల్లా కలెక్టర్ మహేశ్ కుమార్, ఎంపీ హరీశ్ బాలయోగి, ఎమ్మెల్యే వరప్రసాద్‌లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. మంటలను అదుపులోకి తెచ్చేందుకు తీసుకుంటున్న చర్యల గురించి సీఎం ఆరా తీశారు. మంటల వల్ల దెబ్బతిన్న కొబ్బరి చెట్లకు నష్టపరిహారం అందించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మరోవైపు, బ్లోఅవుట్‌ను అదుపులోకి తెచ్చేందుకు ఆమోదించిన ప్రణాళిక ప్రకారం ముమ్మరంగా పనిచేస్తున్నామని ఓఎన్జీసీ ఒక ప్రకటనలో తెలిపింది. సంక్షోభ నిర్వహణ బృందం (CMT) ఇప్పటికే బావి పరిసరాల్లోని శిథిలాలను చాలావరకు తొలగించి, బావి హెడ్ వద్దకు వెళ్లేందుకు మార్గం సుగమం చేసింది. బావిని క్యాపింగ్ చేసే దిశగా ఆపరేషన్ కొనసాగించేందుకు అడ్డంకిగా ఉన్న మాస్ట్, ఇతర పరికరాల భాగాలను తొలగించినట్లు పేర్కొంది. బావి హెడ్ సమీపంలో సురక్షితంగా పనిచేసేందుకు వీలుగా నిరంతరం నీటిని చల్లుతున్నామని వివరించింది. ప్రస్తుతం పరిస్థితి నిలకడగా ఉండటంతో చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు తమ సాధారణ కార్యకలాపాలను తిరిగి ప్రారంభించారు. కాగా, సోమవారం మధ్యాహ్నం మరమ్మతు పనులు చేస్తుండగా ఈ బావి నుంచి అకస్మాత్తుగా ముడిచమురుతో కూడిన గ్యాస్ భారీగా ఎగిసిపడిన విషయం తెలిసిందే. దీంతో ఇరుసుమండ, పరిసర గ్రామాల్లో దట్టమైన పొగ, గ్యాస్ వ్యాపించి ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు.

## గుజరాత్‌లో వరుస భూప్రకంపనలు

గుజరాత్, జనవరి 09 (భారత శక్తి): గుజరాత్‌లోని సౌరాష్ట్ర ప్రాంతంలో గురువారం రాత్రి నుంచి శుక్రవారం మధ్యాహ్నం వరకు 12 సార్లకు పైగా భూప్రకంపనలు సంభవించడంతో రాజ్‌కోట్ జిల్లాలో భయాందోళనలు నెలకొన్నాయి. చాలామంది ఇళ్ల నుంచి బయటకు వచ్చి బహిరంగ ప్రదేశాల్లోనే ఉండిపోయారు. అయితే ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగలేదని అధికారులు తెలిపారు. ఈ ప్రకంపనల తీవ్రత రిక్టర్ స్కేలుపై 2.6 నుంచి 3.8 మధ్య నమోదయింది. పాత భవనాల్లోని కొన్ని పాఠశాలలకు అధికారులు సెలవులు ప్రకటించారు. శిథిలావస్థలో ఉన్న నిర్మాణాల నుంచి ప్రజలు బయటకు రావాలని అధికారులు సూచించారు. గంటల వ్యవధిలోనే పలుమార్లు భూమి కంపించడంతో ప్రజలు భయపడి ఇళ్లలో నుంచి బయటకు పరుగు తీశారు. ఉప్లేటా, ధొరాజీ, జెత్‌పూర్ తాలుకాల్లో ఈ ప్రకంపనలు సంభవించాయి. గురువారం రాత్రి 8.42 గంటల ప్రాంతంలో తొలిసారి భూమి కంపించిందని రాజ్‌కోట్ జిల్లా కలెక్టర్ తెలిపారు. భూకంప కేంద్రం ఉప్లేటా పట్టణంలో ఉన్నట్టు ఆయన పేర్కొన్నారు. భూమి పొరల్లో అప్పటికే ఉన్న చీలికల మధ్యకు నీరు చేరి ఒత్తిడి తీవ్రమైనప్పుడు ఇలా భూమి పలుమార్లు కంపిస్తుందని ఆయన వివరించారు.

## ఏపీకి పెట్టుబడులు రావడానికి 3 ప్రధాన కారణాలివే : పుణేలో మంత్రి నారా లోకేశ్

అమరావతి, జనవరి 09 (భారత శక్తి): రాష్ట్రాల అభివృద్ధికి ప్రభుత్వాల కొనసాగింపు ఎంతో కీలకమని, గత ప్రభుత్వ హయాంలో పవర్ పర్చేజ్ అగ్రిమెంట్ల (పీపీఏ) రద్దు వంటి నిర్ణయాల వల్ల చాలా కంపెనీలు భయపడి పొరుగు రాష్ట్రాలకు తరలివెళ్లాయని ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. సుస్థిర పాలన ఆవశ్యకతను ప్రజలు గుర్తించాలని ఆయన పిలుపునిచ్చారు. పుణేలోని గోఖలే ఇనిస్టిట్యూట్ ఆఫ్ పాలిటిక్స్ అండ్ ఎకనమిక్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'పబ్లిక్ పాలసీ ఫెస్టివల్'లో లోకేశ్ కీలకోపన్యాసం చేశారు.

**పరిశ్రమలు రావడానికి మూడు కారణాలు**

ఆంధ్రప్రదేశ్‌కు గూగుల్, ఆర్సెలర్ మిట్టల్, టీసీఎస్ వంటి దిగ్గజ సంస్థలు క్యూ కట్టడానికి మూడు ప్రధాన కారణాలు ఉన్నాయని లోకేశ్ వివరించారు. "మొదటిది ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వం. రెండోది 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'. పరిశ్రమలతో ఒప్పందం కుదిరిన తర్వాత, ఆ ప్రాజెక్టును మా సొంతదిగా భావించి వేగంగా అనుమతులు ఇస్తున్నాం. మూడోది రాష్ట్రంలో, కేంద్రంలో 'నమో' (నాయుడు, మోదీ) నేతృత్వంలోని డబుల్ ఇంజన్ బుల్లెట్ ట్రైన్ సర్కార్" అని తెలిపారు. ఆర్సెలర్ మిట్టల్ అధినేత ఆదిత్య మిట్టల్‌తో ఒకేఒక్క జూమ్ కాల్ మాట్లాడి, వారి సమస్యను 24 గంటల్లో పరిష్కరించడం వల్లే దేశంలోనే అతిపెద్ద స్టీల్ ప్లాంట్‌ను ఏపీకి తీసుకురాగలిగామని గుర్తుచేశారు. ఈ ప్రాజెక్టు పనులు ఫిబ్రవరిలో ప్రారంభమవుతాయని వెల్లడించారు.

**టెక్నాలజీతో పాలనలో విప్లవం**

పరిపాలనలో టెక్నాలజీని వినియోగిస్తూ విప్లవాత్మక మార్పులు తెస్తున్నామన్నారు. "మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా 36 శాఖలకు చెందిన వెయ్యి రకాల సేవలను అందిస్తున్నాం. ఏఐ టెక్నాలజీతో మంగళగిరిలో స్కిల్ సెన్సస్ పైలట్ ప్రాజెక్ట్ చేపట్టాం. త్వరలోనే భూ రికార్డులను కూడా బ్లాక్‌చైన్ టెక్నాలజీపైకి తీసుకొచ్చి, 24 గంటల్లో టైటిల్ మార్పు చేసేలా కసరత్తు చేస్తున్నాం" అని వివరించారు.

**'లిఫ్ట్' పాలసీతో పరిశ్రమల వెల్లువ**

ఐటీ పరిశ్రమలను ఆకర్షించేందుకు 'లిఫ్ట్' (LIFT) పాలసీని తీసుకొచ్చామని లోకేశ్ తెలిపారు. ఒక ఎకరాకు 500 ఉద్యోగాలు కల్పించే కంపెనీలకు 99 పైసలకే భూమి కేటాయించేలా ఈ విధానాన్ని రూపొందించామని, కాగ్నిజెంట్ రాకతో పరిశ్రమల ప్రవాహం మొదలైందని చెప్పారు. పరిశ్రమలకు సంబంధించిన సమస్యలను తానే స్వయంగా 26 వాట్సాప్ గ్రూపుల ద్వారా పర్యవేక్షిస్తున్నానని అన్నారు.

**సీఎం డ్రీమ్ ప్రాజెక్ట్ క్వాంటమ్ వ్యాలీ**

ముఖ్యమంత్రి చంద్రబాబుకు క్వాంటమ్ వ్యాలీ అత్యంత ఇష్టమైన ప్రాజెక్ట్ అని లోకేశ్ అభివర్ణించారు. అమరావతిలో ఏర్పాటు కానున్న ఈ వ్యాలీ దేశానికే దిక్సూచిగా నిలుస్తుందన్నారు. ఐబీఎం, టీసీఎస్, ఐఐటీ మద్రాస్ వంటి సంస్థలను ఏకతాటిపైకి తెచ్చి ఈ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు విజన్‌ను అమలు చేసేందుకు యువ మంత్రుల బృందంతో కలిసికట్టుగా పనిచేస్తున్నామని, రాష్ట్రానికి భారీగా విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ) ఆకర్షించడమే తమ లక్ష్యమని లోకేశ్ స్పష్టం చేశారు.

## హిమాచల్ ప్రదేశ్ లో ఘోర బస్సు ప్రమాదం... 12 మంది మృతి

హిమాచల్ ప్రదేశ్, జనవరి 09 (భారత శక్తి): హిమాచల్ ప్రదేశ్‌లో శుక్రవారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. సిర్మౌర్ జిల్లాలో ప్రయాణికులతో వెళుతున్న ఓ ప్రైవేట్ బస్సు అదుపుతప్పి సుమారు 200 మీటర్ల లోతైన లోయలో పడిపోయింది. ఈ దుర్ఘటనలో 12 మంది ప్రాణాలు కోల్పోగా, మరో 33 మంది గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే.. సిమ్లా నుంచి కుప్వీకి వెళుతున్న ఈ బస్సులో మొత్తం 45 మంది ప్రయాణికులు ఉన్నారు. వీరంతా 'పోష్' పండుగ సందర్భంగా తమ స్వగ్రామాలకు తిరిగి వెళుతున్నారు. హరిపుర్‌ధార్ మార్కెట్‌కు సమీపంలో మధ్యాహ్నం 3:30 గంటల ప్రాంతంలో బస్సు ప్రయాణిస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. దట్టమైన పొగమంచు కారణంగా బస్సు రోడ్డుపై నుంచి జారిపోయి ఉండొచ్చని ప్రాథమికంగా భావిస్తున్నారు. ప్రమాద తీవ్రతకు బస్సు నుజ్జునుజ్జయింది. ప్రమాద సమాచారం అందిన వెంటనే స్థానికులు, పోలీసులు, ఆరోగ్య సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని సమీపంలోని నాహన్, రాజ్‌గఢ్ ఆసుపత్రులకు తరలించారు. వీరిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉండటంతో వారిని మెరుగైన చికిత్స కోసం సిమ్లాలోని ఐజీఎంసీ ఆసుపత్రికి తరలించినట్లు అధికారులు తెలిపారు. ఈ ఘటనపై హిమాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి సుఖ్విందర్ సింగ్ సుఖు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని, బాధిత కుటుంబాలకు అన్ని విధాలా అండగా నిలవాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. ప్రమాదంపై మెజిస్టీరియల్ విచారణకు కూడా ప్రభుత్వం ఆదేశించింది.

## చంద్రబాబుకు విజ్ఞప్తి చేస్తున్నా: వివాదాలపై రేవంత్ రెడ్డి కీలక సూచన

అమరావతి, జనవరి 09 (భారత శక్తి): ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక సూచన చేశారు. జల వివాదాలను పరస్పరం కూర్చుని మాట్లాడుకోవడం ద్వారా పరిష్కరించుకుందామని అన్నారు. రంగారెడ్డి జిల్లా రావిర్యాలలో సుజెన్ మెడికేర్ ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడుతూ, రెండు రాష్ట్రాల మధ్య వివాదాలు ఉండకూడదనే కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిందని గుర్తు చేశారు. రాజకీయాలకు అతీతంగా నీటి సమస్యను పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు. కోర్టుల ద్వారా కాకుండా మన సమస్యలను మనమే పరిష్కరించుకుందామని విజ్ఞప్తి చేశారు. జల వివాదం విషయంలో రాజకీయ ప్రయోజనం పొందాలని తమ ప్రభుత్వం ప్రయత్నించడం లేదని స్పష్టం చేశారు. పంచాయితీ కావాలా, నీళ్లు కావాలా అని నన్ను అడిగితే తెలంగాణకు నీళ్లు కావాలని చెబుతానని, అదే సమయంలో వివాదాలు కావాలా, పరిష్కారం కావాలా అని అడిగితే పరిష్కారం కావాలని స్పష్టంగా చెబుతానని ఆయన అన్నారు. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఈ వేదిక ద్వారా విజ్ఞప్తి చేస్తున్నానని, కృష్ణా నదిపై ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న ప్రాజెక్టుల అనుమతులకు అడ్డంకులు సృష్టించవద్దని కోరారు. అలా అడ్డంకులు కలిగిస్తే కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు రావడం లేదని, దీనివల్ల రాష్ట్రంపై ఆర్థిక భారం పడుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తాము వివాదాలు కోరుకోవడం లేదని, పరిష్కారం మాత్రమే కోరుకుంటున్నామని ఆయన స్పష్టం చేశారు. తమకు కావలసింది రాజకీయ ప్రయోజనాలు కాదని, ప్రజల ప్రయోజనాలని అన్నారు. తెలంగాణకు పోర్టు కనెక్టివిటీ ఉండాలంటే పక్క రాష్ట్రం సహకారం ఉండాల్సిందే అన్నారు. రెండు రాష్ట్రాలు పరస్పరం సహకరించుకుంటేనే సమస్యలు పరిష్కారమవుతాయని వ్యాఖ్యానించారు. జల వివాదాల విషయంలో ఆంధ్రప్రదేశ్ ఒక్క అడుగు ముందుకు వేస్తే తాము 10 అడుగులు ముందుకు వేస్తామని ఆయన అన్నారు. ఇంకా ఆయన మాట్లాడుతూ, పెట్టుబడులకు తెలంగాణ అనుకూలమైన రాష్ట్రమని అన్నారు. పెద్ద పెద్ద కంపెనీలకు మన దేశానికి చెందిన వారే సీఈవోలుగా ఉన్నారని ఆయన తెలిపారు.

## తిరుమలలో రికార్డు స్థాయిలో వైకుంఠ ద్వార దర్శనాలు

తిరుమల, జనవరి 09 (భారత శక్తి): కలియుగ వైకుంఠం తిరుమలలో 10 రోజుల పాటు అత్యంత వైభవంగా జరిగిన వైకుంఠ ద్వార దర్శనాలు విజయవంతంగా ముగిశాయి. డిసెంబర్ 30 నుంచి జనవరి 8 వరకు సాగిన ఈ దర్శనాల్లో టీటీడీ చరిత్రలోనే రికార్డు స్థాయిలో 7.83 లక్షల మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు. శుక్రవారం తిరుమలలోని అన్నమయ్య భవన్‌లో ఆయన మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. టీటీడీ కల్పించిన ఏర్పాట్లపై 93 శాతం భక్తులు పూర్తి సంతృప్తి వ్యక్తం చేయడం ఆనందంగా ఉందన్నారు. గత ఏడాదితో పోలిస్తే ఈసారి భక్తుల సంఖ్య గణనీయంగా పెరిగింది. 2024లో 6.83 లక్షల మంది, 2023లో 6.47 లక్షల మంది దర్శించుకోగా, ఈసారి ఆ సంఖ్య భారీగా పెరిగింది. ఈ 10 రోజుల్లో శ్రీవారి హుండీ ద్వారా రూ.41 కోట్ల ఆదాయం సమకూరింది. రికార్డు స్థాయిలో 44 లక్షల లడ్డూలు విక్రయించామని చైర్మన్ వివరించారు. గతేడాదితో పోలిస్తే ఇది 10 లక్షల లడ్డూలు అధికం. అన్నప్రసాదాల వితరణ కూడా 27 శాతం పెరిగినట్లు తెలిపారు. పక్కా ప్రణాళిక, ఏఐ కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా క్యూలైన్లను నిరంతరం పర్యవేక్షించడం వల్లే అంచనాలకు మించి భక్తులకు దర్శనం కల్పించగలిగామని బీఆర్ నాయుడు పేర్కొన్నారు. కల్యాణకట్ట, పారిశుద్ధ్యం, వైద్య సేవలు భక్తులకు ఎంతో ఉపయుక్తంగా నిలిచాయని చెప్పారు. 50 టన్నుల సంప్రదాయ పుష్పాలు, 10 టన్నుల పండ్లతో చేసిన అద్భుత అలంకరణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయని పేర్కొన్నారు. "ఈ వైకుంఠ ద్వార దర్శనాలను శాంతియుతంగా విజయవంతం చేసిన భక్తులకు, అహర్నిశలు శ్రమించి మెరుగైన సేవలు అందించిన అధికారులు, సిబ్బంది మరియు సేవకులకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు" అని చైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు.

## ప్రజల సమస్యలు వినిపించాలంటే,ఘట్కేసర్ దాకా వెళ్లాల్సిందేనా




కాప్రా, జనవరి 09 (భారత శక్తి): నాగారం గ్రామం ఒకప్పుడు మున్సిపాలిటీ.ప్రజల సమస్యలు అక్కడికక్కడే పరిష్కారం అయ్యేవి, కానీ నేడు గ్రేటర్ హైదరాబాద్ కార్పొరేషన్ పరిధిలోకి వెళ్లిన తరువాత నాగారం ప్రజల పాలన ఘట్కేసర్ దాకా విస్తరించింది, చిన్న సమస్య అయినా, ఒక దరఖాస్తు ఇవ్వాలన్నా,ఒక ఫిర్యాదు చెప్పాలన్నా ఘట్కేసర్ సర్కిల్‌లోని డిప్యూటీ కమిషనర్‌ను కలిసి రావాల్సిన పరిస్థితి.ఇది పరిపాలనా సౌలభ్యమా, లేదా ప్రజలపై మోపిన శిక్షనా..? అని నాగారం ప్రజలు వాపోతున్నారు. ప్రభుత్వం ఆలోచించాలని,బస్సు సౌకర్యమే లేని ఘట్కేసర్ పట్టణ సర్కిల్ కార్యాలయానికి ఎలా వెళ్తారని, మహిళలు ఒంటరిగా 20 కిలోమీటర్లు ఎలా ప్రయాణం చేస్తారని,రోజు కూలీ మీద బతికే పేద ప్రజలు ఒక రోజు పని వదిలి ఎలా వెళ్లాలని ఆవేదన చెందుతున్నారు. నాగారం మున్సిపల్ ఆఫీస్ తాళాలు వేయడంతో ఖాళీ కుర్చీలు దర్శనమిస్తున్నాయని, సమస్యలు చెప్పుకునేందుకు అధికారులు లేరని అక్కడికి వచ్చిన ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.మా సమస్యలు ఎవరు వింటారని అంటున్నారు. నాగారం ప్రజలు తమ బాధలు చెప్పుకోవడానికి ఘట్కేసర్ సర్కిల్‌లో డిప్యూటీ కమిషనర్‌ను కలిసి రావాల్సి వస్తుంటే ఇది పాలన వైఫల్యం కాక మరేమిటని వారు ప్రశ్నిస్తున్నారు. 60-70 వేల జనాభా ఉన్న నాగారం ప్రజల కోసం జోనల్ ఆఫీస్ తప్పనిసరిగా నాగారం మున్సిపాలిటీలోనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.ప్రజలు అధికారుల దగ్గరకు వెళ్లాలి కానీ అధికారుల కోసం ప్రజలు కిలోమీటర్లు తిరగాల్సిన పరిస్థితి ఉండకూడదని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. నాగారం ప్రజల ఆవేదనను తక్షణం గుర్తించి జోనల్ కార్యాలయాన్ని నాగారంలో ఏర్పాటు చేయాలని, ప్రజల సమస్యలు ఇక్కడికక్కడే పరిష్కరించే విధానం తీసుకురావాలని, ఇది రాజకీయ లాభం కోసం కాదని, ఇది ప్రజల గౌరవం కోసం, ఇది ప్రజల హక్కుల కోసమని అంటున్నారు. ఇది నాగారం ప్రజల న్యాయమైన డిమాండ్ అని పేర్కొంటున్నారు.




## పోలీస్ స్టేషన్ పని తీరును పరిశీలించిన సిపి అవినాష్ మహంతి

ఎల్బీనగర్, జనవరి 09 (భారత శక్తి): ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్‌ను మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం పోలీస్ స్టేషన్లలో ఆకస్మిక తనిఖీలకు శ్రీకారం చుట్టిన సీపీ,ఎల్బీనగర్ పోలీస్ అధికారుల, సిబ్బంది పనితీరు, రికార్డులు, ప్రజా సమస్యల పరిష్కారంపై సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వినోద్ కుమార్ ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎల్బీనగర్ ఏసిపి కార్యాలయం, మల్కాజ్గిరి రాచకొండ సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ ను పరిశీలించారు. ఎల్బీనగర్ రింగ్ రోడ్ లోని ట్రాఫిక్ సమస్యలను ట్రాఫిక్ డిసిపి శ్రీనివాసులును వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎల్బీనగర్ చౌరస్తాలో గజిబిజిగా ఉన్న ట్రాఫిక్ సమస్యను గమనించి, తీసుకోవల్సిన జాగ్రత్తలు ట్రాఫిక్ పోలీసులకు తెలిపారు. సంక్రాంతి పండుగ సందర్భంగా ఊర్లకు బయలుదేరిన ప్రయాణికులు ఇబ్బందులు పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు.ఈ తనిఖీ కార్యక్రమంలో ఎల్బీనగర్ ఏసీపీ కృష్ణయ్య, ట్రాఫిక్ విభాగం ఏసీపీ నవీన్ కుమార్ రెడ్డి,ట్రాఫిక్ సీఐ వెంకటేశ్వర్లు వివిధ శాఖల పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

## డిఎస్ఆర్ నగర్ కాలనీకి ఆర్టీసీ బస్ నడపండి



ఎల్బీనగర్, జనవరి 09 (భారత శక్తి): బండ్లగూడ,ఆనంద్ నగర్ సర్వే నెం.58 దేవిరెడ్డి సుధీర్ రెడ్డి నగర్ పరిసర ప్రాంత ప్రజలకు బస్సు సౌకర్యం కల్పించాలని బండ్లగూడ బస్ డిపో మేనేజర్‌కు కాలనీవాసుల విన్నపం.సర్వే నెం.58 పరిధిలోని డిఎస్ఆర్ నగర్ కాలనీతో పాటు చుట్టుపక్కల కాలనీల ప్రజలు ఎదుర్కొంటున్న రవాణా ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ప్రజా రవాణా సౌకర్యాన్ని వెంటనే కల్పించాలని కోరుతూ నాగోల్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మెట్టు రవీందర్ గౌడ్ ఆధ్వర్యంలో కాలనీవాసులు జి.ఎస్.ఐ. బండ్లగూడ బస్ డిపో మేనేజర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఈ ప్రాంతంలో బస్సు సౌకర్యం లేకపోవడం వల్ల విద్యార్థులు, ఉద్యోగులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ముఖ్యంగా అత్యవసర పరిస్థితుల్లో రవాణా సౌకర్యం లేక ప్రజలు ఇక్కట్లు పడుతున్నారని పేర్కొన్నారు. కనీసం ఒక బస్సు రూట్‌ను ఈ ప్రాంతానికి మళ్లిస్తే ప్రజలకు ఎంతో ఊరట కలుగుతుందని విన్నవించారు. ఈ విన్నపాన్ని అందించే కార్యక్రమంలో మెట్టు రవీందర్ గౌడ్ తో పాటు కేతమల్ల పెద్దులు, ఎన్. సతీష్ గౌడ్, ఎల్. భద్ర ప్రసాద్, ఎల్. వెంకట్ రామ్ నాయక్, రాజేష్, రాఘవ, భూక్య రవి నాయక్, కేతావత్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.సమస్యను సానుకూలంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కారం చూపాలని వారు డిపో మేనేజర్‌ను కోరారు.



# పవిత్రమైన శాసనాలు..
# చేయాల్సిన సభ..

- దూషణలకు వేదికగా మారుతున్న దౌర్భాగ్యం..
- ప్రజా సమస్యలు పక్కదారి పట్టిస్తున్న నేతలు..
- కోట్ల ప్రజాధనం వృధాగా పోతున్నా పట్టింపులేదు..
- అసలు ఒక్కటైనా ప్రజా సమస్య పట్ల చర్చ జరుగుతోందా..?
- అందుకేనా మిమ్మల్ని గెలిపించుకుంది..
- ఇందుకోసమేనా పన్నులు కట్టి మిమ్మల్ని పోషిస్తున్నది..?
- దేవాలయం లాంటి అసెంబ్లీని దయ్యాల గుహలా మారుస్తున్నారు..
- కోట్లాదిమంది ప్రజలు చూస్తున్నారన్న ఇంగితం కూడా లేదా..?
- ఒకరేమో బట్టలు ఊడదీస్తామంటారు..
- మరొకరేమో నాలుక కత్తరిస్తామంటారు..
- రాజ్యాంగబద్ధమైన చట్టసభల్లో ఉన్నారా..? రౌడీల్లా బజార్లో ఉన్నారా..?
- సిగ్గూ ఎగ్గూ లేని నాయకుల్లారా మీకు ఎలా చెబితే అర్థం అవుతుంది..?
- శాసనసభ వ్యవహారాలపై " ఫోరం ఫర్ యాంటీ కరప్షన్ అండ్ హ్యూమన్ రైట్స్ సంస్థ " అందిస్తున్న ప్రత్యేక కథనం..

**(స్పెషల్ కరస్పాండెంట్ ) హైదరాబాద్, జనవరి 09 ( భారత శక్తి ) :**

అసలు శాసనసభ సమావేశాలు అంటే ఏమిటి? అవి అధికార పక్షం, విపక్షం పరస్పరం దూషించుకునే వేదిక కాదు. అవి అరుపులు, హంగామా, వాక్‌ఔట్ల కోసం నిర్వహించే కార్యక్రమాలు కావు. నిజానికి శాసనసభ అంటే.. ప్రజల గళం వినిపించే సభ.. ప్రజా సమస్యలపై చర్చ జరిగే వేదిక.. ప్రజా ధనం ఎలా ఖర్చవుతుందో ప్రశ్నించే ఒక కార్యాలయం.. ప్రజల జీవితాలను ప్రభావితం చేసే చట్టాలు రూపుదిద్దుకునే అద్భుత కేంద్రం..

*** శాసనసభ సమావేశాల అసలు ఉద్దేశ్యం ఏమిటి? అందరూ తెలుసుకోవాలి..**

**ప్రజా సమస్యలపై చర్చ :**

రైతు ఆత్మహత్యలు, నిరుద్యోగం, విద్య-వైద్యం, ధరల పెరుగుదల, సంక్షేమ పథకాల అమలు.. ఇలాంటి విషయాలు శాసనసభ చర్చల కేంద్ర బిందువులు కావాలి. కానీ వాస్తవంలో వ్యక్తిగత విమర్శలు, రాజకీయ కక్షలే ప్రధాన అంశాలుగా మారుతున్నాయి. ప్రభుత్వంపై నియంత్రణ తీసుకువచ్చే వేదిక అసెంబ్లీ.. అధికార పక్షం తీసుకున్న నిర్ణయాలు సరైనవేనా? ప్రజా ధనం ఎక్కడ ఖర్చవుతోంది? ఎంత ఖర్చు అవుతోంది..? ఇచ్చిన హామీలు అమలయ్యాయా లేదా? ఇవన్నీ ప్రశ్నించాల్సింది శాసనసభలోనే.

**చట్టాల రూపకల్పన :**

ప్రజల అవసరాలకు అనుగుణంగా కొత్త బిల్లులు ప్రవేశపెట్టాలి. ఉన్న చట్టాల్లో లోపాలుంటే సవరించాలి. కానీ నేడు బిల్లులు చర్చ లేకుండా, గంటల్లోనే ఆమోదం పొందుతున్నాయి. ప్రజా ధన వినియోగం పై చర్చ జరగాలి.. శాసనసభ సమావేశాలకు రోజుకు కోట్ల రూపాయలు ఖర్చవుతాయి. ఆ ఖర్చు రాజకీయ డ్రామాల కోసం కాదు.. ప్రజా ప్రయోజనాల కోసం. సభలో ప్రతి విషయానికి అడ్డుపడే పద్ధతి ఏదైతే వుందో.. ఆపద్ధతి ప్రజా ధనాన్ని తగలబెట్టేస్తోంది..

*** అసలు అధికార పక్షం పాత్ర ఏంటి? :**

అధికారంలో ఉన్నది పాలించడానికి, సమాధానం చెప్పడానికి. విపక్షాన్ని అణిచివేయడానికి కాదు. ప్రజా సమస్యలపై చర్చకు భయపడితే అది ప్రజాస్వామ్యంపై అవిశ్వాసం ప్రకటించినట్లే..

*** విపక్షాల బాధ్యత ఏంటి? :**

విపక్షం అంటే ప్రతి దానికి అడ్డుపడటమే కాదు. నిజాయితీగా ప్రభుత్వ లోపాలను ఎత్తిచూపాలి.



విధానాలపై గట్టి చర్చ చేయాలి.


కానీ సభను పూర్తిగా స్తంభింపజేయడం ద్వారా ప్రజలకు ద్రోహం చేయకూడదు.

**నేటి శాసనసభలు: ఒక చేదు వాస్తవం :**

సభ నడవకుండానే రోజులు ముగుస్తున్నాయి.. ప్రజా సమస్యలు పక్కకు నెట్టబడుతున్నాయి.. వ్యక్తిగత విమర్శలే మీడియాలో హెడ్‌లైన్లు అవుతున్నాయి.. దీంతో ప్రజలు శాసనసభపై విశ్వాసం కోల్పోతున్నారు.. నిజంగా ఇది ప్రజాస్వామ్యానికి ప్రమాదకర సంకేతం.

**మార్పు ఎక్కడ నుంచి రావాలి? :**

సభ్యులకు శాసనసభ అంటే సేవ అనే భావన రావాలి.. ప్రజలు తమ ప్రతినిధులను ప్రశ్నించాలి.. మీడియా అరుపులకన్నా విషయాలను హైలైట్ చేయాలి.. బాధ్యతగా వ్యవహరించాలి.. సభకు ఎవరైనా సరే అడ్డుపడితే ప్రజలే కాలరు పట్టుకుని నిలదీసి అడగాలి..



శాసనసభలు ప్రజల ఆస్తి. అవి రాజకీయ యుద్ధభూములు కావు.. ప్రజా భవితవ్యం రూపుదిద్దుకునే ఆలయాలు. అక్కడ మాటకు అర్థం ఉండాలి... చర్చకు గౌరవం ఉండాలి... తీర్మానాలకు బాధ్యత ఉండాలి... అప్పుడే శాసనసభలు నిజమైన ప్రజాస్వామ్యానికి ప్రతీకలవుతాయి. దయచేసి అందరూ ఒకసారి ఆలోచించాలి..

---



## ఎల్.బి.నగర్ డివిజన్
# ఏర్పాటు దిశగా అడుగులు

**: మంత్రి శ్రీధర్ బాబుకు విన్నపం.**

ఎల్.బి.నగర్, జనవరి 9 (భారత శక్తి) : శుక్రవారం రోజున ఎల్.బి.నగర్‌ను ప్రత్యేక డివిజన్‌గా ఏర్పాటు చేయాలనే సుదీర్ఘ కాలపు డిమాండ్ సాకారం అయ్యే దిశగా కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ అంశాన్ని రంగారెడ్డి జిల్లా ఇంచార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు దృష్టికి తీసుకువెళ్లడంలో తెలంగాణ రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి చొరవ చూపారు. ఎల్.బి.నగర్ నియోజకవర్గ పరిధిలోని సమస్యల పరిష్కారం, పాలనా సౌలభ్యం కోసం ప్రత్యేక డివిజన్ ఏర్పాటు ఆవశ్యకతను మంత్రికి వివరించడంలో మల్‌రెడ్డి రాంరెడ్డి పోషించిన పాత్రపై స్థానిక నాయకులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గ ప్రజల తరపున ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. డివిజన్ ఏర్పాటు ద్వారా మౌలిక సదుపాయాల కల్పనతో పాటు ప్రభుత్వ



పథకాలు ప్రజలకు మరింత చేరువవుతాయని ఈ సందర్భంగా ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న సీనియర్ నాయకులు : ఆడాల రమేష్,ఎండి జానీ మియా, నిమల్లూరు శ్రీనివాస్,గడ్డిఅన్నారం ఏ.ఎం.సీ డైరెక్టర్ పన్యాల జైపాల్ రెడ్డి, అల్లి భాస్కర్ యాదవ్, గుండెల కిరణ్ కుమార్,రాజ్ కుమార్, చంద్రశేఖర్, మెట్టు జీవన్ రెడ్డి, అరుణ్ అంబేద్కర్, గుర్రం సతీష్, రాజు గౌడ్, ఆనంద్ కన్నా, జయంత్ కిట్టు, భాను చందర్, గోపి, అస్సాం, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ రహిత 'మేడారం' వైపు అడుగులు..
# పర్యావరణ సంస్థ గోడపత్రికను ఆవిష్కరించిన గవర్నర్!

హైదరాబాద్ (భారతశక్తి): ఆసియాలోనే అతిపెద్ద గిరిజన మహాజాతరగా పేరుగాంచిన మేడారం సమ్మక్కసారలమ్మ జాతరను కాలుష్యరహితంగా నిర్వహించాలని ప్రపంచ పర్యావరణ సంస్థ పిలుపునిచ్చింది. ఈనెల 28 నుంచి 31 వరకు జరగనున్న ఈ మహా వేడుకకు దాదాపు 2.50 కోట్ల మంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించేందుకు సంస్థ సమాయత్తమైంది.

**క్లీన్ మేడారం - గ్రీన్ మేడారం**

ప్రపంచ పర్యావరణ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ సిహెచ్ భద్ర ఆలోచన మేరకు, గత 14 ఏళ్లుగా సంస్థ మేడారంలో ప్లాస్టిక్ వ్యతిరేక ప్రచారాన్ని నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా సంస్థ జాతీయ కార్యదర్శి సిహెచ్ సాగర్ నేత సోమవారం ఒక ప్రకటన విడుదల చేస్తూ పలు కీలక అంశాలను వెల్లడించారు. ఉచిత క్లాత్ బ్యాగుల పంపిణీ: ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించేందుకు గత 14 ఏళ్లుగా లక్షలాది క్లాత్ మరియు జ్యూట్ బ్యాగులను భక్తులకు ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.





అవగాహన ర్యాలీలు: ఈ ఏడాది కూడా వేలాది మంది వాలంటీర్లతో ప్రదర్శనలు, అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయబోతున్నట్లు వివరించారు. పర్యావరణ పరిరక్షణ: కోట్లాది మంది రాకతో మేడారం పరిసరాలు కాలుష్యం బారిన పడకుండా చూడటమే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

**గవర్నర్ ప్రశంసలు**

తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ శర్మను కలిసిన సంస్థ ప్రతినిధి బృందం, జాతరపై రూపొందించిన ప్రత్యేక గోడపత్రికను ఆవిష్కరించింది. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ కోసం సంస్థ చేస్తున్న కృషిని అభినందించారు. "ఎవరూ చేయని గొప్ప పనిని ప్రపంచ పర్యావరణ సంస్థ చేస్తోంది. ప్రతి ఒక్కరూ బాధ్యతయుతమైన పౌరులుగా 'క్లీన్ మేడారం గ్రీన్ మేడారం సేవ్ మేడారం' నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి. ఈ కార్యక్రమానికి నా పూర్తి సహకారం ఉంటుంది." జిష్ణు దేవ్ శర్మ, గవర్నర్. ఈ కార్యక్రమంలో ప్రపంచ పర్యావరణ సంస్థ ప్రతినిధులు ఇ.వి. శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి నిఖిల్ సాయి, కోశాధికారి రిజ్వాన్, జాతీయ యువజన కార్యదర్శి సుమీర్ తదితరులు పాల్గొన్నారు. పర్యావరణ ప్రేమికులు, స్వచ్ఛంద సంస్థలు ఈ 'క్లీన్ మేడారం' ఉద్యమంలో భాగస్వాములు కావాలని సంస్థ కోరుతోంది.

# జిహెచ్ఎంసి హైదరాబాద్ వద్దు – సైబరాబాద్ ముద్దు"

*** కలిసికట్టుగా పోరాడితే విజయం మనదే**
**: ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి**

ఎల్బీనగర్, జనవరి 09 (భారత శక్తి): మహేశ్వరం నియోజకవర్గ పరిధిలో ఇటీవల జిహెచ్ఎంసిలో విలీనమైన తుక్కుగూడ, మంకాల ప్రాంతాలకు చెందిన ముఖ్య నాయకులతో మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే శ్రీమతి సబితా ఇంద్రారెడ్డి తన కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిహెచ్ఎంసి విలీనంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మా ప్రాంతాలను జిహెచ్ఎంసిలో కలిపి హైదరాబాద్‌లో విలీనం చేయడం ఆందోళనకరమని, దీని వల్ల రంగారెడ్డి జిల్లా స్వరూపమే మారిపోతుందని విమర్శించారు. ముఖ్యంగా పాత బడంపేట్ మున్సిపల్ కార్పొరేషన్, మీర్పేట్ మున్సిపల్ కార్పొరేషన్, జల్పల్లి మున్సిపాలిటీ, తుక్కుగూడ, మంకాల ప్రాంతాలను హైదరాబాద్‌లో కలపడం వల్ల స్థానిక ప్రజలు తీవ్రంగా నష్టపోతారని ఆందోళన వ్యక్తం చేశారు. సరైన ఉద్యమ కార్యాచరణతోనే జిహెచ్ఎంసి హైదరాబాద్ వద్దు సైబరాబాద్ ముద్దు ఖచ్చితంగా సాధించుకుంటామని స్పష్టం చేశారు. రాబోయే జిహెచ్ఎంసి ఎన్నికలకు ఇప్పటి నుంచే అందరూ సంసిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. సమిష్టిగా



పోరాడితే ప్రతి రంగంలో విజయం మనదేనని నాయకులు, కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. ఈ సమావేశంలో జిహెచ్ఎంసిలో విలీనమైన తుక్కుగూడ, మంకాల ప్రాంతాలకు చెందిన ముఖ్య నాయకులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy.